శిర్డీ సాయినాథునికి బంగారు అక్షరాల
**ఓం సాయి రామ్ కానుక**



2

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - బుధవారం 5 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 211 | పేజీలు:12 | వెల రూ.5

## 18 ఏండ్ల ప్రొఫెసర్



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



# రిక్రూట్‌మెంట్‌పై రాజకీయ కుట్రలు!?

## పోలీసు నియామకంపై నిఘా పెట్టాలె

- పకడ్బందీగా, పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించండి
- పోలీసు పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక దృష్టి..
- సైబర్ క్రైం విభాగం అలర్ట్‌గా పని చేయాలె
- సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 4 (మనం బ్యూరో): పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు సీఎంకు కీలక సమాచారం అందించాయి. ఈ ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో మంగళవారం డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు

...మిగతా 2లో

## జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

### ప్రధాని వీడియో తొలగింపుపై పార్లమెంటు స్థాయీ సంఘం డిమాండ్




ఢిల్లీ, ఆగస్టు 4: ప్రధాని మోడీ వీడియోను ఫేస్‌బుక్ నుంచి తొలగించినందుకు మెటా అధినేత జుకర్‌బర్గ్ వ్యక్తిగతంగా క్షమాపణ చెప్పాలని ఐటీ వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం అధ్యక్షుడు నిశికాంత్ దుబే డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు స్థాయీ సంఘం సభ్యులు కోరారు. గూగుల్, మెటా, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమ సంస్థల ప్రతినిధులు సోమవారం పార్లమెంటరీ కమిటీ ఎదుట హాజరయ్యారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫేస్‌బుక్ పోస్ట్‌ను మెటా గ్లోబల్ టీమ్ కొన్ని క్షణాల పాటు నిలిపివేసిన నేపథ్యంలో ప్రభుత్వం వారికి గత వారం సమన్లు జారీ చేసింది. ఆ ఫేస్‌బుక్ పోస్ట్‌లో ప్రధాని మోడీ పేపర్ లీక్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పోస్ట్‌ను నిలిపివేసిన నేపథ్యంలో జరిగిన ఆ సమావేశంలో కేంద్ర హోం, ఐటీ శాఖల ప్రతినిధులతోపాటు స్నాప్‌చాట్, గూగుల్, ఎక్స్ (గతంలో ట్విట్టర్),

...మిగతా 2లో

## ఆయుష్‌లో మందుల కొనుగోలుమాల్

### టెండర్లు లేకుండానే రూ.3.50 కోట్ల కొనుగోళ్లు

### విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 04, (మనం బ్యూరో): ఆయుష్ విభాగంలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. తెలంగాణ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చేసిన ఫిర్యాదు, ముఖ్యమంత్రి కార్యాలయం ఎండార్స్‌మెంట్ ఆధారంగా అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్‌ను ప్రభుత్వం కోరింది. ఫోరం తన ఫిర్యాదులో నేషనల్ ఆయుష్ మిషన్ నిదులతో సుమారు రూ.3.50 కోట్ల విలువైన ముడి, సంయోగ ఔషధాలను టెండర్ నోటిఫికేషన్ లేకుండా నిపుణుల కమిటీ అనుమతి పొందకుండా నేరుగా రెండు సంస్థల నుంచి కొనుగోలు చేసినట్లు ఆరోపించింది. ప్రభుత్వం

...మిగతా 2లో

## బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలి

- పరారీలో ఉన్న నేరస్తుల అక్రమ ఆస్తుల రికవరీ ఎంతో అవసరం
- కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా
- హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం

2




## సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వాఫీసుల్లో టీ ఫైబర్ నెట్

### గడువు తరువాత ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దు

### టీ ఫైబర్ సమీక్ష సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 4, మనం బ్యూరో: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 1 నుంచి టీ ఫైబర్ నెట్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. ఆ గడువు దాటిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవల నిమిత్తం ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో టీ ఫైబర్‌పై అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ టీ ఫైబర్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.300 కోట్ల నుంచి 400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందన్నారు. గత ఆరు నెలల్లో రాష్ట్రంలోని 4487 ప్రభుత్వ కార్యాలయాలకు టీ ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ అందించేందుకు

...మిగతా 2లో





ఈ ఏడాది చివరి నాటికి

## వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

- నిమ్స్ తరహాలో ఎల్‌వోసీలు మంజూరు చేస్తం
- సూపరింటెండెంట్‌గా అడిషనల్ డీఎంఈని నియమిస్తం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఆసుపత్రులపై మంత్రి దామోదర సమీక్ష

హైదరాబాద్, ఆగస్టు 4 (మనం బ్యూరో): ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య,

...మిగతా 2లో

## సింగరేణికి బీఆర్ఎస్ హయాంలో రూ.54వేల కోట్ల బకాయిలు

- దీనిపై చర్చించేందుకు సిద్ధమా? అంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సవాల్



ఢిల్లీ, ఆగస్టు 4: సింగరేణికి ఎవరి హయాంలో నష్టం జరిగిందో చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్ధమా? అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబం వల్ల ఆ సంస్థకు ఎంతో నష్టం జరిగిందని విమర్శించారు. ఢిల్లీలోనిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి రూ.54వేల కోట్ల బకాయిలు పెట్టిందని.. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తామన్నారు.

**ప్రధానిపై 'అబ్జెక్షనబుల్' వీడియోలు..**

ప్రధాని మోడీని విమర్శిస్తూ సోషల్ మీడియాలో కొందరు అభ్యంతరకర వీడియోలు పోస్ట్ చేశారని కేంద్ర మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసేలా

...మిగతా 2లో

## కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలు

నోటిఫికేషన్ విడుదల చేసిన యూనివర్సిటీ

12 తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు అవకాశం

3

## భూమికి 'జల'కళ.. సాగుకు భరోసా!

పంద్రాగస్టు నాటికి 13 వేల వ్యవసాయ కుంటలు!

పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్



3

## నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూత



ముంబై, ఆగస్టు 4: ప్రముఖ నటుడు ప్రదీప్ సింగ్ రావత్ (74) కన్నుమూశారు. ముంబయిలోని నివాసంలో గుండెపోటుతో ఆయన మృతిచెందారు. తెలుగుతో పాటు వివిధ భాషల్లో ఆయన నటించారు. సై, ఛత్రపతి, గజిని చిత్రాల్లో పోషించిన ప్రతినాయకుడి పాత్రలు ఆయనకు మంచిపేరు తీసుకొచ్చాయి.



## థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే నో ఫ్యూయల్: సుప్రీం కోర్టు

ఢిల్లీ, ఆగస్టు 4: ఇన్సూరెన్స్ లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరగడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇందుకు సంబంధించి కీలక తీర్పు వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం.. వీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ముఖ్యంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించాలని, ఇందుకోసం ఓ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని సూచించింది. మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనలను పాటించకపోవడాన్ని ప్రస్తావించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన

...మిగతా 2లో

## సూకీ సజీవంగానే ఉన్నారు!

ఫొటోలు విడుదల చేసిన మయన్మార్ ప్రభుత్వం

బ్యాంకాక్, ఆగస్టు 4: మయన్మార్ మాజీ అధినాయకురాలు ఆంగ్ సాన్ సూకీ జీవించే ఉన్నారని తెలిపే

...మిగతా 2లో






## ప్రజా పోరాటాలతోనే ఈ 20 నుంచి విముక్తి

### ఇథనాల్ పెట్రోల్‌పై అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ, ఆగస్టు 4: ఈ 20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనను దేశవ్యాప్తంగా మరింత ఉద్ధృతం చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. దీని నుంచి దేశ ప్రజలకు విముక్తి కలగాలంటే వందల మంది సరిపోరని.. పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాడాలని

...మిగతా 2లో

ఆర్థిక ఇబ్బందులతో అష్టకష్టాలు

## జుట్టు, వ్యక్తిగత వస్తువులు అమ్ముకుంటున్న ఇరానీయులు

### యుద్ధం కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణం.. క్షీణించిన ప్రజల కొనుగోలు శక్తి



టెహ్రాన్, ఆగస్టు 4: అమెరికాతో దాదాపు ఆరునెలలుగా కొనసాగుతోన్న యుద్ధం కారణంగా ఇరానీయులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, క్షీణిస్తున్న కొనుగోలు శక్తితో పేద కుటుంబాలు సతమతమవుతున్నాయి. మనుగడ కోసం అనేక మార్గాలు అన్వేషిస్తున్న ప్రజలు.. తల వెంట్రుకలు, పర్ఫ్యూమ్ బాటిళ్లు, వ్యక్తిగత, వాడుక వస్తువులను విక్రయిస్తున్నట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. అంతేకాదు, వ్యక్తిగత వస్తువులనూ అద్దెకు ఇస్తున్నట్లు సమాచారం

...మిగతా 2లో

## సింగరేణికి బీఆర్ఎస్ హయాంలో రూ.54వేల కోట్ల బకాయిలు

(మొదటి పేజీ తరువాయి)

రెచ్చగొట్టే వీడియోలు పెట్టారన్నారు. హైదరాబాద్ లో బీజేపీ కార్యకర్త సాయికిరణ్ గౌడ్ ఫిర్యాదుతో కేసు నమోదైందని చెప్పారు. కేసు నమోదు చేసిన పోలీసులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆయన ఆరోపించారు.

## ప్రజా పోరాటాలతోనే ఈ 20 నుంచి విముక్తి

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా సేకరించిన దాదాపు 2.30 లక్షల వినతి పత్రాలతో మంగళవారం ప్రధానమంత్రి నివాసం వైపు ప్రదర్శనగా వెళ్తున్న కేజ్రీవాల్, ఆప్ నాయకులను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాము సేకరించిన వినతి పత్రాలను ప్రధానికి అందిస్తామని.. తమ వినతిని పీఎంఓకు చేరవేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడుతూ.. 'గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఆప్ ఎమ్మెల్యేలు ఉన్నారు. అక్కడ కూడా ఈ 20 విధానాన్ని వ్యతిరేకిస్తాం. పార్లమెంటులో ఈ అంశాన్ని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రస్తావించగా ఈ 20 అమలుకే మొగ్గుచూపుతున్నట్లు కేంద్రం నుంచి సమాధానం వచ్చింది. ఈ విధానం వల్ల భారత రైతులకు కాకుండా అమెరికా రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు నిలిపివేసి భారత రైతుల ప్రయోజనాలను కాపాడాలి'' అని ఆయన డిమాండ్ చేశారు.

## జుట్టు, వ్యక్తిగత వస్తువులు అమ్ముకుంటున్న ఇరానీయులు

(మొదటి పేజీ తరువాయి)

వెలువడుతోంది. యుద్ధం వేళ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు.. ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను విక్రయిస్తున్నారు. శిరోజాలు అమ్ముకోవడం, ఉపయోగించిన పర్ఫ్యూమ్ బాటిళ్లు, షూలు, దుస్తులు.. తదితర వస్తువులను ఆన్ లైన్లో అమ్మకానికి పెడుతున్నారు. పొడవైన జుట్టు (రంగు, నాణ్యతను బట్టి) వేలాది ఇరాన్ రియాల్స్ పలుకుతోంది. ల్యాప్ టాపులున్న వారు వాటిని అద్దెకిస్తున్నారు. ఈ అమ్మకాలకు సంబంధించి ఆన్ లైన్ లోనూ ప్రకటనలు విరివిగా ఇస్తున్నారు.

అంతర్జాతీయ ఆంక్షలు, అంతర్గత సమస్యలను ఎదుర్కొంటున్న ఇరాన్లో ఇటీవల ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరగడంతో అక్కడి ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. అధికారిక గణాంకాల ప్రకారం.. జులై చివరలో వార్షిక ద్రవ్యోల్బణం 66 శాతానికి ఎగబాకింది. సాధారణ గృహ వినియోగ ధరలు విపరీతంగా పెరిగాయి. తీవ్ర ద్రవ్యోల్బణంతో ఆహారమే కాకుండా ఇతర వస్తువులపై ఖర్చులను తగ్గించుకుంటున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, ఔషధాలకయ్యే ఖర్చులను కూడా వాయిదాల్లో చెల్లిస్తున్నారని స్థానిక మీడియాల్లో కథనాలు వస్తుండడమం గమనార్హం.

## సూకీ సజీవంగానే ఉన్నారు!

(మొదటి పేజీ తరువాయి)

చిత్రాలను ప్రస్తుత సైనిక ప్రభుత్వం విడుదల చేసింది. ఆమె సోమవారం అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ ప్రతినిధుల్ని కలిసినట్టు తెలియజేసే చిత్రాలను దేశ అధ్యక్ష పత్రికా సమాచార బ్యూరో వెల్లడించింది. తన తల్లి బతికే ఉన్నట్టు తెలిపే సాక్ష్యం చూపండి అంటూ లండన్‌లో నివసిస్తున్న సూకీ చిన్న కుమారుడు కిమ్ యారిస్ చేపట్టిన ఆన్‌లైన్ ప్రచారం నేపథ్యంలో ఈ చిత్రాలు విడుదల కావడం విశేషం. 2021లో సైన్యం మయన్మార్ అధికారాన్ని కబళించిన నాటి నుంచీ నిర్బంధంలో ఉన్న సూకీ బయటి వ్యక్తుల్ని కలవడం ఓ అరుదైన ఘటన. అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ మయన్మార్ ప్రతినిధి అర్నౌద్ దె బేక్‌తో కరచాలనం చేస్తున్న రెండు చిత్రాలను పత్రికా సమాచార బ్యూరో విడుదల చేసింది. ఈ సమావేశం సోమవారం ఉదయం చోటు చేసుకుందని తెలిపిన బ్యూరో అది ఎక్కడ జరిగిందో వెల్లడించలేదు.



## 18 ఏండ్ల ప్రొఫెసర్

**ఫ్లోరిడా, ఆగష్టు 4:** అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన అమెరికాకు చెందిన నాథన్ థామస్. 18 ఏండ్ల వయస్సులోనే ప్రొఫెసర్ గా నియమితుడై యూనివర్సిటీలో పీజీ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన ప్రొఫెసర్ గా గిన్నిస్ వరల్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు.నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యూయల్ డిగ్రీ మియామీ కాలేజీలో చేరి 14 ఏండ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు అందుకున్నాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతో పాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్లో డిగ్రీ చదువుతున్న చదువుతున్నాడీ చిన్ని ప్రొఫెసర్.

# బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలి

- హైదరాబాద్‌లో ప్రారంభమైన బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం



**హైదరాబాద్, ఆగస్టు 4 ( మనం బ్యూరో ):** పరారీలో ఉన్న నేరస్తులను పట్టుకోవడానికి, అక్రమ ఆస్తులను రికవరీ చేయడానికి బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని కేంద్ర ప్రభుత్వ సిబ్బంది, శిక్షణ విభాగం కార్యదర్శి రచనా షా అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే బ్రిక్స్ అవినీతి నిరోధక వర్కింగ్ గ్రూప్ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన రచనా షా మాట్లాడుతూ సుస్థిరమైన సమ్మిళితత్వంతో కూడిన అభివృద్ధికి, అవినీతి ప్రధాన ఆటంకంగా ఉందని తెలిపారు. ఇది ఆసుపత్రులు, పాఠశాలలు, కీలకమైన మౌలిక వసతుల నుంచి పరిమిత ప్రజా వనరులను మళ్లిస్తుందనీ, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. సమగ్రత, జవాబుదారీతనం, అంతర్జాతీయ సహకారం, ఆవిష్కరణలను బలోపేతం చేయడం అత్యంత ముఖ్యమైనదిగా మారిన ఈ సమయంలో బ్రిక్స్ రెండో సమావేశం జరుగుతోందని తెలిపారు. సీమాంతర అవినీతిని ఎదుర్కోవడంపై తన ఉమ్మడి బాధ్యతను బ్రిక్స్ ఆచరణాత్మక సహకారంగా స్పష్టమైన ఫలితాలుగా మార్చాలని పేర్కొన్నారు. పరారీలో ఉన్న ఆర్థిక నేరస్తుల వల్ల ఎదురవుతున్న సవాళ్ల గురించి ఆమె ప్రస్తావిస్తూ నేరాల నుంచి లబ్ధి పొందే వారికి ఏ దేశమూ ఆశ్రయంగా మారకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించడంతో పాటు వారి అప్పగింతకు సహకరించడం, దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకోవడం, నేరస్తులు, అక్రమ నిధులు సరిహద్దులు దాటి తరలిపోవడానికి అవకాశం కల్పిస్తున్న లోపాలను తొలగించడంలో బలమైన సహకారం అవసరమని ఈ సందర్భంగా రచనా షా పిలుపునిచ్చారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా అవినీతికి పాల్పడి పరారైన నేరస్తుల అన్వేషణ, అప్పగింతకు మద్దతు ఇచ్చే అనధికారిక సమాచారంపై బ్రిక్స్ రిపాజిటరీ, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాక్టీషనర్ల నెట్‌వర్క్, అసెట్ రికవరీ నిపుణుల నెట్‌వర్క్‌పై చర్చలు జరుగనున్నాయి.

## వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించే విధంగా వరంగల్ రీజనల్ కేన్సర్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై మంత్రి కొండా సురేఖతో కలసి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జనరల్ హాస్పిటళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. తమ నియోజకవర్గాల్లోని హాస్పిటళ్లలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, హాస్పిటళ్ల బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేలు మంత్రికి వివరించారు. ఎమ్మెల్యేల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలనీ, వారు పేర్కొన్న సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. నిమ్స్ తరహాలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు ఎల్‌వోసీలు మంజూరు చేస్తామనీ, అత్యాధునిక పరికరాలు, అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బందితో పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎంజీఎం హాస్పిటల్‌కు అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌ను రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమిస్తామని ప్రకటించారు. జనగామ, నర్సంపేట జనరల్ హాస్పిటళ్లు మెడికల్ కాలేజీలను మరింత అభివృద్ధి చేస్తామనీ, హన్మకొండలో ఐవీఎఫ్ సెంటర్‌తో పాటు డ్రగ్ అండ్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ హాస్పిటళ్ల పనితీరును మరింతగా మెరుగుపరిచేందుకు ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని ఎమ్మెల్యేలు చేసిన ప్రతిపాదనను పరిశీలిస్తామని ఈ సందర్భంగా మంత్రి దామోదర హామీ ఇచ్చారు.

## శిర్డీ సాయినాథునికి బంగారు అక్షరాల 'ఓం సాయి రామ్' కానుక

**శిర్డీ, ఆగష్టు 4:** శిర్డీ సాయిబాబాకు దుబాయికి చెందిన భక్తులు అరుదైన కానుక అందించారు. కొన్ని నెలల క్రితం శిర్డీలో సాయిబాబాను దర్శించుకున్న కచ్రూ కుటుంబం 'ఓం సాయి' అని హిందీలో రాసి ఉన్న బంగారు అక్షరాలను కానుకగా ఇచ్చింది. దాదాపు 270 గ్రాములున్న ఈ అక్షరాల విలువ రూ.27 లక్షలు. తాజాగా 'రామ్' అనే అక్షరాలను బంగారంతో తీర్చిదిద్ది సాయి సంస్థాన్ కు అందజేశారు. 76.3 గ్రాములున్న వీటి విలువ సుమారు రూ.10 లక్షలు. అధికారులు ఈ అక్షరాలను ద్వారకామాయిలో బాబా కొలువై ఉన్న గోడపై ప్రతిష్ఠించారు.

## జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

మెటా (ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఘటనకు సాంకేతిక లోపమే కారణమని, ప్రధాని పోస్ట్‌ను పొరపాటున తొలగించామని, తర్వాత పునరుద్ధరించామంటూ ఫేస్‌బుక్-మెటా క్షమాపణలు కోరింది. ఆ వివరణ సరిపోదు అని ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖ భావించింది. ఈ విషయం కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించినది మాత్రమే కాదని, జాతీయ భద్రత, శాంతిభద్రతలకు సంబంధించినదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## సెప్టెంబర్ 1 నుంచి ప్రభుత్వాఫీసుల్లో టీ ఫైబర్ నెట్

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశామన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే సుమారు రూ.13 కోట్లు ఆదా అయిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సేవలను యుద్ధ ప్రాతిపదికన అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియలో తలెత్తే లోపాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే రాబోయే రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. టీ నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భారత్ ఫ్యూచర్ సిటీకి పూర్తి స్థాయిలో అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే, ఇంటింటికి ఇంటర్నెట్‌ను అందించే ప్రక్రియను వేగవంతం చేయాలనీ, దీని కోసం ప్రిన్సిపల్ మానిటైజేషన్ పార్ట్‌నర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ ఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్‌లో మందుల కొనుగోలుమాల్

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే జీవోఆర్‌టి నం.288 ద్వారా టెండర్ కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ ఆ నిబంధనలను పాటించలేదని పేర్కొంది. అలాగే కొనుగోలు చేసిన మందుల్లో సుమారు రూ.70 లక్షల విలువైన కర్పూర తైలం నాణ్యత లేనిదిగా అందులో 90 శాతం కొబ్బరి నూనె మాత్రమే ఉన్నట్లు గురించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొన్ని సంస్థలు మందులు సరఫరా చేయకుండానే వారికి చెల్లింపులు కూడా జరిపినట్లు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ప్రభుత్వం మార్చి-ఏప్రిల్ 2024లో జరిగిన ఔషధాల కొనుగోలు ఫైళ్లను పరిశీలించి నిబంధనల ప్రకారం సమగ్ర విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయుష్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది.

## రిక్రూట్‌మెంట్‌పై రాజకీయ కుట్రలు!?

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో సీఎం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా ప్రశ్న పత్రాల ముద్రణ, తయారీ, రవాణాలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలనీ, ముఖ్యంగా కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలనీ, పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకూ సైబర్ సెక్యూరిటీ వింగ్, ఇంటలిజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## ఈషా సింగ్‌కు సన్మానం



**హైదరాబాద్,ఆగస్టు 4(మనం న్యూస్):** హాంగ్జౌ, చైనాలో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ పిస్టల్ షూటింగ్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి భారత దేశానికి గర్వకారణంగా నిలిచిన ప్రముఖ షూటర్ ఈషా సింగ్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోని బాలాదేవి సన్మానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఈషా సింగ్‌కు డాక్టర్ సోని బాలాదేవి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె సాధించిన ఈ విజయం దేశ కీర్తిని అంతర్జాతీయ వేదికపై మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు.పిస్టల్ షూటింగ్ విభాగంలో వరుసగా రెండు ప్రపంచకప్ స్వర్ణ పతకాలను గెలుచుకున్న తొలి షూటర్‌గా ఇషా సింగ్ చరిత్ర సృష్టించడం ఎంతో గర్వకారణమని ఆమె కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి మరెన్నో విజయాలు సాధించి భారతదేశానికి, తెలంగాణకు మరిన్ని అంతర్జాతీయ కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ, ఇషా సింగ్‌కు డాక్టర్ ఎ. సోని బాలాదేవి శుభాకాంక్షలు తెలిపారు.

## థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే నో ఫ్యూయల్: సుప్రీం కోర్టు



(మొదటి పేజీ తరువాయి)

ధర్మాసనం.. దేశంలోని రహదారులపై తిరుగుతున్న వాటిలో సగానికిపైగా వాహనాలకు బీమా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. బీమా లేని వాటికి బంకుల్లో పెట్రోల్/ డీజిల్ నిరాకరించడం వల్ల రెండు ప్రయోజనాలు ఉంటాయని సుప్రీం కోర్టు పేర్కొంది. బీమా లేని వాహనాలను గుర్తించడం, మరోవైపు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉందా?లేదా అనే విషయం యజమానులకు తెలియజేయడంలో దోహదపడుతుందని అభిప్రాయపడింది. జాతీయ రహదారులపై భారీ సంఖ్యలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, టోల్ ప్లాజాల వద్ద ఏర్పడుతున్న పొడవైన క్యూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఇటువంటి కారిడార్లలో పైలట్ ప్రాజెక్టులను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# సన్నాలకు సున్నాలొద్దు?

- బోనస్ దుర్వినియోగం? కావద్దు
- సన్నాలకు బోనస్.. ఇకనుంచి వరిపై పక్కా లెక్కలు
- వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- అత్యదిక మేలు రకం పంటలుగా 7 సన్న రకాలను గుర్తించిన ప్రభుత్వం
- విత్తన కొనుగోలు నుంచే ఆన్‌లైన్‌లో వివరాల నమోదు.. డీలర్లకు ఆదేశాలు జారీ
- నమోదు కాని రైతులకు బోనస్ లేనట్లే



**హైదరాబాద్,** మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో గత కొంత కాలంగా రైతులను పట్టించుకొని ప్రభుత్వం ఎట్టకేలకు ఓ అడుగు ముదుకు వేసింది. అరుగాలం చెమటోడ్చి అన్నదాత పండించిన పంటకు మంచి రోజులు రానున్నట్లు ప్రభుత్వం చెప్తొంది. సన్నరకం వరిపై లెక్కలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో సన్నాలకు ఇచ్చే బోనస్ దుర్వినియోగం కాకుండా, దళారుల చేతుల్లోకి వెళ్లకుండా ఉండేందుకు 2026 వానాకాలం సీజన్ నుంచి ప్రత్యేక విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. సన్నరకం సాగు చేస్తున్న రైతులు విత్తనాల కొ నుగోలు నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖాధికారులకు ఆ దేశాలు జారీ చేసింది. జిల్లాలో ఎన్ని ఎకరాల్లో సన్నరకం వరి సాగువుతున్నది స్పష్టంగా నిర్ధారించేందుకు విత్త నాల కొనుగోలు నుంచే లెక్కల వివరాలను ఎప్పటి కప్పుడు డీలర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. అయితే, (ఏఈఓలు) వ్యవసాయ విస్తరణాధి కారుల వద్ద ఉన్న లెక్కలతో ఇవి సరిపోలాలని, ఏ మాత్రం తేడా ఉండరాదని పేర్కొంది. డీలర్ల వద్ద కాకుండా సొంతంగా విత్త నాలు దాచుకుని సాగుచేసే రైతులు తమ పరిధిలోని ఏఈవో ద్వారా యాప్లో నమోదు చేసుకునే వెసులు బా టును కూడా కల్పించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 వానాకాలం సీజన్‌లో నిర్దేశిత ఏడు రకాల సన్నవరి పంటలకే ప్రభుత్వం బోనస్ చెల్లించనుంది.

అయితే, తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎక్కడ విత్తనాలు అమ్మిన, కొనుగోలు చేసినా ఆ వివరాలను జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి పంపిస్తారు. దీంతో సన్నరకం సాగు వివరాలు పక్కాగా తెలియనున్నాయి. దుకాణాదారులు ఈ ప్రక్రియను సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అనేది మండలస్థాయి వ్యవసాయాధికారులు పర్యవేక్షణ చేస్తారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వరి విత్తనాల రకాలను సైతం ఆన్లైన్లో నమోదు చేస్తారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఏఈవోలు పంటల నమోదులో సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆన్‌లైన్‌లో విత్తన కొనుగోలు నమోదు చేయని రైతులకు బోనస్ రాదని అధికారులు చెబుతున్నారు.ఆన్‌లైన్‌లో వివరాల నమోదుకు ప్రభుత్వమే ప్రత్యేకంగా వ్యవసాయ శాఖకు ఒక వెబ్ సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. డీలర్లు సులభంగా లాగిన్ కావడానికి వీలుగా క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని కూడా కల్పించింది. డీలర్లు ఈ సైట్‌లో సన్నరకం వరి రకాల అమ్మకాల ఆప్షన్ను ఎంచుకొని కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి పేరు,మొబైల్ నెంబర్, ఆధార్ వంటి ప్రాథమిక వివరాలతో పాటు విత్తనరకం, కంపెనీ పేరు, లాట్ నెంబర్, సీడ్ ప్యాకెట్, సైజ్, కొనుగోలు చేసిన తేదీని ఖచ్చితంగా నమోదు చేయాలి. డిజిటల్ నమోదు ప్రక్రియ కేవలం 2026 వానాకాలం సీజన్లో విక్రయించే విత్తనాలకు మాత్రమే వర్తిస్తుందని, ప్రభుత్వం విధించిన గడువు లోపలే డీలర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ కమిషనరేట్ స్పష్టం చేసింది.

### ఇవే, అత్యదిక మేలు రకం పంటలు.. సన్నరకాలు..

- తెలంగాణ సోనా (15048) పంట కాలం 120నుంచి 125 రోజులు.
- సాంబమసూరి (బీపీటీ 5204) పంట కాలం 145 నుంచి 150 రోజులు.
- కేఎన్ఎం(1638) పంట కాలం 125 నుంచి 130 రోజులు.
- హెచ్ఎంటీ సోనా పంట కాలం 135 నుంచి 145 రోజులు.
- జైశ్రీరాం పంట కాలం 125 నుంచి 135 రోజులు.
- డబ్ల్యూజీ ఎల్ 44 పంట కాలం 130 నుంచి 145రోజులు.
- కెఎన్ఎం(7715) పంటకాలం 125నుంచి 130 రోజులుగా

పంట వచ్చే దినాలను ఎంపిక చేసింది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

**పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలర్టులు.. వాతావరణ శాఖ హెచ్చరిక**

**హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు..**

**వారం రోజుల క్రితం 34 శాతంగా ఉన్న లోటు**

**హైదరాబాద్,** మనం ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తెలంగాణలో వర్షాలు విరామం లేకుండా కురుస్తున్నాయి. దీంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్ర మట్టం వద్ద రుతుపవన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని చెప్పారు.

గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ మేరకు కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే హైదరాబాద్ సహా 18 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ అయింది. వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం సముద్ర మట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి బికనేర్, ఢిల్లీ, లక్నో, పాట్నా మీదుగా మణిపూర్ వరకు వ్యాపించి, సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. అదే సమయంలో, ఉత్తర కర్ణాటక నుంచి దక్షిణ కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా కొమొరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉన్న మరొక ద్రోణి ప్రస్తుతం బలహీనపడింది. ఈ వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు.చ

వాతావరణ పరిస్థి తీవ్రతను బట్టి వాతావరణ శాఖ వివిధ జిల్లాలకు హెచ్చరికలను జారీ చేసింది. ముఖ్యంగా కామారెడ్డి,



మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షం కురిసే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని అన్నారు. వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం, చెట్ల కొమ్మలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మరోవైపు, హైదరాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సిద్ధిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందన్నారు. అలాగే గంటకు 40 కిలోమీటర్ల లోపు వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ వర్షాల దృష్ట్యా వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు జాగ్రత్త వహించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# మత్స్యకారుల 'చేప'ట్టిన రాజయోగం!



- చేపల విక్రయాలు ఇక ఆన్‌లైన్..
- బడి పిల్లల భోజనంలోనూ స్థానం!
- ఉచిత చేపపిల్లల పంపిణీ యథాతథం..
- రూ.1.34 కోట్ల బీమా పరిహారం క్లియర్
- ప్రతి 3 నెలలకోసారి సంఘాల అధ్యక్షులతో భేటీ
- మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ప్రతినిధులతో మంత్రి వాకిటి శ్రీహరి ముఖాముఖి

**హైదరాబాద్,ఆగస్టు 4(మనం న్యూస్):** రాష్ట్రంలో మత్స్య రంగానికి మహర్దశ పట్టబోతోంది! గుల్లబారిపోతున్న మత్స్యకార కుటుంబాల్లో వెలుగులు నింపేలా, వారి ఆర్థిక పురోగతే లక్ష్యంగా ప్రభుత్వంభారీ వ్యూహానికి తెరలేపింది. చెరువుల నుంచి చెంచాల వరకు.. చెరువుల్లో చేపల పెంపకం నుంచి బడి పిల్లల మధ్యాహ్న భోజనం వరకు ప్రతి దశలోనూ మత్స్యకారులకు అండగా నిలిచేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లోజిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశం గంగపుత్రుల భవిష్యత్తుకు సరికొత్త దిశానిర్దేశంచేసింది.

**బడిలో మీన కాంతి:**

పాఠశాలల్లోని విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని,ఈ నిర్ణయం అమల్లోకి వస్తే బడి పిల్లలకు అత్యుత్తమ ప్రొటీన్ దక్కడమే కాకుండా.. స్థానిక మత్స్యకారులకు నిరంతర ఆదాయ మార్గం లభిస్తుంది.హైదరాబాద్ సమీపంలోని కోహెడ వద్ద రూపుదిద్దుకుంటున్న అత్యాధునిక 'ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్' మత్స్య రంగ స్వరూపాన్నే మార్చబోతోందని మంత్రి వివరించారు.నిర్మాణం పూర్తికాగానే దీని ద్వారా ఆన్‌లైన్ విక్రయాలు, వికేంద్రీకృత పంపిణీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నటు శ్రీహరి వెల్లడించారు. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, మత్స్యకారులకే నేరుగా గిట్టుబాటు ధర దక్కుతుంది. క్లెయిమ్‌లు కాక మూలుగుతున్న రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసినట్లు మంత్రి ప్రకటించారు. మత్స్యకారుల రవాణా, విక్రయాల కోసం మోపెడ్లు, ప్రత్యేక రిటైల్ అవుట్లెట్ షాపుల ఏర్పాటుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్టు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 26 వేల చెరువులు, వంద రిజర్వాయర్లలో ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం కొనసాగుతుందని, వీటికి సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. గ్రామాల నుంచి జిల్లాల వరకు సహకార సంఘాల్లో ఉన్న సభ్యత్వ వివాదాలను త్వరితగతిన పరిష్కరించి, సంఘాలను బలోపేతం చేస్తామని,ప్రతి మూడు నెలలకొకసారి అధ్యక్షులతో ముఖాముఖి నిర్వహిస్తామని, వారికి తగిన 'ప్రోటోకాల్' కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని మంత్రి శ్రీహరి సంఘు ప్రతినిదులకు స్పష్టం చేశారు.

# విద్యారంగంలో ప్రక్షాళన భారతావనికి శ్రేయోదాయకం



**హైదరాబాద్, ఆగస్టు 4 (మనం న్యూస్) :** శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం రాకెట్ వేగంతో దూసుకుపోతున్న వేళ, మన దేశంలో విద్యా వ్యవస్థ మాత్రం కేవలం కాగితపు పట్టాలను అమ్ముకునే వ్యాపార శాలగా దిగజారిపోవడం వర్తమాన భారతం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సంక్షోభం. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల ఉద్యోగార్హతలు, ప్రాథమిక నైపుణ్యాల లేమిపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా కలకలం రేపినప్పటికీ, విద్యా రంగంలో దాగున్న చేదు నిజాన్ని నిర్దాక్షిణ్యంగా నడిరోడ్డుపై నిలబెట్టాయి. ఇంజనీరింగ్ పట్టా చేతిలో ఉన్నా ఒక చిన్న ఉద్యోగ దరఖాస్తును కూడా సరిగ్గా నింపలేని స్థితిలో విద్యార్థులు ఉన్నారంటే, లోపం వారిది కాదు... వారిని ఆ స్థితికి దిగజార్చిన బోధనా విధానానిది. మూడో, నాలుగో తరగతి నుంచే పిల్లలను ఐఐటీ, నీట్ శిక్షణల పేరిట నరకప్రాయమైన పోటీ పందెంలోకి తోసేస్తూ, వారిలోని సృజనాత్మకతను బడి ఈడులోనే గొంతు నులిమి చంపేస్తున్నాం. తల్లిదండ్రులు తమ నెరవేరని ఆశయాలను, పక్కింటివారితో పోలికలను పిల్లలపై రుద్ది మెడిసిన్, ఇంజనీరింగ్లే జీవితానికి పరమావధి అని నమ్మిస్తున్న వేళ, పాఠశాల విద్య ముగిసేసరికి ఆలోచనా శక్తి, ప్రశ్నించే తత్వం, బ్రతుకుకు అవసరమైన జీవన నైపుణ్యాలు పూర్తిగా మృగ్యమైపోతున్నాయి. సమాజంలో ప్రతి బిడ్డకూ ఒకే రకమైన మానసిక సామర్థ్యం ఉండదనే ప్రాథమిక సూత్రాన్ని విస్మరించి, అందరినీ ఒకే మూసలో పోసి రుద్దే ఈ రొటీన్ విద్యా విధానం యువత నైతిక, సాంకేతిక వికాసానికి గొడ్డలిపెట్టుగా మారింది.

నగరాల వీధుల్లో డిగ్రీ పట్టాలు పట్టుకుని ఉద్యోగాల కోసం క్యూ కడుతున్న లక్షలాది మంది యువకులు నేటి కార్పొరేట్ విద్యా వ్యాపారం సృష్టించిన బాధితులు మాత్రమే. నాణ్యమైన అధ్యాపకులు, ప్రాక్టికల్ పరిజ్ఞానం నేర్పించే లాబొరేటరీలు లేకపోయినా, వీధి వీధికీ వెలిసిన ప్రైవేటు కాలేజీలు వంద శాతం ప్లేస్మెంట్లంటూ హోర్డింగ్లపై రంగురంగుల ప్రకటనలతో తల్లిదండ్రుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నాయి. మరోవైపు సమాజంలో విచిత్రమైన వైరుధ్యం రాజ్యమేలుతోంది. లక్షలాది మంది ఇంజనీర్లు నిరుద్యోగులుగా మాడుతుంటే, నిత్య జీవితానికి అవసరమైన ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, సర్టిఫైడ్ టెక్నీషియన్లు నగరాల్లో దొరకని పరిస్థితి ఏర్పడింది. శ్రమ గౌరవాన్ని విస్మరించి, కేవలం వైట్ కాలర్ ఉద్యోగమే గొప్పదనే అపోహలో యువతను పెంచడం వల్ల ఈ డిమాండ్-సప్లై వ్యత్యాసం మరింత తీవ్రమవుతోంది. చదువు పూర్తయినా సరైన ఉపాధి దొరక్క, కష్టపడి నైపుణ్యం నేర్చుకునే ఓపిక లేక యువత సులభంగా డబ్బు సంపాదించే సైబర్ నేరాలు, ఆన్లైన్ బెట్టింగ్లు, మత్తు వ్యసనాల వైపు మళ్లుతుండటం సామాజిక వినాశనానికి స్పష్టమైన సంకేతం.

ఈ ప్రమాదకరమైన ధోరణికి స్వల్పకాలిక పూతలు పనిచేయవు; విద్యా వ్యవస్థకు, ప్రభుత్వాల విధానాలకు తక్షణమే శస్త్రచికిత్స జరగాల్సిందే. ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నత విద్యను కేవలం డిగ్రీలు ఇచ్చే ప్రక్రియగా చూడటం మానేసి, నాణ్యతా ప్రమాణాలు పాటించని, సౌకర్యాలు లేని బోగస్ ఇంజనీరింగ్, ప్రైవేటు కళాశాలల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలి. విద్యాశాఖలు కేవలం అనుమతులు ఇచ్చే ఏజెన్సీలుగా కాకుండా, నిరంతర నాణ్యతా తనిఖీలు చేసే నియంత్రణ మండళ్లుగా మారాలి. పాఠశాల స్థాయిలో 'మార్కుల వేట' సంస్కృతికి స్వస్తి పలికి, ఆరో తరగతి నుంచే ప్రతి విద్యార్థికీ కనీసం ఒక సాంకేతిక లేదా వృత్తి విద్యా నైపుణ్యాన్ని తప్పనిసరిగా బోధించాలి. సైన్స్, మ్యాథ్స్‌తో పాటు కోడింగ్, ఏఐ, డేటా సైన్స్ వంటి ఆధునిక అంశాల ఆధారంగా ప్రాక్టికల్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. పరిశ్రమల అవసరాలకు, కళాశాలల పాఠ్యాంశాలకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చేలా ప్రతి ఉన్నత విద్యా సంస్థ పరిశ్రమలతో విధిగా భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి.

అంతేకాకుండా, తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో విప్లవాత్మకమైన మార్పు రావలసిన అవసరం ఉంది. తమ కలలను, కోరికలను పిల్లలపై రుద్దే 'పేరెంటింగ్ వైఫల్యం' నుంచి వారు బయటపడాలి. నీట్, జేఈఈలే లోకం కాదని... లలిత కళలు, క్రీడలు, రీసెర్చ్, సోషల్ సైన్సెస్, స్వయం ఉపాధి రంగాల్లో కూడా అపారమైన భవిష్యత్తు ఉందనే నమ్మకాన్ని పిల్లల్లో పెంపొందించాలి. సమాజం కూడా ఏ వృత్తినీ తక్కువ చేసి చూడకుండా ప్రతీ శ్రమకూ తగిన గౌరవాన్ని ఇచ్చే పరిపక్వత సాధించాలి. ఐటీఐ లేదా వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన యువతకు ఆర్థికంగా, సామాజికంగా అండగా నిలిచేలా ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలు, రుణ వసతులు కల్పించాలి.

**భారతదేశానికి దక్కిన అతిపెద్ద సంపద – 'యువశక్తి'**

ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం ప్రపంచంలోనే అత్యధిక యువజన జనాభా ఉన్న మన దేశం, వారిలోని ప్రతిభకు సరైన నైపుణ్యాల పదును పెడితే గ్లోబల్ నాలెడ్జ్ హబ్గా అవతరించడం ఖాయం. కేవలం పరీక్షల్లో శాతాలు లెక్కించే యంత్రాలను తయారు చేయడం ఆపి, ఆవిష్కరణలు చేసే, సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యం కలిగిన పౌరులను తీర్చిదిద్దినప్పుడే విద్యా వ్యవస్థ సార్థకమవుతుంది. పాలకుల పట్టుదల, విద్యావేత్తల భాగస్వామ్యం, తల్లిదండ్రుల విచక్షణ ఒకటై విద్యారంగంలో నవ శకానికి శ్రీకారం చుట్టినప్పుడే... భారతీయ యువత సన్మార్గంలో పయనించి, ప్రపంచ పటంలో భారతదేశపు ఔన్నత్యాన్ని అత్యున్నత శిఖరాలపై సగర్వంగా వెలిగించగలుగుతుంది!

# కాళేశ్వరంపై.. కాంగ్రెస్ దుష్ప్రచారం పటాపంచలు

**ప్రాముఖ్యతను చాటిన కాళేశ్వరం ప్రాజెక్టు**

**ఎస్ఆర్ఎస్‌సీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేసిన కేటీఆర్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఆర్ఎస్‌సీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్ హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా, ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న తెలంగాణ రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్విట్టర్ వేదికగా కాంగ్రెస్ ఆరోపణలు తిప్పికొట్టారు. ఎస్ఆర్ఎస్‌సీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను సైతం షేర్ చేశారు.

# మన ఖ్యాతి ఘనం

- ప్రపంచ దిక్సూచిగా మారిన విశ్వనగరం
- స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్ సక్సెస్.. కేటీఆర్ హర్షం
- రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను మరింత బలోపేతం
- ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఈ విజయం ఊతం
- ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్
- డీఆర్‌డీవో, ఆజాద్ ఇంజినీరింగ్‌కు అభినందనలు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** దేశంలో తొలి స్వదేశీ 350 కేజీల థ్రస్ట్-క్లాస్ ఎక్స్పెండబుల్ టర్బోజెట్ ఇంజిన్ విజయవంతంగా తయారైన సంగతి తెలిసిందే. స్వదేశీ టర్బోజెట్ ఇంజిన్ సక్సెస్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆజాద్ ఇంజినీరింగ్, డీఆర్‌డీవో సంయుక్తంగా సాధించిన ఈ ఘనత హైదరాబాద్‌తో పాటు దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కేటీఆర్ స్పందించారు.హైదరాబాద్‌లో తయారైన ఈ టర్బోజెట్ ఇంజిన్ భారతదేశపు స్వదేశీ ప్రొపల్షన్ సామర్థ్యాలను, రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను మరింత బలోపేతం చేస్తుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. జెట్ ఇంజిన్ సాంకేతికతకు అత్యంత కచ్చితత్వం, అధునాతన మెటలర్జీ, ప్రపంచ స్థాయి తయారీ నైపుణ్యం అవసరమని పేర్కొన్నారు. ఈ విజయం హైదరాబాద్‌లో దశాబ్దాలుగా అభివృద్ధి చెందిన ఏరోస్పేస్, ప్రిసిషన్ ఇంజినీరింగ్ రంగాల సామర్థ్యానికి నిదర్శనమని కేటీఆర్ అన్నారు. గత పదేళ్లలో ఈ రంగం మరింత బలోపేతం కావడం వల్లే ఇలాంటి చారిత్రాత్మక ఘనత సాధ్యమైందని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనకు ఈ విజయం మరింత ఊతమిస్తుందని, ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్ ఖ్యాతిని మరింత పెంచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చారిత్రాత్మక విజయాన్ని సాధించిన ఆజాద్ ఇంజినీరింగ్, డీఆర్‌డీవో బృందాలకు కేటీఆర్ అభినందనలు తెలియజేశారు.

# అగమ్యగోచరంగా ప్రభుత్వ అసుపత్రులు

- కమిషనర్ లేక గాలిలో దీపంలా మారిన వైద్య విధాన పరిషత్
- డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు పూర్తిస్థాయి అధికారిని నియమించండి
- ప్రభుత్వానికి హరీశ్‌రావు డిమాండ్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఈ దుష్ట కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అసుపత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు అవసరమైన గైనకాలజీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, పీడియాట్రిక్ తదితర ప్రత్యేక వైద్య సేవలను అందించే తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిస్థితి కమిషనర్ లేక గాలిలో దీపంలా మారడం శోచనీయమని తెలిపారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హరీశ్ పోస్టుపెట్టారు. గత రెండు నెలలుగా పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఎంసీహెచ్, జిల్లా ఆస్పత్రులు, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీ మొత్తంగా 184 ఆస్పత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అధికార యంత్రాంగమే లేకుండా పోయింది..**

ఆసుపత్రుల పనితీరు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైద్యుల హాజరు, ల్యాబ్ పరీక్షలు, మందుల లభ్యత తదితర అంశాలను పర్యవేక్షించే అధికార యంత్రాంగమే లేకుండా పోయిందని హరీశ్రావు చెప్పుకొచ్చారు. దీంతో ఒకవైపు వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో ప్రజలు సరైన వైద్య సేవలు అందక అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది వేతనాలు, సర్వీస్ సమస్యలు సహా ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌గా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయాలని తమ హయాంలో నిర్ణయించామని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారన్నారు. ఇదే విషయమై ఉద్యోగులు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోతోందని తెలిపారు. రోడ్డెక్కి నిరసనలు తెలియచేస్తున్నా పట్టించుకోలేదన్నారు.

**వైద్య సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారు..**

దాదాపు మూడేళ్లు గడుస్తున్నా సర్వీసు నిబంధనలు రూపొందించక పోవడం, లక్ష్యం కార్యరూపం దాల్చకపోమకోకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమస్యలతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్‌కు సంబంధించి వెంటనే కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు, మార్గదర్శకాలు రూపొందించాలని, తక్షణమే పూర్తిస్థాయి అధికారిని నియమించాలని రేవంత్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# విమానాల భద్రతపై దృష్టివెట్టండి?

- క్రమశిక్షణ, ప్రయాణికుల భద్రత, సిబ్బంది మర్యాదలపై కేంద్రం ఏం చేస్తోంది?
- కేంద్రం చర్యలపై రాజ్యసభలో ప్రశ్నించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత రవిచంద్ర

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఇటీవల తరచు ఎక్కడ ఒకచోట విమాన ప్రమాదాలు చోటు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. రాజ్యసభ సమావేశాల సందర్భంగా విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల భద్రత, ప్రయాణికులతో సిబ్బంది మర్యాదలపై కేంద్రం తీసుకుంటున్న చర్యలపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో మంగళవారం ప్రశ్నించారు. ఇందుకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ స్పందిస్తూ..విమానాలు, ప్రయాణీకులు, ఆస్తుల భద్రతను నిర్థారించడం, విమానాల్లో క్రమశిక్షణ తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక విభాగాలతో పాటు స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. విమానాలలో క్రమశిక్షణ, ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా అవాంఛనీయ లేదా అల్లరి ప్రవర్తనను నియంత్రించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సివిల్ ఏవియేషన్ రిక్వైర్‌మెంట్స్, సెక్షన్-3, ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, సిరీస్-ఎం, పార్ట్-6 కింద 'హ్యాండ్‌లింగ్ ఆఫ్ అన్‌రూలీ,డిస్రప్టివ్ ప్యాసింజర్స్' పేరుతో ప్రత్యేక మార్గదర్శకాలు ఉన్నాయని ఎంపీ రవిచంద్రకు మంత్రి మొహోల్ తెలిపారు. ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికుల కోసం క్యాబిన్ సేఫ్టీ సర్క్యులర్-01/2016 ప్రకారం మార్గదర్శకాలు అమలులో ఉన్నాయని మంత్రి బదులిచ్చారు.

అలాగే, ప్రయాణీకుల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు గాను తమ శాఖ 24 గంటల 'ప్యాసింజర్ అసిస్టెన్స్' కంట్రోల్ రూమ్‌ను అనుసంధానం చేసి విమానాల రాకపోకల సమయం, సామాన్ల భద్రత, వాటి చేరవేతలో తలెత్తిన సమస్యలు, రీఫండ్ అంశాలను డీజీసీఏ, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విమానయాన సంస్థలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షిస్తున్నామని, దీంతో పాటు అదనంగా, ప్రయాణికుల ఫిర్యాదుల సత్వర పరిష్కారం కోసం ఎయిర్ సేవా పోర్టల్, మొబైల్ యాప్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చామని ఎంపీ రవిచంద్ర అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాదానం చెప్పారు.

# భూమికి 'జల'కళ.. సాగుకు భరోసా!



- పంద్రాగస్టు నాటికి 13 వేల వ్యవసాయ కుంటలు!
- గడువులోగా లక్ష్యాలు పూర్తి చేయాల్సిందే
- పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్

**హైదరాబాద్,ఆగస్టు04(మనం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా భూగర్భ జలాలను పెంపొందించి, వ్యవసాయాన్ని పండగ చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణను తీవ్రతరం చేసింది.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నాటికి రాష్ట్రంలో మిగిలి ఉన్న 13,046 వ్యవసాయ కుంటల నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించింది. మంగళవారం కమిషనర్ కార్యాలయం నుంచి జిల్లాల డీఆర్డీఓలు, డీపీవోలు, జడ్పీ సీఈఓలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయి పురోగతిపై సమీక్షించారు.

**'జలసిరి'కి జీవం:**

'తెలంగాణ జలసిరి', 'వీబీ-జీ రామ్-జీ' కార్యక్రమాల్లో భాగంగా నీటి సంరక్షణ చర్యలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు దానకిశోర్ తెలిపారు. కేవలం కుంటలే కాకుండా ఇంకుడు గుంతలు, పర్కొలేషన్ ట్యాంకులు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, పాత బహిరంగ బావుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు సెర్ప్-ఎన్ఆర్ఎల్ఎం, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖల సమన్వయంతో ప్రతి జిల్లాలో కనీసం 50 'ఎకో ఫార్మ్ పాండ్ల'ను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. పంట పొలాల్లో నీటి నిల్వతో పాటు చేపల పెంపకం, ఉద్యాన పంటల సాగుకు ఇవి ఉపకరిస్తాయని దానకిశోర్ వెల్లడించారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవసాయ కుంటల గుర్తింపు, పరిపాలనా అనుమతులు, పనుల ప్రారంభం వంద శాతం పూర్తవ్వాలని,ప్రతి పంచాయతీ సమగ్ర సమాచారాన్ని సేకరించి, రాబోయే మూడేళ్లకు సంబంధించిన సమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక మాన్యువల్‌ను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు స్పష్టంచేశారు. మండల స్థాయి అధికారులతో రోజూ సమీక్షలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ ఈ నెల 15 నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్యతో పాటు పలువురు శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలు

**నోటిఫికేషన్ విడుదల చేసిన యూనివర్సిటీ**

**ఆగస్టు 5 నుంచి ఆగస్టు 12 తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు అవకాశం**

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2026లో క్వాలిఫై అయిన విద్యార్థులు ఆగస్టు 5 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 12 సాయంత్రం 6 గంటల వరకు తమ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్ ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది. పూర్తి వివరాలు, సమాచారం కోసం యూనివర్సిటి వెబ్‌సైట్‌లో చూడాలని కోరింది.

**విద్యార్థులకు సూచనలు...**

ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్ లోడ్ చేయాలి. నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతి రౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదు. సర్టిఫికెట్‌ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్సును యూనివర్సిటి వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చేటప్పుడు కళాశాలల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.

## ఒక మొక్కను నాటండి

మద్యం ఒలికితే గీయబడిన
చిత్రాన్ని నేను

సారా కంపులో శ్వాసిస్తున్న
నిస్సహాయతను నేను

రోజూ ఆలోచనల
కొక్కానికి వ్రేలాడుతూ
బతుకు చిత్రం కొత్తగా
గీసుకోవాలని ఆశపడే
అమాయకపు ఆడపిల్లను నేను

ఎప్పుడైనా నేను రాక్షస ఆనందానికి
బలైపోతే, ఎనిమిదో అడుగు వేసిన నాడు
మద్యం తాగి నా గొయ్యి తవ్వకండి
బ్రతికినంత కాలం చేసింది అదేగా!

నన్ను కలవాలని కలవనివారు
కన్నెత్తి చూడని వారు
ఇప్పుడు అటుగా నడిచే అవకాశం ఉంది
సమాధిపై పరిమళం వెదజల్లే

ఒక మొక్కను నాటండి
నా దేహంపై కప్పిన మట్టిలో
ఇంకిన పూల సౌరభం

సమాధిలోనైనా సుఖంగా ఉన్నాననే
భావన అందరికీ కలిగించాలి

**- పద్మజా రామకృష్ణ. పి**
9491830278

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం https://www.manamepaper.com/ వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్**

# యువతకు రక్షణ.. పేపర్ లీకేజీల నియంత్రణ చట్టం

భారతీయ సాంస్కృతిక విశిష్టతలో విద్యకు అత్యున్నత పీఠం ఉంది. 'విద్యా ధనం సర్వధన ప్రధానమ్' అని ప్రాచీన సంస్కృత నానుడి చాటి చెప్పినట్లుగానే, విజ్ఞానం మానవాళికి వికాసాన్ని అందించే అమూల్యమైన సంపద. వేమన యోగి తన పద్యంలో 'నిజమునకు నిలువ గలవాడే నరుడగు' అని వచించిన రీతిలో, సత్యం,నిష్పాక్షికత, నిజాయితీలపైనే ఏ సమాజమైనా,ఏ వ్యవస్థ యినా నిలబడ గలుగుతుంది. ముఖ్యంగా, నిరుద్యోగ రహిత సమాజ నిర్మాణంలోనూ, యువత ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పించడంలోనూ పబ్లిక్ పరీక్షలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోనూ, కేంద్ర స్థాయిలోనూ చోటుచేసుకున్న ప్రశ్న పత్రాల లీకేజీ ఉదంతాలు, సామూహిక కాపీయింగ్, సాంకేతిక దుర్వినియోగ సంస్కృతి మన విద్యావ్యవస్థ మూలాలనే కంపిం పజేశాయి. ప్రతిభావంతులైన లక్షలాది మంది నిరుద్యోగ యువత రక్తాన్ని చెమటగా మార్చి రాత్రింబవళ్లు చదివిన శ్రమను, వారి కుటుంబాల ఆశలను ఈ అక్రమ ముఠాలు ఒక్క క్షణంలో బూడిదలో పోసిన పన్నీరుగా మార్చి వేశాయి. ఈ కలుషిత వాతా వరణాన్ని ప్రక్షాళన చేస్తూ, పరీక్షా విధానంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలనను పునఃప్రతిష్ఠించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'పబ్లిక్ పరీక్షల (అక్రమాల నిరోధక) చట్టం-2024' పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొంది, రాష్ట్రపతి ముద్రతో అమల్లోకి రావడం దేశ విద్యా చరిత్రలోనే ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది.

గత కొన్ని సంవత్సరాల పూర్వాపరాలను పరిశీలిస్తే, ప్రశ్న పత్రాల చోరీ, లీకేజీలు కేవలం స్థానిక పరిధికి మాత్రమే పరిమి తం కాకుండా వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందడం అత్యంత శోచనీయం. వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్-యుజి, పరిశోధక అభ్యర్థుల యుజిసి-నెట్ పరీక్షల రద్దుతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు, పోలీస్ నియామకాలు, పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించిన అనేక పోటీ పరీక్షలు లీకేజీ భూతానికి బలయ్యాయి. ఈ రద్దుల కారణంగా గత ఐదేళ్ల కాలం లో దేశవ్యాప్తంగా దాదాపు 1.5 కోట్లకు పైగా అభ్యర్థుల భవి ష్యత్తు అంధకారంలోకి నెట్టబడింది. ఒక పరీక్ష రద్దయితే, అది కేవలం ప్రకటన నిలిచి పోవడం మాత్రమే కాదు.. పరీక్ష అల వెన్సులు, శిక్షణ ఖర్చులు, లాడ్జింగ్, ప్రయాణ వ్యయాల రూపం లో అభ్యర్థుల కుటుంబాలపై కోట్లాది రూపాయల ఆర్థిక భారం




పడుతుంది. ప్రభుత్వ ఖజానాపై పునర్నిర్వహణ వ్యయం కత్తిలా వేలాడుతుంది. అంతకంటే మిన్నగా అభ్యర్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి, నైరాశ్యానికి గురై తమ అమూల్యమైన జీవితకాలాన్ని నష్టపోతున్నారు. 'న్యాయం ఆలస్యమైతే అది నిరాకరించ బడినట్లే' అనే నానుడిలా, పరీక్షలు నిరంతరం వాయిదా పడడం వల్ల యువత ఉత్పత్తి సామర్థ్యం వృథాగా పోతోంది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పటికీ, సైబర్ నేరగాళ్లు, కోచింగ్ మాఫియా, మధ్యవర్తులు, ప్రింటింగ్ ప్రెస్ సిబ్బంది పరస్పరం కుమ్మక్కై సృష్టిస్తున్న అక్రమాలు పరీక్షల భద్రతను సవాలు చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ఇయర్‌పీస్లు, బ్లూటూత్ డివైజ్‌లు, డమ్మీ అభ్యర్థులను కూర్చోబెట్టడం, డిజి టల్ మాధ్యమాల ద్వారా లీకైన పేపర్లను సెకన్ల వ్యవధిలో పంపిణీ చేయడం వంటి కుట్రలు వ్యవస్థీకృతంగా సాగుతున్నాయి. ఈ దారుణ పరిస్థితుల నేపథ్యాన్నే కొత్త చట్టం తీవ్రంగా పరిగణిం చింది. ఈ నూతన చట్టం ప్రకారం, ప్రశ్నపత్రాల చోరీ, లీకేజీ, కొనుగోలు, విక్రయం, సామూహిక కాపీయింగ్, ఎలక్ట్రానిక్ ఆధారిత మోసాలు నాన్-బెయిలబుల్ నేరాలుగా వర్గీకరించ బడ్డాయి. సాధారణ అక్రమాలకు పాల్పడే వ్యక్తిగత నేరస్థులకు 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. ఇక వ్యవస్థీకృత నేర ముఠాలు, లీకేజీలకు ఒడిగట్టే సంస్థలు లేదా కోచింగ్ సెంటర్లకు 5 నుంచి 10 ఏళ్ల వరకు కారాగార శిక్షతో పాటు ఏకంగా రూ.1 కోటి వరకు భారీ జరిమానాలు విధిస్తారు. అక్రమాల ద్వారా సంపాదించిన అక్రమాస్తులను జప్తు చేసే అధికారాన్ని విచారణ సంస్థలకు కల్పించడం ద్వారా నేరస్థుల గుండెల్లో భయం కలిగిం చేలా చట్టాన్ని కట్టుదిట్టం చేశారు.

ఈ చట్టం పరిధిలోకి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ , రైల్వే రిక్రూట్మెంట్ బోర్డులు, ఐబీపీఎస్ వంటి ప్రధాన కేంద్ర పరీక్షా నిర్వహణ సంస్థలన్నీ వస్తాయి. చట్ట అమలుతో పాటు పరీక్షా నిర్వహణలో బహుళస్థాయి భద్రతా వ్యవస్థ ప్రాధాన్యం సంతరించు కోనుంది. ప్రశ్నాపత్రాల ముద్రణ దశ నుండి పంపిణీ వరకు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సీసీటీవీ సర్వైలెన్స్, బయోమెట్రిక్ ప్రామాణీకరణ, సురక్షిత డిజిటల్ వాల్ట్‌ల వినియోగం తప్పనిసరి కానున్నాయి. ఇది కేవలం కేంద్ర పరీక్షలకే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా తమ స్వంత చట్టాలను మరింత కఠినతరం చేసుకోవడానికి ఒక మార్గదర్శిగా నిలుస్తుంది.

అయితే, సమాజంలో చట్టాలు రూపుదిద్దుకోవడం ఒకెత్త యితే, వాటిని క్షేత్రస్థాయిలో అక్షరాలా అమలు చేయడం మరొక ఎత్తు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కఠిన శిక్షల చట్టాలు మాత్రమే సమాజంలోని కుళ్ళిన వ్యవస్థను రాత్రికి రాత్రే మార్చలేవు. ఈ చట్టానికి తోడుగా ప్రత్యేక వేగవంతమైన న్యాయస్థానాల ఏర్పాటు, సుశిక్షిత స్వతంత్ర దర్యాప్తు బృందాల పర్యవేక్షణ, విచారణలో కాలయాపన లేకపోవడం అత్యంత ప్రాధాన్యం. పరీక్షా నిర్వహణ సంస్థల్లో నైతిక పరిపాలన, అంతర్గత ఆడిటింగ్, ఉద్యోగుల జవాబుదారీతనం పెంపొందిం చడం ద్వారా మాత్రమే నమ్మకాన్ని పునరుద్ధరించ గలము. 'మొక్కై వంగనిది మానై వంగునా' అనే సామెత చందంగా, నైతిక విలువలతో కూడిన విద్యా సంస్కృతిని, అక్రమ మార్గాల పట్ల అసహ్యభావాన్ని అభ్యర్థుల్లో కూడా పెంపొందించాలి.

భారతదేశ భాగ్యరేఖలు తరగతి గదుల్లోనూ, పరీక్షా హాళ్లలోనే తీర్చిదిద్ద బడతాయి. కోట్లాది మంది యువత ఆశలకు, ప్రతిభకు ఏ ఒక్క అక్రమార్కుడి స్వార్థం గ్రహణం పట్టకూడదు. 'కష్టపడిన వానికి కడుపు నిండును' అన్న చందాన, శ్రమించిన అభ్యర్థికే విజయం దక్కాలనే సార్వత్రిక న్యాయ సూత్రానికి ఈ చట్టం భరోసా ఇస్తుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, ఆధునిక సాంకేతిక భద్రత, పారదర్శక పరిపాలన, చట్టం యొక్క నిర్దాక్షిణ్య అమలు సమగ్రంగా మేళవించినప్పుడే ప్రశ్నపత్రాల లీకేజీ మహమ్మారి దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టుకు పోతుంది. అప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిభకు తగిన గౌరవం దక్కి, దేశ విద్యా విధానం సుదృఢమైన, విశ్వసనీయమైన పునాదులపై విరాజిల్లుతుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# నాగపూర్‌లో పర్యావరణ పునరుద్ధరణ

భారత ప్రభుత్వం 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' కింద దేశవ్యాప్తంగా పాత చెత్తకుప్పల శాస్త్రీయ నిర్మూలన కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలు బయో-మైనింగ్, ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ సాంకేతికతలను ఉపయోగిస్తూ పర్యావరణ హితమైన పట్టణాలను నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ప్రయత్నాల్లో మహా రాష్ట్రలోని నాగ్‌పూర్ నగరం ఒక గొప్ప ఆదర్శంగా నిలిచింది. ఒకప్పుడు నగరానికి పెద్ద పర్యావరణ సమస్యగా మారిన భాండేవాడి చెత్తకుప్పను శాస్త్రీయంగా పునరుద్ధరించి, దానిని ఆధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రంగా తీర్చిదిద్దడంలో నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ అద్భుతమైన విజయాన్ని సాధించింది.

మధ్య భారతదేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన నాగ్‌పూర్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. 30 లక్షలకు పైగా జనాభా కలిగిన ఈ నగరంలో గృహాలు, మార్కెట్లు, విద్యాసంస్థలు మరియు వాణిజ్య సంస్థల నుండి ప్రతిరోజూ అపారమైన మొత్తంలో ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. దశాబ్దాలుగా ఈ వ్యర్థాలన్నింటినీ నగర శివారులోని భాండేవాడి డంపింగ్ యార్డుకు తరలించడంతో అది భారీ ఎత్తున చెత్తకుప్పగా మారిపోయింది. దీని వల్ల తీవ్రమైన పర్యావరణ కాలుష్యం, ప్రజారోగ్య సమస్యలు, భూవినియోగ సంక్షోభాలు ఏర్పడ్డాయి. దీంతో నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొ రేషన్ స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కా రంగా శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణకు కృతనిశ్చ యంతో ముందుకు సాగింది.

భాండేవాడి డంప్‌లో పేరుకుపోయిన పాత చెత్తను ఆధునిక బయో-మైనింగ్ పద్ధతుల్లో తవ్వి, వేరు చేసి, ప్రాసెస్ చేయడం ద్వారా సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యర్థాలను విజయ వంతంగా శుద్ధి చేశారు. ఈ ప్రక్రియ ద్వారా భారీ స్థాయిలో భూమిని తిరిగి వినియోగానికి అందు బాటులోకి తెచ్చారు. ఇందులో భాగంగా వ్యర్థా




లను వివిధ రకాలుగా వర్గీకరించి, పునర్విని యోగపరచదగిన వాటిని రీసైకిల్ చేయడం, సేంద్రీయ పదార్థాలను కంపోస్టుగా మార్చడం, మరియు మిగిలిన వాటి నుండి ఇంధనాన్ని తయారు చేయడం జరిగింది. ఈ విధానం వల్ల డంప్‌లోని వ్యర్థాలు క్రమంగా తగ్గిపోయి, పర్యా వరణ భారం గణనీయంగా తగ్గింది.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం ఫలితంగా సుమారు 55 ఎకరాల విలువైన భూమి చెత్త కుప్పల బారి నుండి విముక్తి పొంది తిరిగి ప్రభుత్వ వినియోగానికి సిద్ధమైంది. గతంలో పూర్తిగా వ్యర్థాలతో నిండిపోయి, ఉపయోగించలేని స్థితిలో ఉన్న ఈ ప్రాంతం ప్రస్తుతం ఆధునిక వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రంగా మారింది. ఈ స్థలం ఇప్పుడు పర్యావరణానికి హాని కలిగించే బదులు, నగరానికి ఒక ఆస్తిగా మారింది. ఈ పునరుద్ధరణ వలన నగరానికి కొత్తగా అభివృద్ధి ప్రాజెక్టులకు స్థలం లభించడమే కాకుండా, చుట్టుపక్కల పర్యావరణం కూడా స్వచ్ఛంగా మారింది.

భాండేవాడిలో ప్రస్తుతం ఏర్పాటు చేసిన సమగ్ర ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో అత్యా ధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి... మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్, కంపోస్టింగ్ యూనిట్లు తయారీ కేంద్రా లు, లీచేట్ శుద్ధి వ్యవస్థలు, మరియు నిరంతర పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలు. ఈ కేంద్రంలో వ్యర్థాలను చెత్తగా కాకుండా విలువైన వనరులుగా పరిగణించి, వాటి నుండి ఇంధనం, ఎరువు, రీసైకిల్ పదార్థాలను తయారు చేస్తున్నారు. ఇది వ్యర్థాల నిర్వహణలో ఒక సర్క్యులర్ ఎకానమీ నమూనాకు అద్దం పడుతుంది.

భాండేవాడి కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా, ట్రామెల్ యంత్రాలు, బాలిస్టిక్ సెపరేటర్లు, ఆటోమేటెడ్ కంపోస్టింగ్ వ్యవస్థలు, రియల్-టైమ్ మానిటరింగ్, సీసీటీవీ నిఘా వ్యవస్థ మరియు ధూళి నియంత్రణ వ్యవస్థలు ఇక్కడ అమలులో ఉన్నాయి. ఈ సాంకేతికతలు వ్యర్థాల వేరు చేత, ప్రాసెసింగ్ను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మరియు సురక్షితంగా మార్చాయి. ఫలితంగా, కార్మికుల ఆరోగ్యం, పరిసర ప్రాంతాల పర్యావరణం కూడా రక్షించబడుతోంది.

భాండేవాడి రూపాంతరం వల్ల నాగ్‌పూర్ నగరానికి అనేక పర్యావరణ మరియు సామాజిక ప్రయోజనాలు లభించాయి. గాలి, నీరు, నేల కాలుష్యం బాగా తగ్గింది. పరిసర ప్రాం తాల్లో ప్రజారోగ్య పరిస్థితులు మెరుగు పడ్డాయి మరియు రీసైక్లింగ్, వనరుల పునర్వినియోగం పెరగడంతో కొత్త ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడ్డాయి. ఇవన్నీ మిలిటే పర్యావరణ అనుకూల పట్టణా భివృద్ధికి బాటలు వేశాయి.

భాండేవాడి ప్రాజెక్టు విజయంతో స్ఫూర్తి పొందిన నాగ్‌పూర్ నగరం వ్యర్థాల నిర్వహణను మరింత బలోపేతం చేయడానికి అనేక అదనపు ప్రాజెక్టులను కూడా ఏర్పాటు చేసింది. వీటిలో కొత్త కంపోస్టింగ్ ప్లాంట్లు, మాడ్యులర్ వ్యర్థాల ప్రాసెసింగ్ యూనిట్లు, మెటీరియల్ రికవరీ కేంద్రాలు మరియు నిర్మాణ వ్యర్థాల ప్రత్యేక ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ కార్యక్రమాలు నగరంలో వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణకు ఎంతో దోహదపడుతున్నాయి.

సారాంశంగా, భాండేవాడి ప్రాజెక్టు అసాధా రణమైన విజయాన్ని సాధించింది. 10 లక్షల మెట్రిక్ టన్నుల పాత వ్యర్థాల శుద్ధీకరణ, 55 ఎకరాల భూమి పునరుద్ధరణ, ఆధునిక సమగ్ర వ్యర్థాల ప్రాసెసింగ్ మౌలిక వసతుల ఏర్పాటు - ఇవి ఈ ప్రాజెక్టు యొక్క ముఖ్య విజయాలు. శాస్త్రీయ వ్యర్థాల విభజన, రీసైక్లింగ్, వనరుల పునర్వినియోగం ద్వారా సర్క్యులర్ ఎకానమీకి ప్రోత్సాహం అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిర పట్టణాభివృద్ధికి ఈ ప్రాజెక్టు మార్గదర్శకత్వం వహించింది. నాగ్పూర్లోని ఈ రూపాంతరం భారత పట్టణాల వ్యర్థాల నిర్వహణలో ఒక ఆదర్శప్రాయమైన నమూనాగా నిలిచింది. శాస్త్రీయ ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు సమర్థవంతమైన అమలు ద్వారా పాత చెత్తకుప్పలను సుస్థిర అభివృద్ధికి వనరులుగా ఎలా మార్చవచ్చో ఈ ప్రాజెక్టు నిరూపించింది. నగరాలు వ్యర్థాలను సమస్యగా కాకుండా అవకాశంగా భావించి నిర్వహిస్తే, పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను కూడా సాధించవచ్చని భాండే వాడి విజయగాథ స్పష్టం చేస్తోంది.

**- డాక్టర్ ఏలూరీ యాదయ్య**

# రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి?

నేడు రిజర్వేషన్లపై జరుగు తున్న చర్చను కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వా మ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు.కానీ చరిత్రను రద్దు చేయలేదు.ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. చరిత్ర సృష్టించిన అసమానతలను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమాన త్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్ని వర్గాలు కనిపిం చాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయా నికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మ గౌరవాన్ని,జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? ఇలాంటి సమయంలోనే రిజర్వే షన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం. రాజకీయాలు ఎప్పుడు సమస్యలు మాత్రమే పరిష్కరించవు. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, విద్యాసంక్షోభం, పెరుగుతున్న అసమానతలు చర్చలో ఉన్న ఈ సమయంలో రిజర్వేషన్లను కేంద్ర అంశాలుగా నిలబెట్టడం వెనుక రాజకీయ సందర్భాన్ని విస్మరించడం కష్టం. రిజర్వేషన్ల పట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. 'రిజర్వేషన్ల స్థానం లో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం



ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందు కంటే ప్రత్యామ్నాయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. ఈ పరిస్థితులను సృష్టిం చకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిసు న్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివా ర్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యధాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే.

**- ఆయిరబోయిన బిక్షపతి**
7993248717

# ఆయుష్షు పెరుగుతోంది..ఆరోగ్యం తగ్గుతోంది



నేడు శాస్త్రవిజ్ఞానం, వైద్య సాంకే తికత, మెరుగైన జీవన పరిస్థితుల వల్ల మనిషి సగటు ఆయుర్దాయం గణనీ యంగా పెరుగుతోంది. కానీ అదే సమ యంలో ఆరోగ్యంగా గడిపే సంవత్స రాలు మాత్రం తగ్గిపోతుండటం ప్రపం చవ్యాప్తంగా వైద్య నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఇటీవలి పరిశోధనలు మనిషి గరిష్ఠ జీవన పరిమితి 140-150 సంవత్సరాల వరకు ఉండవచ్చని సూచి స్తున్నాయి. అయితే ప్రశ్న ఒక్కటే-అంతకాలం జీవించినా ఆరోగ్యంగా జీవించగలమా?

ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగం అభివృద్ధి, టీకాలు, యాంటీబయాటిక్స్, పరిశుభ్రత, పోషకాహారం, శస్త్రచికిత్సల పురోగతి కారణంగా గత శతాబ్దంతో పోలిస్తే మానవ సగటు ఆయుర్దాయం గణనీయంగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచ సగటు ఆయుర్దాయం ప్రస్తుతం సుమారు 73 సంవత్సరాలకు చేరు కుంది. భారతదేశంలో కూడా 1990లో సుమారు 58.5 సంవత్సరాలు ఉన్న సగటు ఆయుర్దాయం, ప్రస్తుతం 71-72 సంవత్సరాలకు చేరుకుంది. అయితే దీనికి సమాంతరంగా మరో ఆందోళనకరమైన పరిణామం చోటుచేసుకుంటోంది. ఆరోగ్యంగా గడిపే జీవనకాలం అంతగా పెరగడం లేదు. అంటే జీవితంలో చివరి పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం మధుమేహం, గుండెజబ్బులు, రక్తపోటు, క్యాన్సర్, కీళ్లనొప్పులు, మానసిక ఆందోళన, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ గడపాల్సి వస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా దీనినే 'మార్బిడిటీ గ్యాప్' అని వ్యవహ రిస్తున్నారు. 1990లో ప్రపంచవ్యాప్తంగా ఈ అంతరం సుమారు 8.8 సంవత్సరాలు ఉండగా, 2023 నాటికి అది 10 సంవత్సరాలకు పైగా పెరిగిందని అధ్యయనాలు సూచి స్తున్నాయి. భారతదేశంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది.

మనిషి గరిష్ఠ ఆయుర్దాయంపై శాస్త్రవేత్తల పరిశోధనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. సింగపూర్, అమెరికా, రష్యా దేశాల పరిశోధకులు రూపొందించిన కంప్యూటర్ నమూనాల ప్రకారం మనిషి జీవసామర్థ్యం సిద్ధాంతపరంగా 150 సంవత్సరాల వరకు ఉండవచ్చని అంచనా వేశారు.

జీవశాస్త్రంలో హోమియోస్టాసిస్ అనే ఒక కీలక భావన ఉంది. అంటే శరీరం తన అంతర్గత సమతుల్యతను నిలుపు కోవడం. వయసు పెరిగే కొద్దీ ఈ సామర్థ్యం తగ్గిపోతుంది. దీనినే రెసిలియన్స్ అంటారు. వ్యాధులు వచ్చినప్పుడు కోలు కునే శక్తి క్రమంగా తగ్గిపోవడమే వృద్ధాప్యానికి ప్రధాన లక్షణం.

సుమారు 70 వేల మందిపై జరిపిన అధ్యయనంలో రక్తంలోని తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు, వాపు స్థాయిలు, శరీర ప్రతిస్పందన వంటి అంశాలను విశ్లేషించి ప్రమాణాన్ని రూపొందించారు. ఈ అధ్యయనం ప్రకారం వయసు పెరిగే కొద్దీ శరీరం కోలుకునే సామర్థ్యం తగ్గుతూ చివరకు పూర్తిగా క్షీణించే సిద్ధాంతపరమైన పరిమితి సుమారు 150 సంవత్సరాలుగా ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే ఇది ఖచ్చితమైన జీవన హామీ కాదు. ఎందుకంటే భవిష్యత్తులో వచ్చే కొత్త వైద్య ఆవిష్కరణలు ఈ అంచనాలను మార్చే




అవకాశముంది.చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక కాలం జీవించిన వ్యక్తిగా ఫ్రాన్స్కు చెందిన జీన్ కాల్మెంట్ (ఒబ్బుబ్బు ఇచ్ఛజూర్ఖుబ్బు) 122 సంవత్సరాలు 164 రోజులు జీవించారు. జపాన్లోని ఒకినావా, ఇటలీలోని సార్డీనియా, గ్రీస్‌లోని ఇకారియా వంటి ప్రాంతాల్లో శతాధిక వృద్ధుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వీటిని ప్రపంచంలోని 'బ్లూ జోన్స్'గా గుర్తించారు. అక్కడి ప్రజల జీవనశైలి, ఆహారం, శారీరక శ్రమ, మానసిక ప్రశాంతత, సామాజిక బంధాలు వారి దీర్ఘాయుష్షుకు కారణాలుగా భావిస్తున్నారు.

శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం మనిషి ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించడానికి మూడు అంశాలు కీలకం. మొదటిది: జన్యువులు. మంచి జన్యుపరమైన లక్షణాలు ఉన్నవారు సహజంగానే ఎక్కువకాలం జీవించే అవకాశం ఉంటుంది. అయితే జన్యువుల ప్రభావం మొత్తం ఆయుర్దా యంలో సుమారు 20-25 శాతం మాత్రమే ఉంటుందని పరిశోధనలు చెబుతున్నాయి.

రెండవది: జీవనశైలి, సమతుల ఆహారం, నిత్య వ్యాయా మం, తగిన నిద్ర, మద్యపానం-పొగతాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడిని తగ్గించుకోవడం వంటి మంచి అలవాట్లు జీవితకాలాన్ని గణనీయంగా పెంచు తాయి. మధ్యధరా ఆహార విధానం, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, తక్కువ ఉప్పు, తక్కువ చక్కెర తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ప్రపంచవ్యాప్తంగా అనేక అధ్యయనాలు నిరూపించాయి.

మూడవది: వైద్య విజ్ఞానం. కృత్రిమ మేధ, జన్యు చికిత్సలు, స్టెమ్ సెల్ థెరపీ, వ్యక్తిగత వైద్యం, క్యాన్సర్ చికిత్సలలో వస్తున్న పురోగతి భవిష్యత్తులో మానవ ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరిచే అవకాశం ఉంది. అయితే ఈ మూడు అంశాల కంటే ముఖ్యమైనది వ్యాధులు రాక ముందే నివారించుకోవడం అనే దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. భారతదేశంలో అంటువ్యాధుల కంటే ఇప్పుడు అంటురాని దీర్ఘకాలిక వ్యాధులే మరణాలకు ప్రధాన కారణంగా మారాయి. మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, ఊబకాయం, మూత్ర పిండాల వ్యాధులు, క్యాన్సర్, మానసిక ఆరోగ్య సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. చిన్న వయసులోనే ఈ వ్యాధులు రావడం ఆందోళన కలిగించే అంశం. అలాగే యువతలో వ్యాయామం లేకపోవడం, గంటల తరబడి మొబైల్, కంప్యూటర్ ముందు కూర్చోవడం, జంక్ ఫుడ్, నిద్రలేమి, ఒత్తిడి వంటి కారణాలతో ఆరోగ్య సమస్యలు మరింత పెరుగు తున్నాయి. ఫలితంగా జీవితకాలం పెరిగినా ఆరోగ్యకర జీవితం తగ్గిపోతోంది. అందుకే ఆరోగ్య రంగంలో పెట్టుబ డులు పెంచడం, ప్రాథమిక వైద్య సేవలను బలోపేతం చేయ డం, ప్రతి పౌరుడికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి తేవడం, పోషకాహారం, యోగా, వ్యాయా మం, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం అత్య వసరం. మనిషి 100 సంవత్సరాలు బతికాడా? 120 సంవత్సరాలు బతికాడా? అనే ప్రశ్న కంటే, ఎన్ని సంవత్స రాలు ఆరోగ్యంగా, ఆత్మగౌరవంతో, ఇతరులకు భారంగా కాకుండా జీవించ గలిగాడు? అనే ప్రశ్నే నేటి కాలంలో మరింత ముఖ్యమైంది.

దీర్ఘాయుష్షు అనేది కేవలం వైద్యశాస్త్రం సాధించే విజయం మాత్రమే కాదు. అది ఆరోగ్యకర జీవనశైలి, సమ తుల ఆహారం, మానసిక ప్రశాంతత, ప్రభుత్వ ఆరోగ్య విధా నాలు, శాస్త్రీయ పరిశోధనలు,ప్రతి వ్యక్తి స్వీయ క్రమశిక్షణ-ఈ ఐదు అంశాల సమిష్టి ఫలితం. 'జీవితానికి సంవత్సరాలు జోడించడం కంటే.. సంవత్సరాలకు ఆరోగ్యాన్ని జోడిం చడమే మానవ నాగరికత యొక్క నిజమైన విజయం'.

**- మేకిరి దామోదర్**
9573666650

## ఈ.వీ.ఎం గోదాము తనిఖీ



- భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన కలెక్టర్

జగిత్యాల, ఆగస్టు 4 (మనం ప్రతినిధి): సాధారణ తనిఖీ లో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ

- రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క



కన్నాయిగూడెం, ఆగస్టు 4 (మనం ప్రతినిధి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. మంగళవారం కన్నాయిగూడెంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) ముప్పనపల్లి లో నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది విద్యార్థినులకు మంత్రి సీతక్క ల్యాప్టాప్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమం ద్వారా ఎంపికైన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల విద్యార్థినులకు నీట్, ఐఐటీ-జేఈఈ, క్లాట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసిస్తూ తమ కలలను సాకారం చేసుకోవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.

బాలికల విద్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సాధికారతకు విద్యే బలమైన పునాదని మంత్రి పేర్కొన్నారు. ఉన్నత చదువుల కోసం అవసరమైన సహాయం విషయంలో తనను నేరుగా సంప్రదించాలని, తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. 'క్రమశిక్షణ, పట్టుదల విజయానికి మూలస్తంభాలు. చదువు ఒక్కటే మీ తలరాతను మార్చగలదు. విద్యార్థి దశలో సమయాన్ని వృథా చేయకుండా బంగారు భవిష్యత్తు కోసం ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి' అని మంత్రి సీతక్క విద్యార్థినులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. సిద్ధార్థ్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా ఆసుపత్రిలో నూతన సదుపాయాల ప్రారంభం



ములుగు,ఆగస్టు 4,మనం ప్రతినిధి: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన సదరం శిబిరం, యుడీఐడీ(యుఐ) భవనంతో పాటు ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ సర్జరీ, ఈఎన్టీ విభాగాలకు సంబంధించిన నాలుగు ఆపరేషన్ థియేటర్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను మంత్రి పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, జిల్లా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ ముందు విపక్షాల నిరసనలు రాజకీయ స్వార్థం కోసమే




- హిందూ ధర్మాన్ని అవమానించడమే, వారి లక్ష్యం
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి

జగిత్యాల ఆగస్టు 04(మనం న్యూస్)ః అయోధ్య శ్రీరామ మందిరంలో విరాళాల వ్యవహారాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు వక్రీకరిస్తూ పార్లమెంట్ లోపల, వెలుపల నిరసనలు చేపట్టడం కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం విమర్శించారు.

జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో సమావేశంలో వారు మాట్లాడుతూ, రామమందిర విరాళాల్లో అవినీతి జరిగిందంటూ ఇండియా కూటమి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవేనని అన్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసి పారదర్శకంగా విచారణ చేపట్టిందని, శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ప్రతినిధులు కూడా నైతిక బాధ్యతతో రాజీనామా చేశారని గుర్తు చేశారు. విచారణ పూర్తికాకముందే అసత్య ప్రచారంతో భక్తులను తప్పుదోవ పట్టించడం సరికాదని, హిందూ విశ్వాసాలను రాజకీయాలకు వాడుకోవద్దని ప్రతిపక్షాలకు హితవు పలికారు. రామమందిరంపై అనవసర ఆరోపణలు చేసి ప్రజల్లో అపోహలు సృష్టించడం మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి జంబర్తి దివాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి రాగిళ్ల సత్యనారాయణ, ఇట్నేని రమేశ్, గర్వందుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రికి వినతి



ఏటూర్ నాగారం, ఆగస్టు 4, మనం ప్రతినిధి: గ్రామంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా మెరుగుదలకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)ను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో పెరుగుతున్న జనాభా, పారిశుద్ధ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటింటి చెత్త సేకరణ కోసం ట్రాలీలతో కూడిన రెండు ట్రాక్టర్ల కొనుగోలుకు ప్రభుత్వ నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర అత్యవసర సేవల నిర్వహణ కోసం అదనంగా ముగ్గురు మల్టీ పర్పస్ వర్కర్ల (ఎంపీడబ్ల్యూలు) నియామకానికి అనుమతి ఇవ్వాలని కోరారు. గ్రామంలో మురుగు కాలువల నిర్మాణం, డ్రైనేజీల పూడికతీత, ఓహెచ్ఎస్ఆర్ (ఎత్తైన నీటి నిల్వ ట్యాంకులు) నిర్మాణం, పైప్లైన్ల విస్తరణ ద్వారా ప్రజలకు నిరంతరం సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందించి అవసరమైన నిధులు, అనుమతులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు.



## మున్సిపల్ ఇంటి పన్ను నోటీసుల పంపిణీలో జాప్యంపై చైర్‌పర్సన్ ఆగ్రహం

జగిత్యాల ఆగస్టు 04 (మనం న్యూస్)ః ఈ సందర్భంగా ఇంటి పన్ను నోటీసులను ప్రజలకు పంపిణీ చేయకుండా కార్యాలయంలోనే నిల్వ ఉంచిన విషయాన్ని గుర్తించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఆదాయ వృద్ధికి ఇంటి పన్ను వసూళ్లు అత్యంత కీలకమని, నోటీసులను సకాలంలో పంపిణీ చేయకపోవడం విధుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని చైర్పర్సన్ పేర్కొన్నారు. ప్రజలకు వెంటనే ఇంటి పన్ను నోటీసులను అందజేసి, బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఆదాయ సేకరణను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఇకపై ఇలాంటి జాప్యాలు పునరావృతమైతే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలో మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, రెవెన్యూ అధికారి అజ్మతుల్లా, సంబంధిత అధికారులు ఉన్నారు.

## నిరుపేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

మంగపేట, ఆగస్టు 4, మనం ప్రతినిధి, : మండలంలోని పూరేడుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి, నియోజకవర్గ యువనేత కుంజ సూర్య రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన కడారి సారమ్మ కుమార్తె కడారి శారద అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన, అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ



సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కుంజ సూర్య, మంత్రి ధనసరి అనసూయ సీతక్క అండగా ఉంటారని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నిరుపేద కుటుంబాలకు తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పూనెం నర్సయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. అజ్మత్, బొజ్జ నరేష్, సింగ నరసింహారావు, తోలేం నాగబాబు, పూణెం హేమంత్, తిరుపతి, పెద్దల నరేష్, మండల కార్యవర్గ సభ్యురాలు పూణెం సుష్మిత, మహిళా గ్రామ పార్టీ అధ్యక్షురాలు నరసమ్మ, వాసంపల్లి రజిత, ఎస్.కె. ఆస్మా, వాసంపల్లి పెద్ద రజిత, పూణెం శోభారాణి, ఎట్టి పార్వతి, సరిత, తాటి వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొత్త బెస్తగూడెం విద్యార్థులకు గ్రంథాలయ పుస్తకాల బహూకరణ



మంగపేట, ఆగస్టు 4, మనం ప్రతినిధి: మండలంలోని ఎం.పి.యు.పి.ఎస్. కొత్త బెస్తగూడెం పాఠశాల విద్యార్థులకు అమెరికాలో నివసిస్తున్న జాస్తి శివరామకృష్ణ గ్రంథాలయ పుస్తకాలను బహూకరించారు. స్వగ్రామ విద్యార్థులకు విద్యా సహాయం అందించాలనే ఉద్దేశంతో ఆయన నిర్వహిస్తున్న ఉన్నవ డాట్ కాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ పుస్తకాలను పంపించారు. సంస్థ ప్రతినిధి, ఆయన మేనమామ గంట భగీరథుడు పాఠశాలకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందా భద్రయ్య మాట్లాడుతూ, పుస్తకాలను అందించిన జాస్తి శివరామకృష్ణకు, వాటిని పాఠశాలకు చేర్చిన గంట భగీరథుడికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంచి వారి జ్ఞాన వికాసానికి వినియోగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆకినపల్లి మల్లారం ఎం.పి.యు.పి.ఎస్. ప్రధానోపాధ్యాయులు బోడెబోయిన నరసింహారావు, ఉపాధ్యాయులు కొమరం శ్రీనివాసరావు, సంధ్యారాణి, దామోదర్, అంగన్వాడీ టీచర్ సరోజన తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు అకాడమికి నూతన జవసత్వాలు కల్పిస్తాం

హనుమకొండ, ఆగస్టు 4 (మనం ప్రతినిధి): తెలుగు అకాడమి చరిత్రలో మొట్టమొదటిసారిగా విద్యాశాఖ మంత్రుల తరువాత తనకు అవకాశం దక్కడం నిజంగా తన అదృష్టమేనని ఈ పదవిని అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా నిర్వహించి భాషాభిమానుల సాహితీప్రియుల, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడుతానని తెలుగు అకాడమి చైర్మన్గా బాధ్యతలు స్వీకరిం చిన కేయూ ఆచార్యులు కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మంగళవారం సాయంత్రం వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం, వరంగల్ మిత్రమండలి ఆధ్వర్యంలో తెలుగు అకాడమి సంచాలకులుగా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య భట్టు రమేశ్, చైర్మన్ కూరపాటి వెంకటనారాయణల ఆత్మీయ అభినందన సభ ఘనంగా జరిగింది. పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత చైర్మన్ కూరపాటి మాట్లాడుతూ తనకు పదవీ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రత్యేక గుర్తింపునిచ్చారని ఆయన ఆశయాలను అనుగుణంగా పని చేస్తానన్నారు. విద్యార్థి దశ నుంచి అనేక ఉద్యమాలతో మమేకమైన తనకు ఈ కీలకమైన



పదవి ద్వారా పదవీకే గుర్తింపు తెచ్చేలా వ్యవహరిస్తానని చెప్పారు. తెలుగు అకాడమీ సంచాలకులు బాధ్యతలు చేపట్టిన భట్టు రమేశ్ మాట్లాడుతూ వెలిశాల కొండల్రావు, డాక్టర్ మంజులత లాంటి అనేక మంది ప్రముఖులు నిర్వహించిన అకాడమి సంచాకుని పోస్టులో తాను నియమితులు కావడం నిజంగా సుకృతమేనని అన్నారు. ప్రతియేటా అకాడమి ద్వారా కేజీ నుంచి పీజీ వరకు అన్నట్లుగా విద్యార్థులకు ఉచితంగా అం చే పాఠ్య పుస్తకాలు, పరిశోధక, ఉద్యోగ ఎంట్రన్స్ కోసం ప్రచురించే అకాడమి పది లక్షల పుస్తకాల్లో తమ పేరు నేరుగా విద్యార్థులకు చేరుతుండటం గొప్ప విశేషమన్నారు. అటు విద్యార్థుల, సాహిత్య అభిమానుల, తెలుగు భాషా ప్రియుల మనోభావాలకు అనుగుణంగా ఆచార్య కూరపాటి మార్గదర్శనంలో తాను బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. ఈ నెల 2వ వారం సా చి అకాడమి ద్వారా సాహిత్య పత్రికను పునం ప్రారంభిస్తామన్నారు. వరంగల్ అంటే తనకు వల్లమాలిన అభిమానమని ఇక్కడే ప్రజల ఆదరణ, ఆత్మీయత తనకు ఎళ్లవేలలా మార్గదర్శనంగా నిలుస్తాయన్నారు. ముఖ్య అతిథిగా కేయూ విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య మాట్లాడుతూ భాషా పట్ల మక్కువ ఉన్న ఇరువురు ఆచార్యులు ఈ ప్రాంతానికే చెందిన వారే అకాడమి బాధ్యతలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్చక సమాఖ్య పక్షాన గంగు ఉపేంద్రశర్మ-పాటు కేయూ జర్నలిజం శాఖ పక్షాన సంగని మల్లేశ్వర్, తెలుగు శాఖ పక్షాన డాక్టర్ పంతంగి వెంకటేశ్వర్లు, రాజు మహ్మద్, జీవీఎస్.శ్రీనివాసాచార్య, ఆచార్య బాబురావు, డాక్టర్ గడ్డం భాస్కర్, వల్లంపట్ల నాగేశ్వర్రావు, మేకిరి దామోదర్. ప్రొఫెసర్ రజితా పేర్వారం శ్రీనాథ్, శామంతుల దామోదర్, బాసాని సురేశ్, గంపా సతీష్ సునంద. అశోక్, కస్తూరిబాయి, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ప్రధాన ధ్యేయం

- జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా



వేములవాడ,ఆగస్టు 4(మనం న్యూస్): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖ్లీగిఒ) ప్రధాన లక్ష్యం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమమేనని జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా అన్నారు. అల్లం నారాయణ, సాగరన్న నాయకత్వంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల ప్రెస్ క్లబ్లో నిర్వహించిన టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని సభ్యులకు సభ్యత్వ రసీదులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులంతా ఐకమత్యంగా ఉండి తమ హక్కులు, సంక్షేమం కోసం సంఘటితంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రుద్రంగి ప్రెస్ క్లబ్ బలోపేతానికి జిల్లా కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, రుద్రంగి ప్రెస్ క్లబ్ బాధ్యులు గసికంటి రాజు,కత్తి రాజు,గుగ్గిళ్ల తిరుపతి,తుమ్మనపెల్లి నరేందర్,పిసారి కిషన్, నెరేళ్ల శేఖర్, ఎల్లల నర్సారెడ్డి, లింగంపెల్లి గంగాధర్, దెగావత్ తిరుపతి, నంద్యాడపు శ్రీనివాస్, మండలోజి ఉదయ్, సుంచు అనిల్, తర్రె మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కడియం

స్టేషన్ ఘన్ పూర్ ఆగస్టు 4(మనం న్యూస్ ): హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమావేశం అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని రైతులు తొలకరి వానలకు మరియు అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులు, బోరు బావుల కింద ఆరుతడి పంటలతో పాటు వరి నార్లు పోశారు. అయితే ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం వల్ల ఆరుతడి పంటలు ఎండిపోతున్నాయని, వరి నారు ముదిరిపోతున్నదని మంత్రి గారికి వివరించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా రిజర్వాయర్లలలో అందుబాటులో ఉన్న నీటితో ఆరుతడి పంటలకు, వరి నారు మల్లకు వెంటనే సాగు నీరు అందించి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు వెంటనే ఈ.ఎన్.సి రమేష్ గారితో మాట్లాడి వచ్చే రెండు, మూడు రోజుల్లో వరంగల్ లో దేవాదుల ఎత్తిపోతల పథకం కింద జరుగుతున్న పంపింగ్ మరియు రిజర్వాయర్లలో ఉన్న నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలకు సాగు నీరు విడుదలపై ప్రజా ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి గారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

## గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలి



- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ఆగస్టు 04 (మనం ప్రతినిధి)ః మల్లాపూర్ మం.పాత ధామ్ రాజ్ పల్లి గ్రామంలో నిర్మాణ దశలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను మరియు వాల్గొండ గ్రామంలో చేపట్టబోయే రూ. 3 కోట్లతో రహదారి పనులను సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. పాత దామరాజపల్లి గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం పనులను నాణ్యతతో వేగవంతం పూర్తి చేయాలని నిర్ధారించిన గడువు లోపు వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వాల్గొండ గ్రామంలో ఇతర అభివృద్ధి పనులతో పాటు ఆర్ అండ్ బి రహదారి మీదుగా శ్రీ త్రికూట రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు, అక్కడి నుండి గోదావరి నది వరకు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆలయానికి రానున్న పుష్కరాలకు వచ్చే భక్తులు, స్థానిక రైతులు, గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, పర్యాటకాభివృద్ధికి కూడా దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, చేపట్టే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# భూసేకరణ వేగవంతం చేయాలి

- ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం వెంటనే పూర్తి చేయాలి
- ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలి
- జిల్లా కలెక్టర్ కె హైమావతి



సిద్దిపేట ఆగస్టు 4 (మనం ప్రతినిధి): అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమాధానంగా అందించడంలో ముందుండాలని, జిల్లాలో భూ సేకరణ సంబంధించి ఆయా డివిజన్ వారిగా టీజీ ఐఐసి గుర్తించిన భూమిని ఆర్డీవో లు అత్యంత ప్రాధాన్యత తీసుకుని భూ సేకరణ పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె అమరావతి ఆదేశించారు. రెవెన్యూ అధికారులు మంగళవారం జరిగిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ పాల్గొన్నారు. దేవాదుల ప్రాజెక్టు సంబంధించి చేర్యాల, కొమురవెల్లి, కొండపాక మరియు గౌరవెల్లి ప్రాజెక్ట్ సంబంధించి కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలంలో ఆర్డీవోలు కాలువల భూ సేకరణ తహసిల్దార్ లతో కలిసి పూర్తి చేసేందుకు సర్వే నిర్వహించి అవార్డ్ పాస్ చెయ్యాలని ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే సంబంధించి బస్వాపూర్ మరియు హుస్నాబాద్ పట్టణంలో భూ సేకరణ వేగవంతం చెయ్యాలని హుస్నాబాద్ ఆర్డీఓ ను, రీజనల్ రింగ్ రోడ్ భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని గజ్వేల్ ఆర్డీఓ ను ఆదేశించారు. భూ సమస్యలు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చిందని, భూ భారతి రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులు డిస్పోసల్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని, సాదా బైనమా పెండింగ్ అప్లికేషన్ లు తహసిల్దార్, ఆర్డీఓ డిస్పోసల్ చేసి భూ భారతి రెవెన్యూ చట్టం గుర్చి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పిస్తూ ఒక నమ్మకం కల్పించాలని ఆదేశించారు. సీఎం ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతిపత్రాలను నేరుగా ప్రభుత్వానికి అందించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం ద్వారా జిల్లాకు వచ్చిన పిర్యాదులను పెండింగ్ ఉంచకుండా పరిష్కారం చూపించాలని ఆదేశించారు. జిల్లాలో నిర్వహించే ప్రజావాణి అప్లికేషన్ లు ఎక్కువ మొత్తంలో రెవెన్యూ సంబంధించిన సమస్యలు వస్తాయని వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ భూములు ఆయా మండలాల వారిగా నక్షా ప్రకారం ఎంత ఉంది, సర్వే నిర్వహించి ఆక్రమణలకు గురికాకుండ పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. జిల్లాలో రెండు పడక గదులు నిర్మాణంలో ఉన్న వివరాలు సేకరించాలని, నిర్మాణం పూర్తి అయిన వాటిని అసలైన లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతుందని, ఆ మండలాల్లో తహసీల్దార్ భవనం నిర్మాణం కొరకు అనువైన ప్రభుత్వ భూమిని ఎంపిక చేస్తే, ఇంజనీరింగ్ శాఖల సమన్వయంతో ఎస్టిమేట్ వేసి మంత్రుల చేతులమీదుగా శంకుస్థాపన చేయిస్తానని తెలిపారు.

మీ సేవ మరియు తహసిల్దార్ కార్యాలయంలో ఆదాయ, కుల, నివాస, మరణ ధ్రువ పత్రాలు పెండింగ్ వివరాలను సమీక్షిస్తూ ధ్రువ పత్రాలు వెరిఫై చేసి డిస్పోసల్ చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, రామ్మూర్తి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య,ఎస్డిసి వరలక్ష్మి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# జూరాల ప్రాజెక్టుతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు సాగునీరు



- వరద నీటిని సద్వినియోగం చేసుకోవాలి
- జూరాల కుడి కాలువ ద్వారా ఆర్డీఎస్ లింక్ కెనాల్స్ కు నీటిని మళ్ళించాలి
- వేసవిలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక అవసరం
- కాలువలు, ఇతర మరమ్మత్తుల పనులు వేసవిలోనే పూర్తి చేయాలి
- జూరాల ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 04 (మనం బ్యూరో):** జూరాల ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లాలోని వివిధ ఎత్తిపోతల పథకాలతో ప్రస్తుతం వస్తున్న వరద నీటితో అన్ని రిజర్వాయర్లను నింపుకోవడంతో పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీటిని అందించవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును జోగులాంబ జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మ్యాపును, వివిధ రిజిస్టర్ లను పరిశీలించారు. కర్ణాటక ప్రాజెక్టుల నుంచి కొద్దిరోజులుగా కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద వస్తుండడంతో జూరాల ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం, గేట్ల ద్వారా దిగువకు వదులుతున్న, ఎత్తిపోతల పథకాలకు, సమాంతర కాలువలకు వినియోగిస్తున్న వరద నీటి, తదితర వివరాలను సంబంధిత ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లను పరిశీలించిన కలెక్టర్ అక్కడి యంత్రాల పనితీరుపై క్షుణ్ణంగా తెలుసుకున్నారు. అదేవిధంగా పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగారు. పవర్ హౌస్ నుంచి ఉత్పత్తి అయ్యే జలవిద్యుత్ గురించి అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూరాల కుడి కాలువ లైనింగ్ మరమ్మత్తులు, ఇతర పనులను వేసవిలోనే పూర్తి చేయాలన్నారు. చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందాలంటే కాలువల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టుల నిర్వహణకు వచ్చే నిధులను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటే ఎలాంటి సమస్య ఉండదన్నారు. జూరాల కుడికాలువ ద్వారా ఆర్డీఎస్ పరిధిలోని లింక్ కెనాల్సు కు నీటిని మళ్లించేందుకు ప్రయత్నించాలన్నారు. ఫలితంగా అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నప్పటికీ కాలువల పరిధిలోని రైతులు ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండడంతో వరి సాగు చేసే అవకాశం ఉందన్నారు. వరి పండించే రైతుల పంటలు చేతికొచ్చే వరకు కాలువల ద్వారా వరి సాగుకు నీటి లభ్యత గురించి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ముందు కెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. గద్వాల నియోజకవర్గ పరిధిలోని గూడెం దొడ్డి, ర్యాలంపాడు, తదితర రిజర్వాయర్లను ప్రస్తుతం వస్తున్న వరద నీటితో పూర్తి స్థాయిలో నింపుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ప్రణాళికతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూరాల గేట్లు తెరవడంతో సెలవు రోజుల్లో పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తున్నందున వంతెనపై ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. సందర్శకులు ఘాట్ల వద్ద నీళ్లలోకి దిగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ రహదారుల అభివృద్ధికి ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేయించేందుకు ఇటీవల జిల్లాలో పర్యటించిన రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిపాదనలు పంపాలని ఆదేశి ంచినందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కేంద్రాల్లో నివసిస్తున్న ప్రజలకు పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ పర్యటనలో నీటిపారుదల శాఖ ఎస్ఈ కేశవరావు, డిఈ నాగేశ్వరరావు, తహసిల్దార్ నందిని, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వాతావరణ అనుకూల సాగు సాంకేతికతలపై శిక్షణ







**ములుగు, ఆగస్టు 4(మనంన్యూస్):** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ములుగు, సిద్దిపేటలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో, ముల్కనూరు కో-ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ అండ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, ముల్కనూరు సహకారంతో ముల్కనూరు ప్రాంత కూరగాయల రైతుల కోసం 'వాతావరణ మార్పులకు తట్టుకునే కూరగాయల సాగు సాంకేతికతలు' అంశంపై ఒక రోజు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డా. వి. సుచిత్ర స్వాగత ప్రసంగంతో ప్రారంభించగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి. చంద్రశేఖర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులకు వాతావరణ మార్పుల నేపథ్యంలో కూరగాయల సాగులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతికతలు, నాణ్యమైన నారుమడి తయారీ పద్ధతులు, కూరగాయల కోత అనంతర నిర్వహణ, తెగుళ్లు మరియు పురుగుల గుర్తింపు, నివారణ చర్యలపై నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వెజిటబుల్ రీసెర్చ్ స్టేషన్, రాజేంద్రనగర్ శాస్త్రవేత్త డా. జె. శ్రీనివాస్ ఎల్నినో పరిస్థితుల్లో వాతావరణ అనుకూల కూరగాయల సాగు గురించి వివరించారు. అనంతరం పీజీఐహెచ్ఎస్కు చెందిన ఇన్-సర్వీస్ పీహెచ్.డి. పరిశోధకులు శ్రీమతి కె. నిరోష నాణ్యమైన నారుమడి తయారీ సాంకేతికతలు, శ్రీమతి ఎ.వి.ఎన్. లావణ్య కూరగాయల కోత అనంతర నిర్వహణపై రైతులకు శిక్షణ అందించారు. మధ్యాహ్నం జరిగిన సమావేశంలో డా. వి. సురేష్ కూరగాయల పంటల్లో పురుగులు, వ్యాధుల నిర్ధారణ మరియు సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు.అనంతరం రైతులను ఉద్యాన విశ్వవిద్యాలయం దత్తత గ్రామం క్షీరసాగర్ లో గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి (ఓఆఖ) గారి ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన క్షేత్ర ప్రదర్శనకు తీసుకువెళ్లి, వాతావరణ అనుకూల కూరగాయల సాగు పద్ధతులను ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా రైతుల నుండి అభిప్రాయాలను స్వీకరించి, భవిష్యత్తులో ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని అధికారులు తెలిపారు. రైతులు కూడా ఈ శిక్షణ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొంటూ విశ్వ విద్యాలయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# నకిలీ ఎరువుల వ్యాపారంపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుంది



- 872 నకిలీ డీఏపీ ఎరువుల బ్యాగులు స్వాధీనం
- 3 ఎఫ్ఐఆర్లు నమోదు, 7 మంది అరెస్టు
- రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**ఉమ్మడి మహబూబ్ నగర్, ఆగస్టు 04 (మనం బ్యూరో):** నాగర్ కర్నూల్ జిల్లాలోని రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం, నాణ్యమైన వ్యవసాయ ఇన్పుట్లు అందుబాటులో ఉండేలా చూడడమే జిల్లా యంత్రాంగం అత్యున్నత ప్రాధాన్యత అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ ఎరువుల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై ఎలాంటి రాజీ లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేస్తూ, మంగళవారం ఉదయం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటివలే నకిలీ డైఅమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ) ఎరువులు విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పరిపాలన, వ్యవసాయ శాఖ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. బిజినపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, కల్వకుర్తి మండలాల్లో నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో ప్రముఖ ఎరువుల కంపెనీల పేర్లతో నకిలీ లేబుళ్లు అతికించిన మొత్తం 872 డీఏపీ ఎరువుల బ్యాగులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి బిజినపల్లి పోలీస్ స్టేషన్ (ఇట.ౕా.187/2026), తాడూరు పోలీస్ స్టేషన్ (Cr. No.96/2026), కల్వకుర్తి పోలీస్ స్టేషన్ (ఇట.ౕా.263/2026)లలో భారతీయ న్యాయ సంహిత (ఖ్రూఖ), ట్రేడ్ మార్క్స్ చట్టం, ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు-1985లోని సంబంధిత నిబంధనల కింద మూడు ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నకిలీ ఎరువుల అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరో ఇద్దరిని పట్టుకునేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎరువుల నమూనాలను రాష్ట్ర ఎఫ్సిఓ నాణ్యత నియంత్రణ ప్రయోగశాలకు పంపగా, రసాయన విశ్లేషణలో నత్రజని, భాస్వరం వంటి కీలక పోషక ప్రమాణాల్లో తీవ్ర లోపాలు ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. దీంతో వాటిని అధికారికంగా నాన్-స్టాండర్డ్ / నకిలీ ఎరువులుగా ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ వెల్లడించారు. నిందితులపై నిత్యావసర వస్తువుల చట్టం-1955లోని సెక్షన్ 3, 7తో పాటు ఇతర వర్తించే చట్టాల ప్రకారం కఠిన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా, నిత్యావసర వస్తువుల చట్టంలోని సెక్షన్ 6అ ప్రకారం స్వాధీనం చేసుకున్న ఆస్తులను జప్తు చేసే రెవెన్యూ ప్రక్రియను ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నాగర్ కర్నూలు జిల్లాలోని రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను తప్పనిసరిగా లైసెన్స్ పొందిన డీలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు వంటి అధికారిక విక్రయ కేంద్రాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు తప్పనిసరిగా అధికారిక బిల్లు లేదా రసీదు తీసుకోవాలని, బిల్లు లేని వస్తువులను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని, గుర్తింపు లేని వ్యక్తులు, రిజిస్టర్ కాని వ్యాపారులు లేదా అనధికార రవాణా వాహనాల ద్వారా ఎరువులు విక్రయించినట్లయితే వాటిని కొనుగోలు చేయరాదని రైతులకు హెచ్చరించారు. నకిలీ ఎరువుల విక్రయాలు, అనుమానాస్పద నిల్వలు లేదా అనధికార విక్రేతల గురించి సమాచారం తెలిసిన వెంటనే స్థానిక మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) లేదా సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో నకిలీ ఎరువుల అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. రైతులను మోసం చేసే వ్యక్తులు ఎంతటి వారైనా చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

# గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు



**గజ్వేల్, ఆగస్టు 4 మనం న్యూస్:** గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ కొమ్ము రాజశేఖర్ ను కలిసి అభినందనలు తెలిపిన దుబ్బాక హుస్నాబాద్ సూపరింటెండెంట్ లు కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. మంగళవారం నాడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ కార్యాలయంలో దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ రెడ్డి లు కలిసి ఇటీవల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరిం టెండెంట్ పదవి బాధ్యతలు స్వీకరించడంతో రాజశేఖర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ హేమ్రాజ్ సింగ్ మాట్లాడుతూ సౌమ్యుడు అయిన రాజశేఖర్ గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ పదవి స్వీకరించడం ఎంతో ఆనందంగా ఉందని తాను గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చదివేటప్పుడు రాజశేఖర్ సీనియర్ అని విధుల పట్ల నిక్కచ్చిగా ఉండే వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాము, డాక్టర్ త్రివేణి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# క్షీరాసాగర్‌లో ఘనంగా బాలసభ



**క్షీరాసాగర్, ఆగస్టు 4(మనంన్యూస్):** గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బాలసభను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే సభ నిర్వహణ బాధ్యతలను చేపట్టి, పాఠశాలలోని సమస్యలను స్వయంగా సభ ముందుంచి, వాటి పరిష్కార మార్గాలపై చర్చించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలరెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రవికుమార్ , ఎంపీవో నరేంద్ర రెడ్డి, గ్రామ కార్యదర్శి సోని, ఉపసర్పంచ్ రమేష్ ,పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎన్.తిరుపతి రెడ్డి,కె.విద్యాధర్ రెడ్డి, కె.రాము, ఆర్. ప్రకాష్,జి . శోభారాణి, పి. రజని మరియు విద్యార్థులు పాల్గొన్నారు. బాలసభలో విద్యార్థులు పాఠశాలలో ఎదుర్కొంటున్న పలు మౌలిక వసతుల సమస్యలు, విద్యార్థుల అవసరాలు మరియు పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ సమస్యలను ధైర్యంగా ప్రజాప్రతినిధుల ముందుంచడం విశేషంగా నిలిచింది.ఈ బాలసభను విజయవంతంగా నిర్వహించడంలో విద్యార్థులు కావ్య, ముక్తిరెడ్డి, మనీదీప్, రఘు దిలీప్ ముఖ్య పాత్ర పోషించారు. సభ నిర్వహణ, సమస్యల ప్రస్తావన, చర్చలో పాల్గొనడం వంటి బాధ్యతలను విద్యార్థులే స్వయంగా చేపట్టారు. ఇతర విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా, చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి మాట్లాడుతూ, పాఠశాలలో బాలసభ నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థులు తమ సమస్యలను తన ముందే ధైర్యంగా ప్రస్తావించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటానని, పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రవికుమార్ మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం తరగతి గది విద్య మాత్రమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సమస్యలను గుర్తించడం, వాటిపై చర్చించడం, పరిష్కార మార్గాలను సూచించడం వంటి సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో బాలసభలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులలో దాగి ఉన్న నాయకత్వ సామర్థ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థుల మౌలిక అవసరాలు, పాఠశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజాప్రతినిధులు మరియు అధికారుల దృష్టికి నేరుగా తీసుకెళ్లడానికి బాలసభ ఒక మంచి వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. పాఠశాల ప్రాంగణంలో బాలసభ నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం, విద్యార్థులు స్వయంగా సభను నిర్వహించడం, తమ సమస్యలను ప్రజాప్రతినిధుల ముందు ధైర్యంగా ప్రస్తావించడం పాఠశాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ బాలసభ విజయవంతంగా, అర్థవంతంగా మరియు విద్యార్థి కేంద్రితంగా సాగింది. విద్యార్థుల సమస్యలకు వేదిక - విద్యార్థుల చేతుల్లోనే నాయకత్వం అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ బాలసభ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులలో నాయకత్వ లక్షణాల పెంపుదలకు ఒక మంచి ముందడుగుగా నిలిచింది.

# మారుమూల గ్రామాల క్రీడాకారులను గుర్తించడమే ప్రభుత్వ లక్ష్యం

- వంకేశ్వరం గ్రామంలో మినీ స్టేడియం నిర్మాణానికి వేగం పెంచాలి
- ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి మహబూబ్ నగర్ ఆగస్టు 04 (మనం బ్యూరో):** గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసి, యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేలా మినీ స్టేడియం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎంపిక చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను సూచించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని పదర మండలం వంకేశ్వరం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మినీ స్టేడియం కోసం ప్రతిపాదించిన ప్రభుత్వ భూమిని మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. పదర మండలంలోని వంకేశ్వరం గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూమి సర్వే నంబర్-254లో ఉన్న 3 ఎకరాల 4 గుంటల స్థలాన్ని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. స్థల విస్తీర్ణం, భూ స్వరూపం, రాకపోకల సౌకర్యం, భవిష్యత్ విస్తరణ అవకాశాలు, మినీ స్టేడియం నిర్మాణానికి అనుకూలత వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..., రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామీణ యువకుడు తన ప్రతిభను ప్రదర్శించుకునేందుకు నాణ్యమైన క్రీడా వేదికలు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించడం ద్వారా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచే క్రీడాకారులు తయారవుతారన్నారు. వంకేశ్వరం గ్రామంలో ప్రతిపాదిత మినీ స్టేడియం నిర్మాణం పూర్తయిన తర్వాత పదర మండలంతో పాటు పరిసర గ్రామాల యువతకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు శిక్షణ, సాధన, పోటీల నిర్వహణకు అవసరమైన వేదికగా ఈ మినీ స్టేడియం నిలుస్తుందని చెప్పారు. గ్రామీణ యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని, స్టేడియం నిర్మాణానికి సంబంధించిన భూ రికార్డులు, సర్వే ప్రక్రియ, సాంకేతిక అనుమతులు, పరిపాలనా ప్రతిపాదనలు తదితర అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణానికి అవసరమైన అన్ని ప్రక్రియలను వేగవంతం చేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే విధంగా ఉండాలని తెలిపారు. ముఖ్యంగా యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని క్రీడా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులకు సూచించారు. అనంతరం ప్రతిపాదిత స్థలాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకుని, అవసరమైన నివేదికలను తక్షణమే సిద్ధం చేసి సమర్పించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్ర, ఎంపీడీవో సుధాకర్, వంకేశ్వరం గ్రామ సర్పంచ్ మౌనిక, పంచాయతీ కార్యదర్శి రమ్య, సర్వేయర్ విజయనిర్మల, ఎస్ఐతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిస్వార్థపరుడు డాక్టర్ హేమరాజ్ సింగ్



- పేదలకు వైద్యం చేయడమే ఆయన ధ్యేయం
- వైద్యరత్న బిరుదు రావడం అభినందనీయం

**గజ్వేల్, ఆగస్టు 4 మనం న్యూస్:** స్వార్థం లేని సేవ చేసే వ్యక్తి డాక్టర్ హేమరాజ్ సింగ్ అని ఆర్ఎంపి, పి.ఎం.పి డాక్టర్లు కొనియాడారు. మంగళవారం నాడు రామాయంపేట లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో వైద్యరత్న అవార్డు అందుకున్న సందర్భంగా డాక్టర్ హేమరాజ్ సింగ్ కు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కొనియడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేగుంట మండలం రామాయంపేట మండలం దుబ్బాక మండలానికి చెందిన ఆర్.ఎం.పి పిఎంపి వైద్యులు కేంద్రం నరేష్ రాము, శ్యామ్ వెంకట్లు మాట్లాడుతూ దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో నిస్వార్థంగా సేవ చేయడంలో ముందున్నాడంటే అది ఒక్క డాక్టర్ హేమరాజ్ సింగ్ కె దక్కుతుందన్నారు. దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తూ ఎంతోమందికి ఆపరేషన్లు చేస్తూ ప్రజల అభిమానాన్ని చేరుకొనడంలో డాక్టర్ హేమరాజ్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. దుబ్బాక పరిసర ప్రాంతాలతో పాటు రామాయంపేట చేగుంట మండలాల లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు దుబ్బాక ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు నిర్వహించుకోవడం పరిపాటుగా మారిపోయిందని అది ఒక్క డాక్టర్ హేమరాజ్ సింగ్ కె సాధ్యమైంది అన్నారు. డాక్టర్ సేవల గురించి ప్రభుత్వం వైద్యరత్న అవార్డును ప్రధానం చేయడం ఈ ప్రాంత ప్రజలతో పాటు తమకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆనందాన్ని వెలుబుచ్చారు. అనంతరం డాక్టర్ హేమరాజ్ సింగ్ ను మెమెంటు శాల్వాల ద్వారా ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి చేగుంట రామాయంపేట దుబ్బాక మండలాలకు చెందిన ఆర్.ఎం.పి, పి.ఎం.పి డాక్టర్లతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

# ఆగస్టు 6న జరిగే... సంకల్ప సభను విజయవంతం చేయండి



**గజ్వేల్ ఆగస్టు 4 మనం న్యూస్:** సామాజిక న్యాయం, బడుగులకు రాజకీయ ప్రాతినిధ్యం లక్ష్యంతో తెలంగాణ రక్షణ సేన ఈ నెల 6న సరూర్నగర్, ఇండోర్ స్టేడియంలో తలపెట్టిన సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు గజ్వేల్ నుండి 1000 మంది ముఖ్య కార్యకర్తలతో తరలి వెళ్తున్నట్లు హైకోర్టు న్యాయవాది, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇంచార్జి కొట్టాల యాదగిరి ముదిరాజ్ తెలిపారు. మంగళవారం గజ్వేల్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా వారి స్ఫూర్తితో టీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ ప్రతినిధులు హాజరుకానున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం ఆశించిన సామాజిక న్యాయం జరగలేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి వర్గానికి, వెనుక బడిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పి ాచడం ఈ సదస్సు ఏర్పాటు లక్ష్యమని అన్నారు. సంకల్ప సభతో పేదలకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తూ సామాజిక న్యాయౕ అమలు తదితర ప్రజల అభిప్రాయాన్ని పాలకుల దృష్టికి బలంగా తేనున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆకాంక్షించిన సామాజిక తెలంగాణ నిర్మాణమే సభ లక్ష్యమని, రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో సముచిత వాటా కల్పించే దిశగా ఈ సభా వేదిక అడుగులు వేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎడ్ల నర్సింలు, శ్రీకాంత్, స్వామి, అమర్ సింగ్, చందు, ప్రసాద్, కుమార్, వెంకటేష్ , అశోక్, రాజేష్, కిషన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ పునర్నిర్మాణ పనులను పూర్తిచేయాలి

- ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి చేయాలి
- భక్తులకు మెరుగైన దర్శన, మౌలిక వసతులు కల్పించేలా వేగవంతం చేయాలి
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్





భద్రాచలం ,ఆగస్టు 4 (మనం న్యూస్) : వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఉత్తర ద్వార దర్శనం వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించిన డ్రాయింగ్స్ను పరిశీలిస్తూ నిర్మాణాల రూపకల్పన, పనుల నాణ్యత, అమలు తీరు, పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను ముక్కోటి ఏకాదశి నాటికి తప్పనిసరిగా పూర్తిచేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.అనంతరం తూర్పు వైపు నుంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణ మార్గంలో పర్యటిస్తూ తూర్పు, దక్షిణ, పడమర వైపులా కొనసాగుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన డ్రాయింగ్స్ను పరిశీలిస్తూ అధికారులు, ఇంజినీర్లను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల రూపకల్పనలో ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రతి పనిని ప్రణాళికాబద్ధంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు ఉన్న మార్గాన్ని జిల్లా కలెక్టర్ కాలినడకన పరిశీలించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఈ మార్గంలో రాకపోకలు సాగించే నేపథ్యంలో రోడ్డు విస్తరణ, పాదచారుల మార్గాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వెలుగులు, భద్రతా ఏర్పాట్లు, సూచిక బోర్డులు, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయం నుంచి ఘాట్ వరకు రోడ్డు విస్తరణ పనులను పుష్కరాల నాటికి పూర్తిచేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.అనంతరం చిత్రకూట మండపం వద్ద కొనసాగుతున్న తొలగింపు పనులను పరిశీలించారు. మండపంలోని పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో అత్యంత జాగ్రత్తగా తొలగింపు ప్రక్రియ చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్కు వివరించారు. రాతి స్తంభాలను గుర్తింపు సంఖ్యలతో నమోదు చేసి నిపుణుల పర్యవేక్షణలో భద్రపరుస్తున్నట్లు తెలిపారు. ఈ తొలగింపు ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. పురాతన వారసత్వ సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రతి పనిని అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చేరుకున్న జిల్లా కలెక్టర్కు ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, జిల్లా కలెక్టర్ శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేసి ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు ఈ ఏడాది మార్చి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి ఆలయ అభివృద్ధి పనులను పూర్తిచేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందన్నారు. అన్ని పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా అవసరమైన పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక చర్యలను సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు రోడ్లు భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత, ఆధ్యాత్మిక విశిష్టతకు భంగం కలగకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. భక్తులకు మెరుగైన దర్శన సౌకర్యాలు, విశాలమైన రాకపోకల మార్గాలు, ఆధునిక మౌలిక వసతులు కల్పించి గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులను పూర్తిచేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ పర్యటనలో భద్రాచలం తహశీల్దార్ రవికుమార్, పంచాయతీ ఈవో, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నాగేశ్వరరావు,దేవాదాయ శాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'యూత్ డిక్లరేషన్' నిరుద్యోగుల పాలిట మరణ శాసనం

- బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ధ్వజం

ఖమ్మం, ఆగష్టు 4(మనం బ్యూరో): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను నమ్మిస్తూ, మోసం చేస్తోందని, ఎన్నికల ముందు వారు ప్రకటించిన 'యూత్ డిక్లరేషన్' నేడు నిరుద్యోగుల పాలిట మరణ శాసనంగా పరిణమించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. ఉద్యోగం రాక తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గడ్డం వేణును రాకేశ్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం బిఆర్ఎస్ జిల్లా



కార్యాలయం 'తెలంగాణ భవన్'లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉద్యోగాలు రాకపోవడంతో తన పేదరికాన్ని జయించలేక, కుటుంబాన్ని కాపాడుకోలేక తీవ్ర నిరాశా నిస్పృహలతో గడ్డం వేణు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వేణు రాసిన మూడు పేజీల సూసైడ్ నోట్ కేవలం అతని ఒక్కడి ఆవేదన కాదని, తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగుల గుండెల్లో మండుతున్న ఆక్రోశమని స్పష్టం చేశారు. ప్రభుత్వం భయపడి ఆ సూసైడ్ నోట్లోని పుటలను బయటకు రాకుండా తొక్కుతోందని, చివరకు ప్రేమ వ్యవహారమని చిత్రించి తప్పుదోవ పట్టించే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు, యూత్ డిక్లరేషన్ అంటూ ఊరూరా తిరిగి బాండ్ పేపర్లు పంచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ హామీలను గాలికొదిలేశారని విమర్శించారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏవయ్యాయి?, మెగా డీఎస్సీ జాడ ఏది?, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, జీవో 46 రద్దు హామీలు ఏమయ్యాయి? బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఫీజుల పేరిట విమర్శలు చేసిన కాంగ్రెస్ నాయకులు, నేడు కానిస్టేబుల్, ఎస్ఐ అప్లికేషన్లకు రూ. 1000 నుండి రూ. 1500 వరకు వసూలు చేస్తూ నిరుద్యోగుల రక్తాన్ని పిండుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి కమిషన్లు వచ్చే బిల్లులు, కాంట్రాక్టులపై ఉన్న శ్రద్ధ నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇవ్వడంపై లేదని రాకేష్ రెడ్డి ఎద్దేవా చేశారు. రాష్ట్ర హౌసింగ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సొంత జిల్లాలోనే అత్యంత పేద కుటుంబానికి చెందిన వేణుకు కనీసం ఇల్లు కూడా మంజూరు కాలేదని, కేవలం సొంత పార్టీ వారికే ఇండ్లు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. కష్టాల్లో ఉన్న వేణును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా ఫోన్లో పరామర్శించి, ధైర్యం చెప్పారని తెలిపారు. నిరుద్యోగులెవ్వరూ ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఉద్యోగ కల్పన, జాబ్ క్యాలెండర్ సాధించే వరకు బీఆర్ఎస్ ముందుండి పోరాడుతుందని పేర్కొన్నారు. తక్షణమే స్పష్టమైన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశం లో నాయకులు గూడా సంజీవ్ రెడ్డి, బలుసు మురళీకృష్ణ, మద్దెల విజయ కుమార్, ఈదుల రాజేష్, షారూక్, జడల కళ్యాణ్, సాయిదీప్, సాయి ప్రసాద్, మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

# తీవ్రరూపం దాల్చుతున్న నిరుద్యోగం

- జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
- వేణు కుమార్‌ను పరామర్శించిన బీజేపీ నేతలు



ఖమ్మం, ఆగస్టు 04(మనం న్యూస్) : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతోందని, ఉద్యోగాలు రాక, నోటిఫికేషన్లు లేక యువత తీవ్ర మానసిక వేదనకు గురవుతోందని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నోటిఫికేషన్లు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వేణుకుమార్‌ను బిజెపి నేతలు మంగళవారం పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సరూర్నగర్ యూత్ డిక్లరేషన్లో ఇచ్చిన ప్రతి మాటను అమలు చేయాలన్నారు. వేణు కుమార్ ఎన్నో ఏళ్లుగా లైబ్రరీల్లో రాత్రింబవళ్లు కష్టపడి చదువుకుంటూ, సొంత డబ్బులు ఖర్చు చేసి కోచింగ్ తీసుకున్నాడని తెలిపారు. ఇంట్లో తల్లి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటం, సొంత ఇల్లు కూడా లేకపోవడం, కుటుంబ పరిస్థితి అత్యంత దయనీయంగా మారడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. వేణు కుమార్ రాసిన సూసైడ్ నోట్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అలాగే కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు చేరాలనేదే అతని ప్రధాన కోరిక అని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి 45 రోజుల గడువు విధిస్తున్నామని, ఆ లోపు స్పష్టమైన కార్యాచరణతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగ యువతను ఏకం చేసి, నిరాహార దీక్షలతో సహా బృహత్తర ప్రజాస్వామ్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, మేకల నాగేందర్, ఆర్.వి.ఎస్. యాదవ్, సాయిరాం, ప్రతాప్, అర్బన్ మండల అధ్యక్షులు వాకదాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ

- పోస్టర్ను ఆవిష్కరించిన ఎస్పీ రోహిత్ రాజు




భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 04 (మనంప్రతినిధి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆగస్టు-2026 స్వాతంత్ర్య మాసం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న 'సురక్ష కా తిరంగా - సైబర్ స్వతంత్ర తెలంగాణ' సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం నాడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆగస్టు నెల పొడవునా సైబర్ నేరాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ ఆధారిత ఆర్థిక నేరాలు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సురక్ష కా తిరంగా' ప్రచార సందేశమైన 'ఆగు - ఆలోచించు, నిజం నిర్ధారించు, సైబర్ భద్రత పెంచు' అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. జాతీయ సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా నేటి నుండి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు మరియు సాధారణ ప్రజల భాగస్వామ్యంతో నెల పొడవునా సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్లైన్ కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ అవగాహన కలిగిన, సైబర్ సురక్షితమైన, సైబర్ స్వతంత్ర తెలంగాణ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, సైబర్ సెల్ సీఐ జితేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, సైబర్ సెల్ ఎస్ఐ జుబేదా బేగం సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలపై అధిక పన్నుల భారం మోపితే పోరాటం చేస్తాం

- జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు



వైరా, ఆగస్టు 04 (మనం న్యూస్): వైరా మున్సిపాలిటీలోని ప్రజలపై అధిక పన్నుల భారం మోపితే బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, టౌన్ ప్రెసిడెంట్ అప్పం సురేష్ అన్నారు. గత కొంతకాలంగా వసూలు చేస్తున్న మంచినీటి పన్నుల బకాయిలు ఎలాంటి తీర్మానం లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి సుమారు 8 సంవత్సరాల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంచినీటి పనులు వసూళ్లు చేయలేదని, వైరా మున్సిపాలిటీ పరిధిలో సిబ్బంది మూడు సంవత్సరాల బిల్లును ఒకేసారి వసూలు చేస్తూ సామాన్య ప్రజలపై అధిక భారం మోపుతున్నారని అన్నారు. ఎలాంటి ఆన్లైన్ బిల్లులు లేకుండా కేవలం ఆఫ్ లైన్ బిల్లుల ద్వారా బిల్లులు వసూలు చేయటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు కనీసం కౌన్సిల్ తీర్మానం లేకుండా త్రాగునీటి బిల్లులు ఎలా వసూలు చేస్తారని కమిషనర్ ను ప్రశ్నించారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ ఆన్లైన్ బిల్లులు వచ్చేవరకు సిబ్బంది తాగునీటి బిల్లులు వసూలు తాత్కారికంగా నిలిపివేస్తామని హామీ ఇచ్చారు .వారం రోజుల్లో కౌన్సిల్ సమావేశం నిర్వహించి తీర్మానం ప్రతిపాదిస్తామని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ టిఆర్ఎస్, సిపిఐ సిపిఎం కౌన్సిలర్లు కట్టా స్వరూప రాణి ,తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, కిన్నెర కృష్ణ, మాదిరిని సునీత దుర్గాప్రసాద్, నల్లమోతు శైలజ, ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు మద్దెల రవి, పట్టణ మహిళా మాజీ అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, నాయకులు మాదినేని దుర్గాప్రసాద్, నూకల వాసు, పుల్లయ్య, పాసంగులపాటి శివ, బత్తుల రాజు ,కొత్త నరసింహారావు ,మాచర్ల శంకర్ ,నరసింహారావు, కట్ట నాగేశ్వరరావు, వేముల శివకృష్ణ, రంజాన్, వదినేపల్లి చక్రవర్తి, గుగులోతు బాలు, వీరన్న ,రేచర్ల సైదులు, వల్లెపు రాము, మిట్టపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ ఎమ్మెల్యే

దమ్మపేట, ఆగష్టు 04 (మనం న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో వే టు న్యూస్ వారి ఆధ్వర్యంలో డయల్ యువర్



ఎమ్మెల్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చరవాణి ద్వారా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులను వెంటనే అప్రమత్తం చేసి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# కరాటే ఛాంపియన్ షిప్‌లో శ్రీ చైతన్య విద్యార్థికి బంగారు పతకం



ఖమ్మం, ఆగష్టు 4(మనం న్యూస్): శ్రీ చైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎం.శ్రీజ ఖమ్మంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక కరాటే ఛాంపియన్షిప్లో సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో దక్షిణ భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించింది. ఈ విజయానికి కరాటే మాస్టర్ రామకృష్ణ అందించిన నైపుణ్యమైన శిక్షణ, మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, ఏజీఎంలు సిహెచ్. బ్రహ్మం, జి.ప్రకాశ్ రావు, జి.గోపాల్ కృష్ణ, జోనల్ ప్రిన్సిపాల్ ఎం.రత్నాకర్, డీన్లు వంశీ కృష్ణ, డి.శ్రీనివాసరావు, జె.కృష్ణ, ప్రిన్సిపాల్ జోజి చాకో, జి. రవీందర్ విద్యార్థిని శ్రీజను ఘనంగా అభినందించారు. ఆమె కృషి, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచేందుకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని, వారి సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా పేర్కొంది.

# దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు

- తెలంగాణకు రూ. 9.19 కోట్లు విడుదల
- ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు కేంద్ర సామాజిక న్యాయ మంత్రి బీఎల్.వర్మ సమాధానం



ఖమ్మం, ఆగష్టు 4(మనం బ్యూరో): దేశంలోని దివ్యాంగులకు మెరుగైన వసతులు, అభ్యసన అవకాశాలు కల్పించడంలో భాగంగా 'సుగమ్య భారత్ అభియాన్' అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. లోక్సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మంగళవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బీఎల్(బన్వారీలాల్ ). వర్మ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**- తెలంగాణకు అందిన నిధులు**

సుగమ్య భారత్ అభియాన్ కింద 2015-16 నుంచి 2024-25 వరకు తెలంగాణ రాష్ట్రానికి వివిధ ఏళ్లలో కలిపి మొత్తం రూ. 9.19 కోట్లు (రూ. 919.24 లక్షలు) విడుదల కాగా.. ఇందులో రాష్ట్రం ఇప్పటివరకు మొత్తం రూ. 4.56 కోట్లు (రూ. 455.63 లక్షలు) నిధులను వినియోగించినట్లు మంత్రి వెల్లడించారు.

**- యూడీఐడీ పోర్టల్ వివరాలు**

దివ్యాంగులకు డిజిటల్ పద్ధతిలో సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న యూడీఐడీ పోర్టల్ ద్వారా దేశవ్యాప్తంగా 1,40,68,994 మంది అనుసంధానం కాగా... తెలంగాణ రాష్ట్రంలో 9,07,019 మంది అనుసంధానమైనట్లు తెలిపారు.

-బడి మానేసే విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు

దివ్యాంగ విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా నిరోధించేందుకు 'సమగ్ర శిక్షా అభియాన్' ద్వారా పలు చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది. ఏటా రూ. 3,500 చొప్పున ఆర్థిక సహాయంతో పాటు బాలికల విద్యను ప్రోత్సహించేందుకు డీబీటీ ద్వారా ఏటా రూ.2,000 చొప్పున స్టైపెండ్ అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు.

# ట్రెజరీ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ సర్వీస్ రూల్స్‌కు సహకరించిన ఏలూరికి కృతజ్ఞతలు

ఖమ్మం, ఆగష్టు 4(మనం న్యూస్): ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్‌లో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సర్వీసెస్ రూల్స్ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుని పలుమార్లు కలిసి రిప్రజెంటేషన్ ఇచ్చి ఆమోదింప చేయడంలో,జీవో రావడంలో నిరంతరం కృషి గావించిన టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు, టిజిఈజెఏసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి



శ్యామ్‌ని టీజీవో ఖమ్మం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీస్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ నాన్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయభాస్కర్, వారి కార్యవర్గ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిపార్ట్మెంట్లో వివిధ కేటగిరీలలో ప్రమోషన్స్ ఇచ్చే విధంగా కృషి చేయాలని, అదే విధంగా ఫారిన్ సర్వీస్ పోస్టులలో ప్రమోషన్స్ వచ్చే విధంగా కృషి చేయాలని ఏలూరు శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, ఎన్వి కృష్ణారావు, ఏటిఓ ప్రసన్న కుమార్, మహబూబాబాద్ టీజీవో జిల్లా అధ్యక్షులు ఎస్.కె రఫీ, హజార్ షరీఫ్, అన్వర్ హుస్సేన్, జ్యోతిరావు, సదానందం, రాజగోపాల చారి, రవీంద్ర గౌడ్, శిరీష, లావణ్య, ఉదయ భాస్కర్, రాధా, బాలు, వినయ్, మహేష్, పర్వేజ్, ట్రెజరీ అకౌంట్స్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ బాధ్యులు, నాన్ గెజిటెడ్ సర్వీసెస్ అసోసియేషన్ బాధ్యులు, వివిధ జిల్లాల నుండి వచ్చిన సబ్ ట్రెజరీ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# తండాలలో తీజ్ పండుగ



- ప్రపంచవ్యాప్తంగా ఒకే సాంప్రదాయం
- తీజ్ పండుగకు ప్రభుత్వ గుర్తింపు ప్రకటించాలి
- బిజెపి సీనియర్ నాయకులు రవి నాయక్

**చారకొండ ఆగస్టు04(మనం న్యూస్):** భారతీయ సంస్కృతిలో ప్రతి పండుగకు ఒక ప్రత్యేకత,విశిష్టత ఉంది.ప్రపంచవ్యాప్తంగా ఒకే భాష,వస్త్రధారణ, ఆభరణాలు,జానపద కళారూపాలు,సంస్కృతి,సంప్రదాయాలు కలిగిన సుమారు 10 కోట్ల మంది బంజారాలు వివిధ ప్రాంతాల్లోలంబాడి, సుగాలి,లంబానీ,బాజీగర్,ధన్యుడి,రోమ్ జిప్సీ తదితర పేర్లతో గుర్తింపు పొందారు.కనుక తీజ్ పండుగకు ప్రభుత్వం అధికారికంగా గుర్తింపు కల్పించాలని బిజెపి సీనియర్ నాయకులు రవి నాయక్ తెలిపారు. కాలానుగుణ పరిస్థితుల ప్రభావంతో సంచార జీవనానికి స్వస్తి పలికి,నేడు దేశంలోని 23 రాష్ట్రాల్లో తండాల పేరుతో స్థిర నివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారు.వివాహం కాని ఆడపిల్లలు ప్రతి సంవత్సరం తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో,ఆనందోత్సాహాలతో తీజ్ పండుగను నిర్వహిస్తారు.'తీజ్' అంటే హరియాలి (పచ్చదనం),నిండుదనం,అష్టైశ్వర్యాలు,శుభం,సౌభాగ్యం,సుభిక్షానికి ప్రతీక అనే అర్థం. బంజారా లు సీతలాభవానికి పూజ తీజ్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టే కార్యక్రమం సీతలాభవాని పూజ. ఈ పూజలను జూలై నెలలో ఒక మంగళవారం నిర్వహిస్తారు. ఆ రోజు తండావాసులు వనభోజనాల పద్ధతిలో తండాకు దూరంగా వెళ్లి, ఒక చెట్టు కింద రాయిని సీతలాభవాని ప్రతిరూపంగా ప్రతిష్ఠించి సంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. పంటలు సమృద్ధిగా పండాలని, పశుపక్ష్యాదులు అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తారు.అదే రోజు సాయంత్రం తండా నాయకుడి ఇంటి వద్ద ఒక బిందెలో గోధుమలను నానబెడతారు.మరుసటి రోజు వెదురుతో తయారుచేసిన చిన్న కంకణ బుట్టల్లో ఎరువుతో మట్టి వేసి గోధుమలను చల్లుతారు. అలాగే దండి మేరమ్మ మాత, సద్గురు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేర్లతో టెంకాకు దొప్పల్లో కూడా గోధుమలను నాటి, వాటిని డేరా లేదా పందిరిపై ఉంచుతారు. గడ్ గోర్ డామోలి తొమ్మిది రోజుల పాటు ప్రతిరోజూ ఆడపడుచులు ఆటపాటలతో సమీపంలోని చెరువు లేదా బావి నుంచి మూడు పర్యాయాలు నీటిని తీసుకొచ్చి కంకణ బుట్టలకు పోస్తూ గోధుమలను పెంచుతారు. పతి సాయంత్రం గోర్ పరివార్ సభ్యులు జానపద గేయాలు,సాంప్రదాయ నృత్యాలు, కళారూపాలు ప్రదర్శిస్తూ తీజ్ ఉత్సవాలను ఆనందోత్సాహాలతో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బంజారా సంస్కృతి,సంప్రదాయాలు తరతరాలకు అందేలా కృషి చేస్తారు.నిమజ్జనం తొమ్మిదవ రోజు గురువారం ఉదయం దండి మేరమ్మ మాతకు,సద్గురు శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ కు ప్రత్యేక పూజలు నిర్వహించి కంకణ బుట్టలను పందిరి నుంచి కిందకు దింపుతారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు,కుటుంబ సభ్యులు,తండా నాయకులతో కలిసి సంప్రదాయ బంజారా జానపద నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. సాయంత్రం పచ్చగా పెరిగిన గోధుమ నారుతో కూడిన తీజ్ కంకణ బుట్టలను తలపై ధరించి ఆటపాటలతో ఊరేగింపుగా చెరువు వరకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేస్తారు. తీజ్ పండుగకు అధికార గుర్తింపు కల్పించాలితెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సుమారు 35 లక్షల మంది బంజారాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ విశిష్టమైన తీజ్ పండుగకు ఇప్పటికీ తగిన ప్రభుత్వ గుర్తింపు లభించలేదు. ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపం వంటి కారణాల వల్ల అనేక తండాలలో ఈ గొప్ప సంప్రదాయం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. కనుక బంజారా సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ప్రకటిస్తున్న తెలంగాణ ప్రభుత్వం తీజ్ పండుగను పరిరక్షించే దిశగా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని, దీనికి అధికారిక గుర్తింపు కల్పించాలని బంజారా సమాజం ఆశాభావంతో ఎదురుచూస్తుంది...

## తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయి



**నల్లగొండ --ఆగస్టు 4( మనం ప్రతినిధి ):** తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని కట్టంగూర్ గ్రామ సర్పంచ్ ముక్కామల శ్యామల శేఖర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని కట్టంగూర్ మండలం కేంద్ర పరిధిలో ని అంబేద్కర్ నగర్ కాలనీ లో గల అంగన్వాడీ కేంద్రం లో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల ర్యాలీ, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్న కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఎంతో శ్రేష్టకరం తప్పకుండా ప్రతి తల్లి తన బిడ్డకు తన పాలనే పట్టించాలని గర్భిణీ స్త్రీలు , బాలింతలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని తప్పకుండా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శారదా, వార్డు సభ్యులు మైనం ఉమా, ఏనుగు సైదులు,శ్రీరామ్ , సంధ్య ,వీరేష్ , కళ్లెం నాగేశ్వరావు, మరియు అంగన్వాడీ టీచర్స్ ఆయాలు, గ్రామ పంచాయతీ సిబ్బంది బాలింతలు గర్భిణీ స్త్రీలు చిన్నారులు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్-163పై అసంపూర్తి సర్వీస్ రోడ్లను వెంటనే పూర్తి చేయాలి

- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
- ఎన్‌హెచ్ఏఐ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం

**హనుమకొండ ఆగస్టు 04(మనం ప్రతినిధి ):** యాదాద్రి-వరంగల్ మధ్య జాతీయ రహదారి-163పై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఏఐ) చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ,₹ హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి (ఎన్హెచ్-163)లోని యాదాద్రి-వరంగల్ నాలుగు లేన్ల విస్తరణ పనుల సమయంలో నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల పరిధిలో సర్వీస్ రోడ్లు నిర్మించినప్పటికీ, వాటి మధ్య పలు ప్రాంతాల్లో అనుసంధాన లింకులు మిగిలిపోయాయని తెలిపారు. జనగాం సమీపంలోని. 87/200 కి.మీ నుంచి నిడిగొండ వరకు, నిడిగొండ నుంచి రఘునాథపల్లి వరకు, రఘునాథపల్లి నుంచి చాగల్ వరకు, చాగల్ నుంచి స్టేషన్ ఘన్పూర్ వరకు, స్టేషన్ ఘన్పూర్ నుంచి చిన్నపెండ్యాల వరకు, చిన్నపెండ్యాల నుంచి కరుణాపురం వరకు ఉన్న సర్వీస్ రోడ్లలో లింకులు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వివరించారు. ఈ కారణంగా స్థానిక వాహనాలు ప్రధాన జాతీయ రహదారిపైకి రావాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎంపీ పేర్కొన్నారు. నాలుగు లేన్ల విస్తరణ సమయంలోనే సర్వీస్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పూర్తయినందున, మిగిలిన లింకులను నిర్మించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. ప్రజల భద్రత, స్థానిక రవాణా సౌలభ్యం, గ్రామాల మధ్య మెరుగైన అనుసంధానం కోసం అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఎన్హెచ్ఏఐ చైర్మన్ను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

## తల్లి పాలు వారోత్సవాలపై అవగాహన సదస్సు



**ప్రత్తిపాడు ఆగస్టు 4 మనం న్యూస్:** ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుద్దరాజు గోపి రాజు ముఖ్య అతిథిగా హాజరైయారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత అవసరమని అన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలని, మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలే అందించాలని సూచించారు. తల్లిపాలపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కారే శ్రీరామ చంద్ర, మానేపల్లి సత్తిబాబు, గల్లా తాతీలు, నారిపిరెడ్డి చక్రం, నూలు వెంకట రమణ, కారే రామక్రిష్ణ, బుద్ధరాజు రామక్రిష్ణ రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ చక్రవేణి, పీ హెచ్ సీ డాక్టర్ గీత, అంగన్వాడి టీచర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి రక్షణ కవచం



- మంత్రి సీతక్క

**ఏటూరునాగారం, ఆగస్టు 4 (మన ప్రతినిధి):** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మంగళవారం ఏటూరునాగారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి బాలింతలను ఆప్యాయంగా పరామర్శించారు. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలతతో కలిసి వార్డులను పరిశీలించిన మంత్రి, బాలింతల ఆరోగ్య పరిస్థితి, నవజాత శిశువుల సంరక్షణపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 'తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమృతం. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ఎంతో అవసరం. తొలి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే అందిస్తే సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు బాటలు పడతాయి' అని పేర్కొన్నారు.టూ శిశువులకు క్రమం తప్పకుండా తల్లిపాలు అందించాలని, ప్రతి కుటుంబం తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి బాలల ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దొంగతనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఫ్రీ బస్సులు

**వృద్ధులకు,వికలాంగులకు, విద్యార్థులకు, రోగులకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్**



**పాలకొల్లు, ఆగష్టు 4,మనం ప్రతినిధి :** ఇటీవల ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు పథకం ప్రయోజనం కంటే నష్టం ఎక్కువ చేకూర్తుందని మహిళలు నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో ఉచిత బస్సు పై మహిళలు అధిక సంఖ్యలో ప్రయాణించడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సులు కిక్కిరిసి పోవడంతో మహిళల బంగారు ఆభరణాలు, పర్సులు, నగదు పోగొట్టుకుంటున్నట్లు అధిక సంఖ్యలో మహిళలు వాపోతున్నారు. ఈ ఫ్రీ బస్సు పథకం అన్న వస్త్రాలు వెళితే ఉన్న వస్త్రాలు పోయినట్లు చందంగా మారిందని పలువురు అంటున్నారు. ఈ ఫ్రీ బస్సు వల్ల ఏదైనా ఒక పని కోసం ఒకరు వెళితే మరి ముగ్గురు నలుగురిని కూడా తీసుకెళ్తున్నట్లు చెబుతున్నారు. దీంతో బస్సు ఎక్కే పురుషులకు గాని, వికలాంగులకు గాని, రోగులకు గాని, వృద్ధులకు గాని,విద్యార్థులకు గాని సీట్లు దొరక నానా అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఒక్కోసారి తోపులాట జరిగి పలువురు గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయని మరికొందరు చెప్తున్నారు. ఒక్కోసారి అయితే మహిళలు మహిళలు . సీట్లు కోసం జుట్లు పట్టుకుని కొట్టుకునే దుస్థితి కూడా ఏర్పడుతోందని మరికొందరు చెప్తున్నారు.ఉచిత బస్సు సౌకర్యం క్రింది వారికి మాత్రమే పరిమితం చేయాలి: ఏపీ రాష్ట్రానికి వందల కోట్లు నష్టం తెచ్చి పెడుతున్న ప్రయోజనం మాత్రం అంతగా ఉండటం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఈ ఉచిత బస్సులో ప్రయాణిం చేటప్పుడు నగదు, బంగారు ఆభరణాలు,పర్సులు పోగొట్టుకోవాల్సి వస్తుందని పలువురు చెబుతున్నారు. అందువల్ల ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని కేవలం వికలాంగులకు, వృద్ధులకు, రోగగ్రస్తులకు, విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని పలువురు కోరుతున్నారు. దీనివల్ల దొంగతనాలకు లోను కాకుండా ప్రయాణికులకు, అలాగే పై వారందరికీ మంచి ప్రయోజనం చేకూరుతుందని, లోటు బడ్జెట్ లో ఉన్న ప్రభుత్వానికి కూడా వ్యయం కలిసొస్తుందని దీనికోసం ఈ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి నాయకులు మొత్తం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నిరంతరం ఆచంట నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తాను



- ఎం ఎల్ ఏ పితాని సత్య

**ఆచంట ఆగస్టు 4 మనం న్యూస్:** రాజకీయ పార్టీలకు అతీతంగా ఆచంట నియోజకవర్గం ప్రజలకు నిరంతరం సేవ చేస్తాను అని ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు ఆచంట మండలం కొడమంచిలి గ్రామపంచాయతీ పరిధిలోని మెట్లపాడు మరియు చింతల తోట ప్రాంతాల్లో పితాని గడపగడపకు వెళ్లి సంక్షేమం అభివృద్ధి పొందారా లేదా అని గ్రామస్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు గ్రామీణ ప్రజలతో మాట్లాడుతున్నప్పటికీ నియోజవర్గ ప్రజలు ఏ ప్రాంతం నుంచి ఫోన్ చేసిన రిసీవ్ చేసుకుని నేనున్నాను ఏ సమస్య తలెత్తిన పరిష్కరిస్తాను అని అని ఎమ్మెల్యే పితాని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆచంట మండల ఆయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మళ్లీ మొదలైన బొండి ఇసుక తవ్వకాలు

- అప్పుడు లారీలు ఇప్పుడు టాక్టర్లు



**యు.కొత్తపల్లి అగస్ట్ 4 (మనం న్యూస్):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం పొన్నాడ పంచాయతీ కోనపాపేట పరిసర ప్రాంతాల్లో అక్రమ బొండి ఇసుక తవ్వకాలు మళ్లీ జోరందుకున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొంది మాత్రమే బొండి ఇసుక తవ్వకాలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుకను తవ్వి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండటంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోతులో బొండి ఇసుకను తవ్వడం వల్ల భూకుంగే ప్రమాదం ఉందని, భూసారం దెబ్బతిని వ్యవసాయ భూముల ఉత్పాదకత తగ్గే అవకాశం ఉందని పలువురు మేధావులు, రైతులు అభిప్రాయపడుతున్నారు. నియంత్రణ లేకుండా జరుగుతున్న తవ్వకాల కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో పాటు భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు.

బొండు మట్టి ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు: తాసిల్దార్ చిన్నారావు బొండు ఇసుక తవ్వకాలకు ఇటువంటి అనుమతులు లేవని అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తాసిల్దార్ చిన్నారావు పేర్కొన్నారు

## పంటల బీమాపై రైతులకు అవగాహన సదస్సు




**యు.కొత్తపల్లి అగస్టు 4 (మనం న్యూస్):** కొత్తపల్లి మండలం ఎండపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంతో పాటు పంటల బీమాపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కొత్తపల్లి మండల జనసేన పార్టీ ఇన్చార్జి రావు అక్షయ్, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మురాలశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు, పంటల బీమా వంటి అంశాలపై అవగాహన కల్పించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పి-4 కార్యక్రమంలో భాగంగా సత్యవతి అనే మహిళను దత్తత తీసుకుని ఆమెకు నిత్యావసర సరుకులు, మందులు అందజేసినట్లు చెప్పారు.రావు అక్షయ్ మాట్లాడుతూ ఎల్నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా, బలహీనంగా ప్రవేశించడం వల్ల జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం కంటే భారీ లోటు ఏర్పడిందని, దీనివల్ల పంటలకు నష్టం సంభవించే అవకాశం ఉన్నందున రైతులంతా తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు.

## స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు,టేబుల్స్ అందజేత



**ఏలేశ్వరం,ఆగష్టు,4:-(మనం న్యూస్):** స్థానిక స్వామి దయానంద సరస్వతి ఆశ్రమానికి సిరి ఫాస్ట్ ఫుడ్ కృష్ణ తోడల్లుడు కోరుప్రోలు సతీష్,కుమారి దంపతుల కుమార్తె రిషిత పుట్టినరోజు సందర్భంగా డొక్కా సీతమ్మ సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో నాలుగు సీలింగ్ ఫ్యాన్లు,రెండు భోజనం బల్లలను ఉచితంగా ఆశ్రమం వార్డెన్ నల్ల చంద్రశేఖర్ కు మంగళవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు గోవిందు, కే సాయి,పంపనబోయిన బుజ్జి,సాయి,ఆకుల సూరిబాబు, ఎస్ సుబ్రహ్మణ్యం,ఎస్ సాయి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయ రోడ్లు అస్తవ్యస్తం

- ఎం ఎల్ ఏ పితాని అభివృద్ధి చేయాలి
- వినియోగదారులు విజ్ఞప్తి

**ఆచంట ఆగస్టు 4 మనం న్యూస్:** నియోజకవర్గ కేంద్రమైన ఆచంట విద్యుత్ సబ్స్టేషన్ మరియు గృహ నిర్మాణ శాఖ ఏఈ ప్రభుత్వ కార్యాలయాలు రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి అని స్థానిక శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అభివృద్ధి చేయాలని కరెంట్ బిల్లు చెల్లించే వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు ఈ సందర్భంగా వినియోగదారులు మాట్లాడుతూ ఆచంట నియోజవర్గ ప్రాంతాలు అభివృద్ధి చెందాలి అంటే ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ వల్లే సాధ్యం అవుతుందని స్థానికులు రాజకీయ పరిశీలకులు అంటున్నారు ప్రభుత్వ కార్యాలయాల రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే పితాని దృష్టి సారించి అభివృద్ధి చేయాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు

## బాలిక ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్ల పంపిణీ



**ఏలేశ్వరం,ఆగస్టు 04(మనం న్యూస్ ):** స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రాజశ్రీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి నాయకులు బోదిరెడ్డి గోపాలకృష్ణ,ముదినారాయణస్వామి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనల మేరకు ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.అలాగే కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు చక్కగా రూపుదిద్దుకోవడం జరిగిందని,కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పసుపులేటి శ్రీను,వైస్ చైర్మన్ జామి గోవిందమ్మ, మాజీ కౌన్సిలర్లు పెంద్ర శ్రీను,ఎండుగుండీ నాగబాబు,కోణాల వెంకటరమణ, సిహెచ్సి చైర్మన్ వాగు రాజేష్ ,సిహెచ్సి వైస్ చైర్మన్ జొన్నాడ వీరబాబు, సామంతులు గోపి, బుగత శ్రీను, వాగు బద్రిస్,కోట్ల కృష్ణ తదితర టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## తల్లిపాలు అమృతంతో సమానం ఎంపీపీ

**ఏలేశ్వరం,ఆగస్టు,04(మనం న్యూస్):** ప్రతి చంటి బిడ్డకు తల్లిపాలుతోనే సంపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని అందువల్లే తల్లిపాలు అమృతంతో సమానం అని కాకినాడ జిల్లా ఎంపీపీ సమైక్య అధ్యక్షుడు ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) పిలుపునిచ్చారు.ప్రపంచ తల్లిపాలు వారం (ఆగస్టు 1 నుండి 7 వరకు) సందర్భంగా జె అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన కల్పించడమే కాకుండా కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గొల్లపల్లి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టాలని కోరారు. జె అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రకారం వైద్యులు బి జయరామ్ పీహెచ్సీ, ప్రభుత్వం ఉన్నత పాఠశాల,మండల పరిషత్ పాఠశాలలో టీనేజ్ ప్రెగ్నెన్సీలు, బాల్య వివాహాలు - వాటి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చైల్ సెక్స్ రేషియో (లింగ నిష్పత్తి) మరియు పీసీపీఎన్డీటీ చట్టంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,గ్రామ పెద్దలు, మండల విద్యాశాఖ అధికారి బి అబ్బాయి,జె.అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ఇరాన్‌ను టార్గెట్ చేసేందుకు కొత్త మార్గాలు వెతకండి

## అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

**వాషింగ్టన్, ఆగష్టు 4:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించడం కోసం అమెరికా పెట్టిన షరతులను ఇరాన్ అంగీకరించట్లేదు. ఈ నేపథ్యంలోనే టెహ్రాన్‌ను టార్గెట్ చేసేందుకు కొత్త మార్గాలు వెతకాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, దాని అణు కార్యక్రమాలను నిలిపివేసేలా చేయడం కోసం వినూత్న, సంప్రదాయేతర సూచనలు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. దీంతో ఇప్పటి వరకు టెహ్రాన్‌పై దాడులకు వాషింగ్టన్ అమలు చేసిన వ్యూహాన్ని సెంట్రల్ కమాండ్ అధికారులు పునఃపరిశీలిస్తున్నారట. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి.

ఇరాన్‌పై భారీ స్థాయిలో దాడులు చేపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే. అయితే, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ జోక్యంతో భీకర దాడుల నుంచి ట్రంప్ వెనక్కి తగ్గారు. కాగా.. అధ్యక్షుడి హెచ్చరికల కంటే ముందే అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌ను తిరిగి చర్చలకు తీసుకురావడమే లక్ష్యంగా అమెరికా కొన్ని వారాలుగా నిరంతర వైమానిక దాడులు చేస్తూనే ఉంది. అయినప్పటికీ ఒప్పందం కుదిరే సూచనలు కనిపించకపోవడంతో.. టెహ్రాన్‌ను శిక్షించడంపై అగ్రరాజ్యం ఇప్పుడు దృష్టి సారించినట్లు సమాచారం.

### ఇదే చివరి అవకాశం..

ఒప్పందంపై తుది నిర్ణయానికి రావడానికి ఇరాన్‌కు 'చివరి అవకాశం' ఇచ్చామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో చేపట్టిన దాడులకంటే తీవ్రంగా ఇరాన్‌పై విరుచుకుపడడానికి తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. కానీ యుద్ధం ముగింపునకు దౌత్య మార్గాలు అనుసరించాలని ఇరాన్‌తో సహా సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ చేసిన అభ్యర్థనల మేరకు సైనిక దాడిని నిలిపివేశామన్నారు. ప్రస్తుతం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని వారు వినియోగించుకోకపోతే ఇక టెహ్రాన్‌ను వదిలే సమస్యే లేదన్నారు. మరోవైపు మంగళవారం తెల్లవారుజామున కువైట్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్జీసీ డ్రోన్ దాడులు చేపట్టింది.

# ట్రంప్ కొత్త సుంకాలపై కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు



**వాషింగ్టన్, ఆగష్టు 4:** సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తోసహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారుచేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అమలు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలు ఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకుముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది.

ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో ఈ పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజ వాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యూఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు

# వాషింగ్టన్‌లో విస్తరిస్తున్న కార్చిచ్చు..

## అత్యవసర పరిస్థితి విధింపు



**వాషింగ్టన్, ఆగష్టు 4:** అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించి వేస్తుండగా, సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60వేలమందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు.

మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు.

### వాషింగ్టన్‌లో అత్యవసర పరిస్థితి..

తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండడంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

### డ్రోన్లపై నిషేధం..

మంటలు చెలరేగుతున్న ప్రాంతాల్లో డ్రోన్లు ఎగరవేయడంపై నిషేధం విధిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అటువంటి చర్యలను చట్టవిరుద్ధంగా పరిగణిస్తామన్నారు. సహాయక చర్యలు కొనసాగిస్తున్న అగ్నిమాపక విమానాలు, హెలికాప్టర్లకు అవి ఆటంకం కలిగిస్తున్నాయన్నారు. డ్రోన్ల వల్ల ఆదివారం 26 సార్లు అగ్నిమాపక కార్యకలాపాలకు అంతరాయం కలిగిందని తెలిపారు.

# లగ్జరీ లైఫ్‌స్టైల్ .. కేజీలకొద్దీ బంగారం

## మరోసారి వార్తల్లో సతీశ్ సన్పాల్



**అబుధాబి, ఆగష్టు 4:** లగ్జరీ లైఫ్‌స్టైల్ .. కేజీల కొద్దీ బంగారం.. దేశీ బ్లింగ్ షోతో ఆ మధ్య నెట్టింట వైరల్ అయ్యారు సతీశ్ సన్‌పాల్. దుబాయ్‌లో విలాసవంతంగా జీవిస్తున్న ఈ భారత సంతతి వ్యాపారవేత్త.. తాజాగా వార్తల్లో నిలిచారు. మనీలాండరింగ్ ఆరోపణల దర్యాప్తులో భాగంగా అతడి ఆస్తులను ఫ్రీజ్ చేయాలని యూఏఈ ప్రభుత్వం ఆదేశించింది. సతీశ్ ఆర్థిక ఖాతాలు, డిజిటల్ వాలెట్లను తాత్కాలికంగా నిలిపివేయాలని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ సంబంధిత సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. అతడి భార్య తబిందాకు చెందిన ఖాతాలపైనా గురిపెట్టింది. ఈ పరిణామాల నేపథ్యంలో సతీశ్ సన్‌పాల్ ఎవరని నెటిజన్లు ఆరా తీస్తున్నారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన సతీశ్ సన్‌పాల్ 8వ తరగతి వరకే చదివారు. చదువుపై ఆసక్తి లేకపోవడంతో తల్లిదగ్గర రూ.50వేలు అప్పు తీసుకొని కిరాణా కొట్టుపెట్టారు. కానీ, వ్యాపారం సరిగా సాగలేదు. ఆ క్రమంలోనే స్నేహితుడి పెళ్లి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడి పరిస్థితులు అతడిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అక్కడే వ్యాపారం మొదలు పెట్టాలని నిర్ణయించుకున్నాడు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌తో మొదలైన అతడి ప్రయాణం.. రియల్‌ఎస్టేట్, టెక్నాలజీ, మీడియా రంగంలోకి విస్తరించింది. 2018లో ఎనాక్స్ హోల్డింగ్స్‌ను స్థాపించాడు. ఆస్తుల విలువ రూ.8వేల కోట్లకుపైనే ఉంటుందని అంచనా.

సతీశ్ దగ్గర సుమారు రూ.35 కోట్ల విలువైన ఒక బుగాటి, రోల్స్‌రాయిస్ కార్లు ఉన్నాయి. ఒక యాచ్ కూడా ఉంది. తన కుమార్తె ఇసాబెల్లా కోసం గులాబీ రంగు రోల్స్ రాయిస్‌ను గిఫ్ట్గా ఇచ్చారట. ప్రస్తుతం ఈ దంపతులు బుర్జ్ ఖలీఫాలోని ఒక విలాసవంతమైన పెంట్ హౌస్‌లో నివసిస్తున్నారు. త్వరలోనే దుబాయ్ హిల్స్‌లో 60 డోర్లున్న ఇంటికి మారబోతున్నారంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇక రెండు నెలల క్రితం వచ్చిన 'దేశీ బ్లింగ్' షోలో సతీశ్ సన్‌పాల్ తన భార్య తబిందాతో కలిసి సందడి చేశారు. అప్పుడు వారి లైఫ్‌స్టైల్ నెజిటన్లను ఆశ్చర్యపర్చింది. ఇక తబిందా పలు షాకింగ్ విషయాలు వెల్లడించింది. తమ వద్ద ఇప్పటికే 40 కేజీల బంగారం ఉందని వెల్లడించారు. అంతేకాదు ప్రతి సంవత్సరం ధన్‌తేరాస్ పండగకు తనకు 3 కిలోల బంగారాన్ని సతీశ్ కానుకగా ఇస్తారని తబిందా పేర్కొన్నారు. ఈ వీడియోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సతీశ్‌పై మధ్యప్రదేశ్‌లో 8-9 కేసులున్నాయని, లుకౌట్ నోటీస్ జారీ అయిందని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇదిలా ఉంటే.. యూఏఈ చట్టాల ప్రకారం.. ఎఫ్ఐయూ గడువును పొడిగించకపోతే.. 30 రోజుల్లో ఆ ఫ్రీజ్‌ను ఎత్తివేయాల్సి ఉంటుంది.

# ఇజ్రాయెల్ గొప్ప స్నేహితుల్లో మోడీ ఒకరు

## ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు



**జరూసలెం, ఆగష్టు 4:** భారత ప్రధాని నరేంద్ర మోడీపై ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసలు కురిపించారు. తమ దేశానికి ఉన్న గొప్ప స్నేహితుల్లో మోడీ ఒకరని పేర్కొన్నారు. భారత్‌ను తమ ముఖ్యమైన భాగస్వామిగా అభివర్ణించారు. ఇజ్రాయెల్ ఏకాకి అని చాలామంది విమర్శిస్తున్నారని.. కానీ తమకు భారత్ నుంచి మద్దతు ఉందన్నారు. ఆ దేశంతో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇజ్రాయెల్ భాగస్వామ్య దేశాల గురించి మాట్లాడుతూ నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవలి కాలంలో ఇరుదేశాల మధ్య సంబంధాలు బలోపేతమయ్యాయి. రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, విస్తృత వ్యూహాత్మక సహకారం, ఇతర రంగాలలో రెండు దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందించుకుంటున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు పలు కీలక ఒప్పందాలు చేసుకున్నారు. వాటిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కీలక ఖనిజాలు, రక్షణ, వాణిజ్యం, కార్మిక, ఆరోగ్య సంరక్షణ రంగాలలో సహకారం వంటివి ఉన్నాయి.

# విద్యారంగంపై ప్రభుత్వ హామీలు శూన్యం

- ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలే
- తక్షణమే మా సమస్యలను పరిష్కరించండి?
- ఈ నెల 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు,వినతులు
- ప్రభుత్వానికి యూఎస్‌పీసీ హెచ్చరిక

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నిర్ణయించింది. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యూఎస్‌పీసీ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యా శాఖ అధికారుల వైఖరి వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు క్రమంగా మూతపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా రంగానికి 15% నిధుల కేటాయింపు హామీని విస్మరించారని, నాణ్యమైన విద్య పేరుతో పాఠశాలల కుదింపునకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభిస్తున్నా మని ఘనంగా ప్రకటించినప్పటికీ కేవలం యూకేజీకే పరిమితం చేశారని, ప్రీ ప్రైమరీ తరగతులను మధ్యాహ్నం 12 గంటల వరకే నడపాలి. కానీ ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం 4 వరకు ప్రీప్రైమరీ తరగతులు నడుస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలకు పంపితే మధ్యాహ్నం 12 తర్వాత తమ పిల్లలను ఎవరు చూసుకుంటారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని వారు వాపోయారు. ప్రాథమిక విద్యకు అవరోధంగా ఉన్న జీవో 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు టీచర్లు, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో తరగతికి ఒక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. నూతన జిల్లాలకు డీఈవో, రెవెన్యూ డివిజన్‌కు ఒక డిప్యూటీ ఈఓ, అన్ని మండలాలకు ఎంఈవో పోస్టులు మంజూరు చేయాలని, పీఓ 2018కి అనుగుణంగా సర్వీసు నిబంధనలు రూపొందించి పర్యవేక్షణ అధికారుల పోస్టులు భర్తీ చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, టెట్‌లో సర్వీసు వెయిటేజీ ఇవ్వాలని, స్పెషల్ టెట్ ను సబ్జెక్టు వారీ పేపర్లతో నిర్వహించాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ వర్తింపజేయాలని, విద్యా శాఖలో బీసీ, గిరిజన గురుకులాల టైంటేబుల్ మార్చాలని, మోడల్, ఎయిడెడ్ స్కూళ్లను విద్యాశాఖలో విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చావ రవి, ఏ వెంకట్(టీఎస్ యూటీఎఫ్), సీహెచ్ అనీల్ కుమార్, ఎన్ తిరుపతి(టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టీ లింగారెడ్డి(డీటీఎఫ్), కొమ్ము రమేష్ (బీటీఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ, ఎస్టీ టీఎఫ్), ఎస్ హరికిషన్ (టీటీఏ), బీ కొండయ్య (ఎంఎస్‌టీఎఫ్), వై. విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ,ఎస్టీయూఎస్) పాల్గొన్నారు.

# ఎగురుతున్న విమానంలో భారీ కుదుపులు.. పలువురికి గాయాలు

**ఢిల్లీ, ఆగష్టు 4 :** ఎయిరిండియాకు చెందిన ఓ విమానానికి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. గాల్లో ఉండగా ఈ విమానం తీవ్ర కుదుపులకు లోనైంది. దీంతో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి.. విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రమాదం తప్పింది. ఎయిర్లైన్స్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఎయిరిండియా విమానం పుకెట్ నుంచి ఢిల్లీకి బయల్దేరింది. కొద్ది సేపట్లో గమ్య స్థానానికి చేరుతుందనగా.. భారీ గాలులకు అకస్మాత్తుగా సుమారు 300 అడుగుల కిందకు పడిపోయింది. దీంతో కుదుపులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 10 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది గాయాలపాలయ్యారు. ఢిల్లీలో విమానం దిగగానే.. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న వైద్య బృందాలు బాధితులను ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించాయి. గాయపడిన వారికి తగిన చికిత్స అందిస్తున్నామని.. ప్రయాణికుందరూ సురక్షితంగా ఉన్నారని ఎయిరిండియా వెల్లడించింది. ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చేపట్టిన దర్యాప్తునకు సహకరిస్తున్నామని తెలిపింది.

# త్రిషపై వ్యాఖ్యల వివాదం.. ఉదయనిధి అరెస్టు



**చెన్నై, ఆగష్టు 4 :** నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యల వ్యవహారంలో డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ ను పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేసిన మద్రాస్ హైకోర్టు.. విచారణ పూర్తయిన వెంటనే నేడే ఆయనను విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో మంగళవారం సాయంత్రం ఉదయనిధిని పోలీసులు విడుదల చేశారు. త్రిషపై అసభ్య వ్యాఖ్యల కేసులో డీఎంకే నేతను ఇవాళ ఉదయం చెన్నైలోని ఆయన నివాసంలో పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

కావేరీ జల వివాదంపై సోమవారం ఉదయనిధి మాట్లాడుతూ.. టీవీకే ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఆయన ప్రసంగిస్తోన్న సమయంలో పలువురు కార్యకర్తలు త్రిష, త్రిష అంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన నటి గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా అనుచితంగా మాట్లాడారు. అనంతరం తాను చెప్పింది కావేరీ గురించేనని వివరణ ఇచ్చారు. ఇది కాస్తా రాజకీయ దుమారానికి దారితీసింది. మహిళలను కించపర్చేలా ఉదయనిధి మాట్లాడారని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయి. మరోవైపు.. డీఎంకే నేత వ్యాఖ్యలపై టీవీకే పార్టీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఉదయనిధిపై కేసు నమోదైంది. ఈ క్రమంలోనే ఆయన బెయిల్ కోసం హైకోర్టులో దరఖాస్తు చేసుకోగా.. న్యాయస్థానం అత్యవసరంగా విచారణ జరిపి ఉదయనిధి విడుదలకు ఆదేశాలిచ్చింది.

# మహిళలేం పావులు కాదు

## ఉదయనిధి వ్యాఖ్యలపై సెలబ్రిటీల ఆగ్రహం





సినిమా ఆర్టిస్టు చిన్మయి మాట్లాడుతూ..

**చెన్నై, ఆగష్టు 4:** నటి త్రిషపై డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తప్పుపడుతూ సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ ప్రసంగం చాలా అసభ్యంగా, అవమానకరంగా ఉంది. మహిళలను దూషించడం, కించపరచడం, అవమానించడం వాళ్లకి సాధారణ విషయంగా అనిపిస్తోంది. ఇలాంటి వాళ్ల నుంచి ఏం ఆశించాలి?. వీళ్లు ఒక విషయాన్ని బాగా గుర్తుపెట్టుకోవాలి.. రాజకీయ ప్రయోజనాల కోసం మహిళల గౌరవాన్ని బలిపశువుగా చేసిన ఏ కుటుంబం కూడా వృద్ధిలోకి రాలేదు. రాజకీయాల్లో నేతల వ్యాఖ్యలకు హద్దులు ఉండాలి. మహిళలను గౌరవించాలి. అంతేగానీ మీ ఇష్టాయిష్టాలకు ఆడుకునే పావులుగా చూడకూడదు. అంటూ సీనియర్ నటి ఖుష్బూ తీవ్రంగా విమర్శించారు. మీ రాజకీయ ప్రత్యర్థి పనితీరు, దార్శనికత, నాయకత్వానికి మీరు సరితూగరని తెలిసినప్పుడు మాత్రమే.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం సులభంగా అనిపిస్తుంది. బహిరంగ వేదికపై త్రిషను అవమానించినందుకు గానూ ప్రతిపక్ష నేత ఆమెకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. తన తప్పును ఉదయనిధి హుందాగా అంగీకరిస్తాడో లేదో.. క్షమాపణ చెప్పే ధైర్యం, సంస్కారం ఆయనకు ఉన్నాయో లేదో చూద్దాం' అన్నారామె.

'రాజకీయ రంగంలో ఉన్న వాళ్లు ఏమాత్రం సంబంధం లేని విషయాల్లో మహిళలను కించపరచడం మానేసి.. అసలు సమస్యలపై దృష్టి పెడితే బాగుంటుంది. ఉదయనిధి మద్దతుదారులు నటి పేరును ప్రస్తావించినప్పుడు కనీసం వాళ్లను ఆపలేదు సరికదా.. వాళ్లతో కలసి ఆయన కూడా అసభ్యంగా మాట్లాడారు. ఇది దారుణం'అని అన్నారు.

# డమ్మీ సీఎం.. జోకర్ క్యాబినెట్

## విజయ్ ప్రభుత్వంపై మాజీ సీఎం స్టాలిన్ కామెంట్స్



**చెన్నై, ఆగష్టు 4 :** తన తనయుడు, డీఎంకే నేత ఉదయనిధి అరెస్టయి.. బెయిల్ పై విడుదల.. తదితర పరిణామాలపై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. సీఎం విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అహంకారం వినాశనానికి దారితీస్తుందని, అది నిరంతరం కొనసాగితే.. మరింత వేగంగా పతనమవుతారని దుయ్యబట్టారు. విజయ్.. ఓ అసమర్థ నాయకుడని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ సీఎం తన ఎక్స్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.'కావేరీ నదీ జలాలు, మేకెదాటు ప్రాజెక్ట్ వ్యవహారంలో తమిళనాడు హక్కులను అణచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. దాన్ని ఖండించేందుకు తంజావూరులో డీఎంకే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. అందులో ఉదయనిధి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ విమర్శలకు బదులుచెప్పే ధైర్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని లేదు. అందుకే వాటిపై దృష్టి మరల్చేందుకు ఉదయనిధిని అరెస్ట్ చేసింది. మన సీఎం విజయ్ కావేరీ నీటిని తీసుకురాలేరు. ఆయనో డమ్మీ సీఎం. ఇక, ఆయన మంత్రులు ఒక సినిమా (జననాయగన్ను ఉద్దేశిస్తూ)ను పట్టుకుని వేలాడుతున్నారు. రాష్ట్రంలో ఓ జోకర్ క్యాబినెట్ అధికారంలో ఉంది'' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. శాసనసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న ఉదయనిధి పట్ల పోలీసులు దారుణంగా వ్యవహరించారు. ఇంటికొచ్చి అరెస్టు చేసి.. తంజావూరుకు తీసుకెళ్లారు. కోర్టు విచారణ సందర్భంగా ఉదయనిధిని కస్టడీలోకి తీసుకొనే ఉద్దేశం లేదని ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. మరి అలాంటప్పుడు ఆయనను తంజావూరుకు ఎందుకు తరలించారు? ఎందుకు అన్ని కేసులు పెట్టారు. కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు'' అని మాజీ సీఎం ఎద్దేవా చేశారు.

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి.. తనను విమర్శిస్తున్న వారందరినీ విజయ్ అరెస్టు చేయిస్తున్నారని స్టాలిన్ దుయ్యబట్టారు. చెన్నైలోని మెరీనా బీచ్ వద్దకు ఆందోళనకారులను రానివ్వడం లేదని, నీట్ వ్యతిరేక ర్యాలీని కూడా అనుమతించట్లేదని ఆరోపించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముందు ఉదయనిధి అరెస్టు కుట్రపూరిత చర్యేనని స్టాలిన్ మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలకు తమ నేతను దూరంగా ఉంచాలనే ఉద్దేశంతోనే ఉదయనిధిపై తప్పుడు కేసులు పెట్టించారని విమర్శించారు. తన కుమారుడు ఎవరిపైనా అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదని, ఒకవేళ అలా చేసినట్లు నిరూపిస్తే తక్షణమే క్షమాపణలు చెబుతాడని స్టాలిన్ తన పోస్టులో రాసుకొచ్చారు. సీఎం విజయ్ ఇకనైనా రీల్స్ క్రియేట్ చేయడం మాని.. తన బాధ్యతలను గుర్తించి దానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- **జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**




**నల్లగొండ, ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం నల్గొండ లోని ఎన్ జి ప్రభుత్వ కళాశాలలో సంక్షేమ, పోలీస్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, కళాశాల ఎన్ ఎస్ ఎస్, ఎన్ సి సి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ' 10 కోట్ల మాదక ద్రవ్య రహిత ప్రతిజ్ఞ 'మెగా ప్రచార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రస్తుతం యువత సామాజిక మాధ్యమాలు, డిజిటల్ , డ్రగ్స్ ,మద్యం,సిగరెట్ వంటి వ్యసనాలకు బానిసలు కావడం వల్ల వీటి వినియోగం పెరిగిందని కలెక్టర్ అన్నారు.ఒకప్పుడు డబ్బున్న వారికి మాత్రమే అందుబాటులో ఉండే డ్రగ్స్ ఇప్పుడు అందరికి అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. దీనికి వ్యవస్థతో పాటు, ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సి ఉందన్నారు.యువతరం అనేక కారణాల వల్ల మాదక ద్రవ్యాల భారిన పడుతున్నారని, దాని వల్ల వారి కెరీర్ నాశనం అవుతుందని తెలుసుకోవాలన్నారు.డ్రగ్స్ తీసుకోకుండా నిగ్రహం పాటించాలని, ఒక్కసారి డ్రగ్స్ కు అలవాటు పడితే వ్యక్తిగతంగా, కుటుంబం, సమాజం ప్రభావితమవుతాయని అన్నారు. ఒక దశలో ఏకాకితనం ఆవహిస్తునదని అన్నారు. ఒక వేళ ఎవరైనా మాదక ద్రవ్యాల భారిన పడితే ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ చుట్టు పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా, డ్రగ్స్ తీసుకొమ్మని బలవంతపెట్టినా, అమ్మినా 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని సూచించారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలో 97 డ్రగ్స్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2047 స్వాతంత్ర్య భారత శతాబ్ది ఉత్సవాల నాటికి మన దేశం ప్రపంచంలోనే మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలంటే ముందు డ్రగ్స్ తీసుకోవడం లాంటి అలవాట్లను యువత పక్కకు పెట్టాలని అన్నారు.ఇప్పటి జెన్ జి తరం డ్రగ్స్ ఫ్రీ తరంగా ఉండాలని ఆకాంక్షించారు.గత మే లో జరిగిన ' ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగా వల్ల కలిగే నష్టాల పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని గుర్తు చేశారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఇలాంటి సామాజిక కార్యక్రమాన్ని చేపట్టి దాన్ని ముందుకు తీసుకుపోవడం అభినందనీయమని ,అలాగే ఎన్ జికళాశాల ఎన్ ఎస్ ఎస్ ,ఎన్ సి సి విభాగాలను ఆయన అభినందించారు.అనంతరం మాదక ద్రవ్యాల నిరోధక పోస్టర్ ను ఆవిష్కరించారు.అదనపు పోలీస్ సూపరింటీండెంట్ రమేష్ విద్యార్థులచే 'మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ' చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సముద్రాల ఉపేందర్, బ్రహ్మకుమారి రాజయోగి ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డిఎంహెచ్ ఓ నగేష్, జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ ఆర్. మదన్ మోహన్, శ్రీధర్, ప్రజాపిత బ్రహ్మకుమారీస్ కుమారి మోనిక, ఎన్ సి సి ఆఫీసర్ లెఫ్టినెంట్ సిహెచ్ సుధాకర్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్లు, వెంకట్ రెడ్డి, అనిల్ కుమార్,తదితరులు ఉన్నారు.

# గాంధీభవన్‌లో స్వర్ణ బోనాలు



**హైదరాబాద్ ఆగస్టు 4 (మనంన్యూస్ ):** గాంధీభవన్ లో తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బోనాల పండుగ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు పార్వతమ్మ మరియు మాజీ జెడ్పిటిసి సంఘం మండల్ గుగులోత్ వీరమ్మ, మమత మొదలైన వారు పాల్గొని బోనాల పండుగను విజయవంతం చేశారు.

# సిబ్బంది కుటుంబాలకు బాసట భద్రత స్కీమ్



**సూర్యాపేట, ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** సిబ్బంది కుటుంబాలకు పోలీస్ భద్రత స్కీం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ కే నరసింహ అన్నారు. మంగళవారం పెనపహాడ్ పోలీస్ స్టేషన్ నందు హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న యాదగిరి ఇటీవల ఆకాలంగా మృతి చెందినారు. మృతి చెందిన యాదగిరి కుటుంబానికి పోలీసు భద్రత స్కీం యొక్క నగదు చెక్కు ను జిల్లా యస్.పి నరసింహ జిల్లా పోలీస్ కార్యాలయం నందు అతని కుటుంబ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... పోలీసు శాఖలో పని చేస్తూ ఆకాలంగా ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా అదుకుంటుందని, దివంగత సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుంది అన్నారు. యాదగిరి కుటుంభం యొక్క సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డీఎస్పీ రవి, జిల్లా పోలీసు కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, పోలీసు సంఘం అధ్యక్షులు ఖిఐ రామచందర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైనవి

**పర్వతగిరి, ఆగస్టు 4 (మనం న్యూస్):** తల్లిపాలే పుట్టిన పిల్లలకు శ్రేష్టమైనవని పుట్టినప్పటి నుంచి శిశువుకు తల్లిపాలను ఇవ్వడం ద్వారా పిల్లలు ఎదుగుదలలో ఎంతో ఉపయోగ ఉంటుందని మోత్యా తండా సర్పంచ్ భూక్యా నరేష్ తెలిపారు. మంగళవారం అం గన్వాడీ కేంద్రాలలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భం గా హాజరైన తల్లులకు పలు సూచనలు చేశారు.

వర్షాలు పడుతున్న నేపథ్యంలో పిల్లల రక్షణపై జాగ్రత్తలు పాటించాలని వర్షంలో బయటికి వెళ్లకుండా ముఖ్యంగా తడవకుండా జాగ్రత్త పడాలని అంగన్వాడీ కార్యకర్తల సూచనలను సహాయాన్ని పొందాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవి, సిత్యాతండా, మొత్యతండా అంగన్వాడీ కేంద్రాల టీచర్లు స్వాతి, సునీత పాల్గొన్నారు.

# రైస్ మిల్లులను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఆకస్మిక తనిఖీ



**సూర్యాపేట, ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలోని శ్రీ శ్రీనివాస సాయి శివాయ రైస్ ఇండస్ట్రీస్లో మంగళవారం ఉదయం రీజినల్ ఎన్ఫోర్స్మెంట్ టీం, నల్గొండ అధికారులు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా రబీ 2022-23, రబీ 2023-24, ఖరీఫ్ 2024-25 మరియు రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వలను పరిశీలించగా, ఆన్లైన్ రికార్డులు, స్టాక్ వివరాలు మరియు మిల్లులో భౌతికంగా ఉన్న నిల్వల మధ్య గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రాథమిక పరిశీలనలో ఆక్షన్ ధాన్యాన్ని మినహాయించి సుమారు 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం అందుబాటులో లేకపోవడం గుర్తించినట్లు అధికారులు స్పష్టం చేశారు. అదేవిధంగా, రబీ 2022-23 సీజన్కు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించవలసిన సుమారు రూ.5.66 కోట్ల బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉన్నట్లు కూడా గుర్తించారు. అలాగే రబీ 2023-24, ఖరీఫ్ 2024-25 .రబీ 2024-25 సీజన్లకు సంబంధించిన సుమారు 19,843.429 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ధాన్యం విలువ సుమారు రూ.48 కోట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. ఈ విధంగా పరిశీలించినప్పుడు ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం విలువ బకాయిలను కలిపి సుమారు రూ.53.66 కోట్ల మేర నష్టం సంభవించినట్లు అధికారుల బృందం ప్రాథమికంగా నిర్ధారించింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం తుది నివేదికను సంబంధిత ప్రభుత్వానికి సమర్పించి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ తనిఖీలలో రీజినల్ విజిలెన్స్ అధికారి శ్రీ ప్రతాప్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ గౌస్, జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి మాట్లాడుతూ... ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా మాయం చేయడం, దుర్వినియోగం చేయడం లేదా ప్రభుత్వ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలను ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని తెలిపారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడిన వారిపై సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు మరియు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# యువత మహిళల ఐడియాలకు వుయ్ హబ్

- **గ్రామీణ విద్యార్థులే లక్ష్యంగా కొత్త ప్రోగ్రామ్స్**
- **జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ఆగస్టు 04 (మనం ప్రతినిధి):** జిల్లాలోని యువత, మహిళల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారి వ్యాపార ఆలోచనలకు గ్లోబల్ వేదికను కల్పించేందుకు వి హబ్.నడుం బిగించిందని, ముఖ్యంగా గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లోని విద్యార్థులు, టైర్-2, టైర్-3 నగరాల్లోని మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సరికొత్త జాతీయ స్థాయి ప్రోగ్రామ్స్ను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. గ్రాస్రూట్స్ యూత్ ఇన్నోవేషన్ ప్రోగ్రామ్, 'సోషల్ ఇంపాక్ట్ ఆంత్రప్రెన్యూర్షిప్ పేర్లతో ఈ శిక్షణ కార్యక్రమాలను అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శిక్షణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ...యువతను కేవలం ఉద్యోగార్థులుగానే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశమన్నారు. 17 నుంచి 23 ఏళ్ల వయస్సు ఉన్న అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో హ్యాకథాన్లు, ఐడియాషన్ సెషన్స్ నిర్వహిస్తారని , 12 వారాల పాటు ఇంటర్న్షిప్, పేటెంటింగ్ సపోర్ట్, సాఫ్ట్ స్కిల్స్పై ట్రైనింగ్ ఇస్తారని తెలియజేశారు. ఆలోచన దశ నుంచి ప్రొటోటైప్ తయారీ వరకు మార్గదర్శకత్వం చేస్తారని అన్నారు.మహిళలకు అండగా నిలిచేందుకు ఎస్ఐఈ శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారని, టైర్-2, టైర్-3 ప్రాంతాల్లోని మహిళలు, వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులు మరియు ట్రాన్స్జెండర్ల కోసం సోషల్ ఇంపాక్ట్ అండ్ ఆంత్రప్రెన్యూర్షిప్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. ఎఫ్ఎంసీజీ, ఫుడ్ ప్రాసెసింగ్, చేనేత వంటి రంగాల్లో బిజినెస్ చేసే వారికి ఇందులో ప్రాధాన్యత ఉంటుందని, 3 నెలల పాటు డిజిటల్ నెట్వర్కింగ్, బిజినెస్ బేసిక్స్పై శిక్షణ అందిస్తారని , 6 నెలల పాటు ఫండింగ్, లీగల్ సపోర్ట్, డిజిటల్ మార్కెటింగ్లో సహాయం అందించనున్నట్లు తెలిపారు. మహిళా ప్రామాణికతా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. స్థానిక మహిళా వ్యాపారులు ఈ కేంద్రాల ద్వారా సేవలు పొందవచ్చని, ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం డిడిడి.ఢ్జిఢ్భజ్భ్జుజ్బ్బ్బ.జౌరి.జీ వెబ్సైట్ను సందర్శించాలని కోరారు. అనంతరం వి హబ్ పోస్టర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డి ఇ ఓ అశోక్, మెప్మా పీడీ శ్రీనివాస్, డి డబ్ల్యు ఓ నరసింహారావు, వి హబ్ సి ఇ ఓ సీతా పళ్ళచుని, అసోసియేట్ డైరెక్టర్ జహీర్ అక్తర్ షేక్, ఊహ సజ్జ, టీం సభ్యులు పాల్గొన్నారు.

# అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులను వాడొద్దు

**పర్వతగిరి, ఆగస్టు 4 (మనం న్యూస్):** అత్యంత ప్రమాదకరమైన పురుగుమందులను వాడొద్దని మంగళవారం అవగాహన ర్యా నిర్వహించారు. అన్నారం పెద్ద తండా గ్రామంలో ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో అత్యంత విషపూరితమైన పురుగుమందులు వాడకూడదని రైతులకు అవగాహనతో పాటు ర్యాలీ నిర్వహించడం చేపట్టారు. ఈ సందర్భంగా పీయూ మేనేజర్ గటిక మృదుల మాట్లాడుతూ ముఖ్యంగా మనుషుల, నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ ముఖ్యమని తెలిపారు. అత్యంత విషపూరితమైన పురుగు మందులను నిషేధించాలని, వాటి వల్ల కలిగే ప్రమాదాల గురుంచి వివరిస్తూ మనుషులకు క్యాన్సర్కారక, జన్యు పరివర్తన కారక, పునరుత్పత్తికి హానికరమని వివరించారు. పురుగు మందుల వాడకం వల్ల జీవవైవిధ్యం దెబ్బతినడంతో పాటు పరాగసంపర్కంలో తోడ్పడే జీవులు తేనెటీగలు, సీతాకోకచిలుకలు, నీటి ఆవరణ వ్యవస్థలో జీవులకు ప్రమాదకరం కలిగిస్తాన్నారు. వాటి నష్టాన్ని తగ్గించే అనువైన చర్యలు చేపడుతూ ప్రత్యామ్నాయ పురుగు మందులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల్ సంస్థ ప్రతినిధి, సీనియర్ సామాజిక కార్యకర్త గడ్డం యాకయ్య, ప్రజ్వల్ సం పై ప్రతినిధులు స్కైలాబ్ బాబు, భద్రు నాయక్, సతీష్, మౌనిక, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్య ప్రవేశాల షెడ్యూల్ విడుదల

**హనుమకొండ, ఆగస్టు 4 ( మనం ప్రతినిధి ):** ఎంబిబిఎస్, బి డి ఎస్ కోర్సుల్లో ప్రవేశాల కోసం షెడ్యూల్ ను కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. నీట్ ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగను న్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర జాబితాను కట్ ఆఫ్ వివరాలను ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడించింది. ఈనెల 5వ తేదీ ఉదయం 6 గంటల నుండి 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను ఆన్లైన్లో అప్లికేషన్ చేయాలని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్ స్కాన్డ్ కాపీలను దరఖాస్తు పాటే సమర్పించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేవలం ఒకసారి మాత్రమే ఉంటుందని, ప్రతి రౌండ్ కు విడివిడిగా సర్టిఫికెట్లు అప్లోడ్ చేయాల్సిన అవసరంలేదని స్పష్టం చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రాష్ట్రస్థాయి మెరిట్ జాబితా విడుదలవుతుందని, ఆ తర్వాతే వెబ్ ఆప్షన్ల నమోదు సీట్ల వివరాలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక కేటగిరీకి చెందిన కట్ ఆఫ్ మార్కుల జాబితా వివరాలు ఆన్లైన్లో పొందుపరిచినట్లు స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులందరూ విద్యాలయ వెబ్ సైట్ ను సందర్శించాలని కోరారు.

# కూరపాటి వెంకటనారాయణకు సన్మానం

**హనుమకొండ, ఆగస్టు 4(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర తెలుగు అకాడమీ డైరెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన ఆచార్య భట్టు రమేష్ చైర్మన్ ఆచార్య కూరపాటి వెంకటనారాయణ గారిని ఆత్మీయ అభినందన సభ లో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో వి న్ నాయక్, గిరిజన సంఘం సెక్రెటరీ వి వీరన్న నాయక్,అజ్మీరా వెంకట్ నాయక్ లావుడియా రాజు నాయక్ పాల్గొని శాలువాతో సన్మానించడం జరిగింది

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ సిలువేరు శ్రీనివాస్

**హనుమకొండ, ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** దళిత క్రైస్తవుల మత హక్కు స్వేచ్ఛను కాపాడాలని ఎస్సీ హోదా కల్పించాలని వరం గల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ నిలువేరు శ్రీనివాస్ అన్నారు. వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్లో దళిత క్రైస్తవ శాం తియుత మహా దీక్షలు మంగళ వారానికి రెండో రోజు చేరుకున్నాయి. రెండో రోజు దీక్షలను కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశంలో దళిత క్రైస్తవ ఎస్సి హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల హక్కులను కాలరాయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. దళిత క్రైస్తవ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాట్లాడుతూ దళిత కేసులకు ఎస్సీ హోదా దక్కేంతవరకు శాంతియుతంగా పోరాటం చేస్తామన్నారు. ఈ నెల 10న హనుమకొండ అంబేద్కర్ విగ్రహం నుంచి వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు దళిత క్రైస్తవుల శాంతియ ఒత నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో నగరంలోని చర్చి పాస్టర్లు చర్చి లీడర్లు కుటుంబాలతో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయనున్నారు ఈ కార్యక్రమంలో దుపాకి సంతోష్, దొమ్మాటి ప్రవీణ్, సింగారం ప్రేమ్. దాసారపు సారన్న సుమన్, ఇమ్మడి బాబు, ఆనంద్. ఈసంపల్లి అబ్రహం, సందేల లాజర్, ఎంకే బాబు, జన్ను ప్రశాంత్, సిలువేరు నగేష్, నాగరపు స్వామి, దయాకర్, జూపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాదేవపూర్ లో ఉచిత మెగా వైద్య శిబిరం

- **క్యాన్సర్ నిర్ధారణ శిబిరం, కంటి పరీక్షలు**
- **అద్దాల పంపిణీలో పాల్గొన్న టి పి సి సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు**



**మహాదేవపూర్ ఆగస్టు 4 మనం న్యూస్:** మండల కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రం లో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు సహోదరి, మంథని మాజీ సర్పంచ్ స్వర్గీయ సువర్ణ చంటయ్య సతీమణి సువర్ణ వనమాల(తాయి) స్మారకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం నాడు నిర్వహించారు.ఈ శిబిరంలో హైదరాబాద్కు చెందిన ఎం ఎన్ యూ క్యాన్సర్ ఆసుపత్రి,, ఓమెగా హాస్పిటల్, కరీంనగర్కు చెందిన సుశ్రిత హాస్పిటల్ వైద్యులు, అలాగే పుష్పగిరి హాస్పిటల్ సౌజన్యంతో వివిధ వైద్య సేవలు అందించారు. ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, వైద్య పరీక్షలు నిర్వహించగా, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. కంటి పరీక్షల్లో అర్హులైన వారికి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను వారి వద్దకే తీసుకురావాలనే లక్ష్యంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే మంథని నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 45 వేల మందికి కంటి పరీక్షలు, చికిత్సలు అందించినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో ఆరోగ్య సేవలు అందించే లక్ష్యంతో ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతానికి సహకరించిన వైద్య బృందాలకు, కార్యకర్తలకి , ప్రజాప్రతినిధులందరికి శ్రీను బాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ కోటరాజ బాబు, సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు విలాసరావు, చీమల సందీప్ పాల్గొన్నారు

# వైద్య ఆరోగ్య శాఖపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 4(మనం న్యూస్ ):** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రులలో చేపడుతున్న వైద్య ఆరోగ్య మౌలిక వసతుల అభివృద్ధి పనులపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్ సెక్రెటేరియట్ లోని వారి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, ఎంజీఎం హాస్పిటల్, స్టేషన్ ఘనపూర్ 100పడకల ఆసుపత్రి భవన నిర్మాణం మరియు ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల మౌలిక వసతుల అభివృద్ధి, వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం వంటి తదితర అంశాల పై ఈ సమీక్ష సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్మిస్తున్న 100పడకల ఆసుపత్రి భవన నిర్మాణాన్ని 31డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసి నూతన సంవత్సరంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 100పడకల ఆసుపత్రి భవనం ప్రారంభం నాటికే ఆసుపత్రి నిర్వహణకు అవసరమైన వైద్య సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది, వైద్య పరికరాలతో పాటు ఇతర సదుపాయాలు సమాకూర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల, చిల్పూర్ మండల కేంద్రం, రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయాలని కోరారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డయాలసిస్ సేవలను వెంటనే అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో , వైద్యరోగ్య శాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తూ, పలువురు వైద్యరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో ఘనంగా టీడీఎఫ్ కార్యక్రమం

- **వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రవాస ప్రముఖులతో కలిసి పాల్గొన్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**

**పాలకుర్తి ఆగస్టు 4(మనం న్యూస్ ):** అమెరికాలో నిర్వహించిన టీడీఎఫ్ (ఖ్రీఉ) కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారతదేశం నుంచి విచ్చేసిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అమెరికాలోని తెలుగు సంఘాల ప్రతినిధులు, ప్రవాస భారతీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొని పలువురు ప్రముఖులను కలుసుకుని ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ సామాజిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు టీడీఎఫ్ వంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రవాస భారతీయులు తమ మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగిస్తూ విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలు అందించడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రవాస భారతీయుల సహకారం ఎంతో కీలకమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి వేదికల ద్వారా పరస్పర సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రముఖులతో కలిసి జ్ఞాపక చిత్రాలు దిగారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంత్రి దనసరి సీతక్క



**ఏటూర్ నాగారం, ఆగస్టు 4, మనం ప్రతినిధి:** ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం ఏటూరునాగారం సీహెచ్సీ ఆసుపత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పరిశీలించి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులతో కలిసి సీజనల్ వ్యాధులు, వైద్య సేవలు, ఆసుపత్రిలో అందుతున్న సౌకర్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించడం శిక్షగా కాకుండా సేవ చేసే గొప్ప అవకాశంగా భావించాలని అన్నారు. ప్రజలకు ఆపద సమయంలో ప్రాణాలు కాపాడే వైద్యులు, నర్సులు కనిపించే దేవుళ్లతో సమానమని పేర్కొన్నారు. పాము కాట్లు, డెంగ్యూ, విషజ్వరాలు, ప్రమాదాల వంటి ప్రతి కేసును అత్యంత బాధ్యతతో చూడాలని, ప్రతి రోగి ప్రాణం విలువైనదేనని తెలిపారు. చిన్న చిన్న సమస్యలకు సైతం రోగులను వరంగల్, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు తరలించకుండా, స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఏటూరునాగారం వంటి వెనుకబడిన ప్రాంతాల్లో పనిచేయడం వృత్తిపరంగా ఎంతో అనుభవాన్ని, నైపుణ్యాన్ని పెంచుతుందని చెప్పారు. కష్టపడి పనిచేస్తేనే విజయవంతమైన వైద్యులుగా, సిబ్బందిగా గుర్తింపు పొందగలరని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సానుకూల వాతావరణం, రోగుల పట్ల మంచి ప్రవర్తన ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆసుపత్రికి వచ్చిన రోగికి ఇంట్లో ఉన్న భావన కలిగేలా సిబ్బంది వ్యవహరించాలని, వైద్యుల మాటలు, ప్రవర్తనే రోగుల్లో సగం వ్యాధిని తగ్గిస్తాయని అన్నారు. ఏటూరునాగారంలో రవాణా, వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, భద్రాద్రి, లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలు, బొగత జలపాతం వంటి పర్యాటక ప్రాంతాలు సమీపంలో ఉన్నాయని తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు. అంతకముందు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు అనంతరం 30 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన అంతర్గత సిసి రోడ్లను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, సి హెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ సురేష్, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్, ఆత్మ కమిటీ సభ్యులు రఘు, అరుణ, స్థానిక సర్పంచ్ శ్రీలత , వైద్య బృందం ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ మహిళ వద్ద పుట్టగొడుగులు కొనుగోలు చేసిన మంత్రి సీతక్క



- కాన్వాయ్ ఆపి పుట్టగొడుగులు కొనుగోలు..
- అటవీ ఉత్పత్తులకు ప్రోత్సాహం

**ములుగు , ఆగస్టు 04: మనం ప్రతినిధి:** ములుగు జిల్లాలో పర్యటనలో భాగంగా మేడారం పర్యటన ముగించుకుని ఏటూరునాగారం వైపు వెళ్తున్న రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క మార్గమధ్యలో ఆదివాసీ మహిళ పుట్టగొడుగులు విక్రయిస్తుండటాన్ని గమనించి తన కాన్వాయ్ను ఆపారు. అనంతరం ఆమె వద్ద పుట్టగొడుగులను స్వయంగా కొనుగోలు చేసి ఆదివాసీ మహిళను ప్రోత్సహించారు.

అడవిలో సేకరించిన పుట్టగొడుగులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ మహిళతో మంత్రి సీతక్క కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడారు. పుట్టగొడుగుల విక్రయాల గురించి, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్టగొడుగులను కొనుగోలు చేసి ఆమెకు అండగా నిలిచారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పుట్టగొడుగులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. కరోనా సమయంలో తాను కూడా పుట్టగొడుగులు తిన్నానని గుర్తుచేసుకున్నారు. సహజసిద్ధంగా లభించే అటవీ ఉత్పత్తులను సేకరించి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న ఆదివాసీ మహిళలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాప్రతినిధిగా ఉన్నత పదవిలో ఉన్నప్పటికీ మార్గమధ్యంలో సాధారణ ప్రజలతో మమేకమై వారి జీవన పరిస్థితులను తెలుసుకుంటూ, స్థానిక ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేయడం ద్వారా మంత్రి సీతక్క మరోసారి తన సరళతను చాటుకున్నారు. మంత్రి పుట్టగొడుగులు కొనుగోలు చేయడంతో ఆదివాసీ మహిళ ఆనందం వ్యక్తం చేశారు.

# మేడారం చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



- స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక అభివృద్ధి: మంత్రి సీతక్క

**తాడ్వాయి, ఆగస్టు 4,మనం ప్రతినిధి:** మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ చివరిదశ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక అభివృద్ధి సాధించాలని మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్ ఎస్ తాడ్వాయి మండలం మేడారం ఆలయ పరిసర ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క మంగళవారం పరిశీలించారు. అనంతరం వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అ నంతరం సమ్మక్క భవన్లో మదర్ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఉచిత కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆలయ పరిసరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయని, నిర్మాణ పనులను వేగంగా సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. కుట్టు శిక్షణతో పాటు కుట్టుమిషన్ల పంపిణీ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. మహిళల స్వావలంబన, సాధికారత కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్రెడ్డి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, ప్రత్యేక అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**వరంగల్, ఆగస్టు 4: (మనం ప్రతినిధి ):** నూతనంగా నిర్మాణంలో ఉన్న వరంగల్ జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, వివిధ విభాగాల పనుల స్థితిగతులను పరిశీలించిన కలెక్టర్, ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భవన నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, కూడా సిపిఓ అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# సిపి శ్వేతా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రెడ్డి జే ఏ సి నేతలు




**హనుమకొండ ఆగస్టు 04(మనం ప్రతినిధి ):** వరంగల్ పోలీసు కమీషర నేటు కు నూతనంగా వచ్చిన సి పి శ్వేతా రెడ్డి ని రెడ్డి జే ఏ సి రాష్ట్ర అధ్యక్షులు గోపు జైపాల్ రెడ్డి జిల్లా అధ్యక్షులు అర్జుల కిషన్ రెడ్డి కలిసి వారికి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.శ్వేతా రెడ్డి ఎంతో కష్టపడి చదివి మొదటి ప్రయత్నం లో ఐ పి ఎస్ సాధించి వివిధ హోదాల్లో పనిచేసి వరంగల్ సి పి గా రావడం గర్వకారణం అన్నారు శాంతి భద్రతల పరిరక్షణ లో వరంగల్ పోలీస్ కమిషరనేట్ ను ముందు వుంచాలని రెడ్డి జాక్ పక్షాన పోలీసు చేసే సేవ కార్యక్రమాల్లో తమ వంతు సహకారం వుంటుందని అన్నారు

సి పి ని కలిసిన వారిలో హసన్ పర్తి రెడ్డి సంఘం అధ్య క్షులు వీసం సురేందర్ రెడ్డి తో పాటు రెడ్డి సంఘం నాయకులు రాధారపు సంజీవ రెడ్డి దామోదర్ రెడ్డి నల్లా రాజీ రెడ్డి గంగిడి ప్రభాకర్ రెడ్డి రాఘవ రెడ్డి కర్ణాకర్ రెడ్డి వున్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

- ఎస్పీ సంకీర్త్



**భూపాలపల్లి ఆగస్టు 4 మనం ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్మెంట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సంకీర్త్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 7,112 పోలీసు ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్పీఎఫ్, జైళ్ల శాఖ తదితర విభాగాల్లో సుమారు 7,112 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, భూపాలపల్లి జిల్లా నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాలు సాధించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీస్ రిక్రూట్మెంట్ కోచింగ్ నిర్వహించనున్నట్లు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ తెలిపారు. జిల్లాలోని పేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల యువతకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు.అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అర్హత కలిగిన ఫిజికల్ ట్రైనర్ల ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ అందించబడుతుందని, ఇందులో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు 04-08-2026 నుండి 15-08-2026 వరకు తమ సమీప పోలీస్ స్టేషన్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళా అభ్యర్థులు కూడా ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కోచింగ్ ప్రారంభ తేదీ, శిక్షణా కేంద్రం మరియు ఇతర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా మీడియా ద్వారా వెల్లడిస్తామని తెలిపారు. పోలీసు ఉద్యోగం లక్ష్యంగా పెట్టుకున్న ప్రతి యువకుడు, యువతి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్రమశిక్షణతో శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి

**ఐనవోలు, ఆగస్టు 4(మనం న్యూస్ ):** ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్ను పరిశీలించిన కలెక్టర్, ప్రతిరోజు ఎంతమంది రోగులు చికిత్స పొందుతున్నారనే వివరాలను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు, వైద్య సామగ్రి నిల్వ ఉంచిన స్టోర్రూమ్ను పరిశీలించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య స్వస్థత కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశమైన కలెక్టర్, ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇప్పటివరకు జరిగిన సాధారణ ప్రసవాల సంఖ్య, గర్భిణులకు అందిస్తున్న సేవలు, అవగాహన కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలకు ప్రోత్సహించేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అవసరం లేని సిజేరియన్ ప్రసవాలు తగ్గించి, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు కుటుంబాలపై ఆర్థిక భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను అత్యధికంగా ప్రోత్సహించిన ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను ప్రోత్సాహక అవార్డులతో సత్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో స్థానిక తహసీల్దార్ విక్రమ్ కుమార్, వైద్యాధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలి



- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి
- ఐనవోలులోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్

**ఐనవోల్ ఆగస్టు 4(మనం న్యూస్ ):** హనుమకొండ: ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఏపి, ఇతర ఎరువుల నిల్వలను షాపు యజమాని తిరుపతిని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ షాప్ కు ఎక్కడినుండి ఎరువులు విత్తనాలు వస్తుంటాయనే సమాచారాన్ని ఆరా తీశారు. ఇప్పటివరకు ఎన్ని యూరియా బస్తాలు విక్రయించారని, వాటికి సంబంధించిన రికార్డును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని అన్నారు. యూరియా, ఇతర ఎరువులు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ విక్రమ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# హలో బిసి... ఛలో బెంగళూరు

- వాల్ పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్న డాక్టర్ పి గోపాల్, డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**హనుమకొండ, ఆగస్టు 4 (మనం ప్రతినిధి):** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాలయంలో పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న బెంగుళూరులో జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ 11వ మహాసభలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ పి గోపాల్, వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ లు బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించే అఖిలభారత జాతీయ ఓబీసీ 11వ మహా సభకు బీసీ నాయకులు పాల్గొని ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. బీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచి బీసీలకు 50% చట్ట సభల్లో రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు బొనగాని రవీందర్, గాదె భద్రయ్య, జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షుడు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శులు గాండ్ల శ్రీనివాస్, నూనె రంజిత్ కుమార్ ముదిరాజ్, బీసీ నాయకులు ఒడిసెల శ్రీనివాస్, గుంటుక రాజ్ కుమార్, కందికొండ సురేష్, అక్కపెల్లి కిషోర్ వినోద్ కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వేపై ప్రత్యేక గ్రామసభలు



**కన్నాయిగూడెం,మనం న్యూస్ ఆగస్టు 4:** ములుగు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కన్నాయిగూడెం మండలంలోని 19 రెవెన్యూ గ్రామాల్లో రీ-సర్వే కార్యక్రమానికి ముందు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సయ్యద్ సర్వర్ తెలిపారు. రీ-సర్వే ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించడం, గ్రామస్థుల అభిప్రాయాలు తెలుసుకోవడం, గ్రామసభ తీర్మానం తీసుకోవడం ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.సర్వే భూరికార్డుల శాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 19 గ్రామసభలు నిర్వహించన న్నారు. ఆగస్టు 5: గుర్రేవుల, రాంపూర్, కొత్తూర్ (పి.జి.), ఆగస్టు 6: లక్ష్మీపురం (పి.జి.), దేవధుముల, తూపాకులగూడెం, ఆగస్టు 7: గంగారం (పి.జి.), అందుకపల్లి, ఆగస్టు 11: కన్నాయిగూడెం, గంగుగూడెం, ఆగస్టు 12: రాజన్నపేట, ఆగస్టు 13: సర్వాయి, ఆగస్టు 14: భూపతిపురం, పొరేడు, పడిగాపూర్ (పట్టిగొర్రెవులు), ఆగస్టు 17: ఏటూరు, సింగారం, ఆగస్టు 18: చింతగూడెం, ఆగస్టు 19: ఐలాపూర్లలో నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లో రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులు, గ్రామపం చాయతీ ప్రతినిధులు పాల్గొని రీ-సర్వే ప్రక్రియ, భూహద్దుల నిర్ధారణ, ప్రజలు పాటించా ల్సిన విధానాలపై వివరించనున్నారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, రైతులు, భూ యజమా నులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలకు హాజరై సహకరించాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు. గ్రామసభ అనంతరం గ్రామ తీర్మానం తీసుకొని రీ-సర్వే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

# భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

- రీ-సర్వే షెడ్యూల్ను ముందస్తుగా రైతులకు తెలియజేయాలి
- హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి



**ఐనవోలు: ఆగస్టు 4, (మనం న్యూస్ ):** భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే రైతులకు తెలియజేసి వారి సహకారంతో పనులు చేపట్టాలని హనుమకొండ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి సర్వేయర్లను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో భూముల కొలతల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను ఇన్చార్జి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమికి రీ-సర్వే పూర్తయిందని, రోజువారీగా ఎంత విస్తీర్ణంలో సర్వే నిర్వహిస్తున్నారని, ఎన్ని రోవర్ పరికరాలతో సర్వే చేపడుతున్నారని సర్వేయర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి రీ-సర్వే ప్రక్రియ, పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రస్తుతం గ్రామంలో రెండు సర్వే బృందాలు రీ-సర్వే పనులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ, ప్రతి సర్వే బృందం రోజుకు కనీసం 75 ఎకరాల భూమిని రీ-సర్వే చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. సర్వే ప్రారంభానికి ముందే కార్యాచరణ రూపొందించి, ఆయా ప్రాంతాల రైతులకు తేదీలు, సమయాలపై ముందస్తు సమాచారం అందించాలని ఆదేశించారు.

రైతుల సమన్వయంతో, నిర్దేశిత లక్ష్యాల ప్రకారం ప్రతిరోజూ రీ-సర్వే చేపడితే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సర్వే పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ-సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఈ పరిశీలనలో భూములు కొలతల శాఖ సహాయ సంచాలకులు నూర్ సింగ్, ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ కుమార్, సర్వేయర్ సూరజ్ కుమార్, జీపీవో శ్రీకాంత్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీసీఐ పెన్షన్ ఎంత.. ఎవరెవరికి వస్తుంది..?



అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో బీసీసీఐ మాజీ క్రికెటర్లకు అందించే పెన్షన్ పథకం మరోసారి చర్చలోకి వచ్చింది. 2004లో ప్రారంభమైన ఈ పథకంలో సుమారు 900 మంది మాజీ క్రికెటర్లు, అంపైర్లు, ఇతర అధికారులు ప్రయోజనం పొందుతున్నట్లు సమాచారం.

మొదట్లో కనీసం ఒక టెస్టు మ్యాచ్ ఆడిన మాజీ క్రికెటర్లకు నెలకు రూ.5,000 పెన్షన్ అందించేవారు. 2022లో బీసీసీఐ పెన్షన్ మొత్తాలను భారీగా పెంచింది. దీంతో సుమారు 900 మంది మాజీ క్రికెటర్లు, అంపైర్లు, అధికారులు లబ్ధి పొందారు.

**ప్రస్తుతం క్రికెటర్ల నెల పెన్షన్ ఎంత..?**

25 లేదా అంతకంటే ఎక్కువ టెస్టులు ఆడిన పురుష క్రికెటర్లు- రూ.70,000

ఇతర మాజీ పురుష టెస్టు క్రికెటర్లు- రూ.60,000

మాజీ మహిళా అంతర్జాతీయ క్రికెటర్లు- రూ.52,500

2003కు ముందు రిటైరైన ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు- రూ.45,000

ఇతర మాజీ ఫస్ట్ క్లాస్ క్రికెటర్లు- రూ.30,000

**జీవితాంతం వస్తుందా..?**

అందుబాటులో ఉన్న నివేదికల ప్రకారం, పెన్షన్ సాధారణంగా శాశ్వతంగా రద్దు కాదు. అయితే మాజీ క్రికెటర్ లేదా అధికారి బీసీసీఐ లేదా రాష్ట్ర క్రికెట్ సంఘంలో జీతభత్యాలు తీసుకునే పదవిలో చేరితే, ఉదాహరణకు కోచ్, సెలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ వంటి బాధ్యతలు చేపడితే, పెన్షన్ చెల్లింపులో తాత్కాలిక విరామం ఉండవచ్చు.

**పెన్షన్ పొందుతున్న ప్రముఖ క్రికెటర్లు..?**

పెన్షన్ పొందుతున్న మాజీ క్రికెటర్ల జాబితాను బీసీసీఐ అధికారికంగా వెల్లడించలేదు. అయితే అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, పెన్షన్ అర్హత ఉన్న ప్రముఖ మాజీ క్రికెటర్లలో ప్రస్తుతం సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్ వంటి వారు ఉంటారు.

**అజింక్య రహానేకు ఎంత..?**

రహానే భారత్ తరపున 85 టెస్టులు ఆడాడు. కాబట్టి అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన తర్వాత అత్యధిక రూ.70,000 నెలవారీ పెన్షన్ బ్రాకెట్ కు అర్హత పొందుతాడు.

## మంచు మనోజ్ 'వడ్డీ కాసులవాడ'లో కోలీవుడ్ హీరో

మంచు మనోజ్, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్ లో వరుస సినిమాలతో ఫుల్ ఫామ్ లో దూసుకుపోతున్నారు. ఇటీవల 'భైరవం' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చిన ఆయన బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోవడమే కాకుండా, ఆ తర్వాత చేసిన 'మిరాయ్' సినిమాతో కూడా బాక్సాఫీసు వద్ద భారీ సంచలనాన్ని సృష్టించారు. అదే జోష్తో ప్రస్తుతం ఆయన ప్రధాన పాత్రలలో



డేవిడ్ రెడ్డి, వడ్డీ కాసులవాడ వంటి విభిన్నమైన ప్రాజెక్టులలో నటిస్తూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వీటిలో పూర్తి ఫన్ అండ్ ఆద్యంతం అలరించే ఎంటర్ టైన్ మెంట్ నేపథ్యంలో రాబోతున్న 'వడ్డీ కాసులవాడ' చిత్రానికి తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. వరుస బ్లాక్ బస్టర్ హిట్లతో మంచి ఫామ్ లో ఉన్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై నిర్మాత అనిల్ సుంకర ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. మంచు మనోజ్ కెరీర్ లో చిరస్థాయిగా నిలిచిపోయిన 'బిందాస్' సినిమా తర్వాత దాదాపు 16 ఏళ్లకు నిర్మాత అనిల్ సుంకరతో ఆయన మళ్లీ కలిసి వర్క్ చేస్తుండటం విశేషం. ఒక సామాన్య మానవుడు తన నిత్యజీవితంలో ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోరాటాల నేపథ్యంలో ఈ చిత్రం రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన గ్లింప్స్ కు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ దక్కగా, ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఒక క్రేజీ వార్త నెట్టింట బాగా హల్ చల్ చేస్తోంది. ఇందులో కోలీవుడ్ స్టార్ హీరో రవి మోహన్ వెంకటేశ్వర స్వామి పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఆ ప్రత్యేక పాత్ర కోసం మూవీ టీమ్ ఆయనను సంప్రదించగా, కథ, తన క్యారెక్టర్ డిజైన్ ఎంతగానో నచ్చడంతో నటించేందుకు ఆయన వెంటనే ఒప్పుకున్నట్లు టాక్ నడుస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా చిత్రయూనిట్ నుంచి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి.

## పాకిస్థాన్ బాక్సర్ మిస్సింగ్

కామన్వెల్త్ గేమ్స్ 2026 తర్వాత పాకిస్థాన్ బాక్సర్ కుద్రతుల్లా మిస్ అయినట్లు తెలుస్తోంది. పోటీలు ముగిసిన అనంతరం టీమ్ హోటల్ నుంచి వెళ్లిన అతడు అదృశ్యమైనట్లు సమాచారం. అతని పాస్ పోర్ట్ కూడా టీమ్ మేనేజర్ వద్దే ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదే తొలిసారి కాదు

అంతర్జాతీయ టోర్నీల సమయంలో పాకిస్థాన్ బాక్సర్లు అదృశ్యమైన ఘటనలు గతంలోనూ చోటుచేసుకున్నాయి. 2022 కామన్వెల్త్ గే ఎ్ ౦ ౬



సందర్భంగా సులేమాన్ బలోచ్, నజీరుల్లా ఖాన్ బర్మింగ్ హామ్ లో అదృశ్యమయ్యారు. అప్పట్లోనూ వారి పాస్ పోర్టులు మేనేజర్ వద్దే ఉన్నట్లు సమాచారం.

2024లో ఇటలీలో జరిగిన వరల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ సందర్భంగా ఆసియా గోల్ మెడలిస్ట్ బాక్సర్ జోహైబ్ రషీద్ (పాక్) తన రూమ్ మేట్ కు చెందిన విదేశీ కరెన్సీ, విలువైన వస్తువులను తీసుకుని బస్టో అర్సిజియో పట్టణంలో అదృశ్యమైనట్లు ఆరోపణలు వచ్చాయి.

**ఒక్క పతకంతో సరిపెట్టుకున్న పాక్**

కామన్వెల్త్ గేమ్స్ 2026లో పాక్ కు ఒకే ఒక పతకం లభించింది. ఈ పోటీల్లో మొత్తం 36 మంది సభ్యులు పాల్గొనగా..మహిళల బాక్సింగ్ లో ఫాతిమా జెహ్రా కాంస్య పతకాన్ని సాధించింది.

## జెమీమా మెరుపులు వృథా..



హండ్రెడ్ వుమెన్ కాంపిటీషన్ లో సదరన్ బ్రేవ్ వుమెన్ తొలి ఓటమిని చవిచూసింది. సోమవారం రాత్రి సదరన్ బ్రేవ్ తో జరిగిన మ్యాచ్ లో వెల్ష్ ఫైర్ తో ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన సదరన్ బ్రేవ్ వుమెన్ 100 బంతుల్లో 5 వికెట్ల నష్టానికి 121 పరుగులుచేసింది.

లారా వోల్వర్ట్ (45 బంతుల్లో 48), జెమీమా రోడ్రిగ్స్ (21 బంతుల్లో 25) రాణించారు. వెల్ష్ ఫైర్ బౌలర్లలో హెథర్ గ్రహమ్, గ్రేస్ పాట్స్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం వెల్ష్ ఫైర్ నిర్ణీత వంద బంతుల్లోనే 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వెల్ష్ ఫైర్ బ్యాటింగ్ లో టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్ లో హెథర్ గ్రహమ్ (28 బంతుల్లో 35 నాటౌట్) అజేయంగా నిలిచి జట్టును గెలిపించింది. ఆమెకు గ్రేస్ థాంప్సన్ (16), నిమ్ష్ హోలండ్ (12 నాటౌట్) సహకారం అందించారు.

సదరన్ బ్రేవ్ బౌలర్లలో టిల్లీ కోర్టీన్ 3 వికెట్లు తీయగా, ఇస్సీ వాంగ్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో వెల్ష్ ఫైర్ 5 మ్యాచ్ ల్లో రెండో విజయంతో పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా, సదరన్ బ్రేవ్ ఓటమి పాలైనప్పటికీ టాప్ లోనే కొనసాగుతోంది.

## 20 గంటలు పనిచేస్తూనే ఉన్నా – కీర్తి సురేశ్



ప్రముఖ నటి కీర్తి సురేశ్ తన సినిమా షూటింగ్స్ తో ఎంత బిజీగా ఉంటున్నారో తెలుపుతూ ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. కంటిమీద కునుకు లేకుండా వరుస షూటింగ్స్ లో పాల్గొన్నట్లు వెల్లడించారు.

తన వర్క్ షెడ్యూల్ ఎంత కష్టంగా ఉందో వివరిస్తూ కీర్తి సురేశ్ ఓ వీడియోను పోస్ట్ చేశారు. తీవ్ర అలసట కారణంగానే తాను ఈ వీడియోను ఆలస్యంగా పోస్ట్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ''నిన్న ఈ వీడియోను పోస్ట్ చేసే ఓపిక కూడా నాకు లేదు. ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్ కు వెళ్తూనే ఉన్నా. నిన్న ఉదయం 6 గంటలకు నా గదిలోంచి బయలుదేరాను. మళ్లీ ఇప్పుడు ఉదయం 6 గంటలు అవుతోంది. దాదాపు 24 గంటల తర్వాత నా గదిలోకి అడుగుపెట్టాను. అందులో 20 గంటల పాటు పనిలోనే ఉన్నాను. అసలు విషయం ఏమిటంటే.. మళ్లీ ఇంకో గంటలో నా తర్వాతి షూటింగ్ కోసం బయలుదేరాలి. ఇలాంటి సమస్యల గురించి ఫిర్యాదు చేయడం కూడా మంచిదే. జీవితం అంటే ఇదే కదా? దీన్ని నేను ఓ ఆశీర్వాదంగా భావిస్తున్నాను'' అని కీర్తి పేర్కొన్నారు.

శారీరకంగా ఎంత శ్రమపడినా కీర్తి సురేశ్ తన ఉత్సాహాన్ని కోల్పోలేదు. విరామ సమయంలో తీసిన ఓ మిర్రర్ సెల్ఫీని అభిమానులతో పంచుకున్నారు. అందులో ఆమె ధరించిన తెల్లటి టీషర్ట్ పై 'ఐ విల్ సర్వైవ్' (నేను నిలబడతా) అని రాసి ఉంది. దాన్ని చూపిస్తూ.. ''మళ్లీ షూటింగ్ కు వెళ్తున్నా. ఈ రోజు ఈ టీషర్ట్ పై ఉన్న అక్షరాలకు నిజమైన అర్థం దొరికింది. అవును, నేను నిలబడతా'' అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చారు. ఇటీవల సినీ పరిశ్రమలో నటీనటుల '8 గంటల పని' గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె తన బిజీ షెడ్యూల్ గురించి ఇన్స్టా గ్రామ్ వేదికగా పంచుకోవడం గమనార్హం.

ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'రఫ్తార్', 'అక్క', 'రౌడీ జనార్దన' చిత్రాలతో పాటు వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్ లో వస్తున్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. ఇలా విభిన్నమైన పాత్రలతో భారతీయ వెండితెరపై ఆమె తనకంటూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు.

## ఇతరులను దూషిస్తూ బ్రతికేవారి జీవితం ఎప్పటికైనా నాశనమైపోతుంది..

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నివేదా పేతురాజ్ చివరగా 'దాస్ కా దమ్కీ' మూవీలో నటించారు. ఆ తర్వాత పూర్తిగా సినిమాలకు దూరం అయి.. తన వ్యక్తిగత జీవితానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ వచ్చిన నివేదా, తన ప్రియుడు రాజ్హిత్ ఇబ్రాన్ను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుని కుటుంబ సభ్యుల సమక్షంలో ఎంగేజ్మెంట్ కూడా చేసుకున్నారు. అయితే అనూహ్యంగా మనస్పర్థలు రావడం వల్ల, వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందే ఇద్దరూ పరస్పర అంగీకారంతో బ్రేకప్ చెప్పుకుని విడిపోయారు. అలా వ్యక్తిగత వేదనను అనుభవించిన ఈ ముద్దుగుమ్మ, ఆ బాధలన్నింటినీ పక్కన పెట్టి మళ్లీ తన దృష్టిని నటనపైనే పూర్తి ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి, ఇటీవల విడుదలైన 'సింగ్ గీతం' అనే చిత్రంతో బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన బ్లాక్బస్టర్ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ విజయంతో మళ్లీ ఫుల్ ఫామ్లోకి వచ్చిన నివేదాకు వరుసగా క్రేజీ ఆఫర్లు తలుపు తడుతున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో ఆదర్శ కుటుంబం, మెగాస్టార్ ప్రాజెక్ట్ మెగా-158, రామ్ పోతినేని 'రాపో-23' వంటి అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ చిత్రాలు ఉన్నాయి. ఇలా బ్యాక్ టు బ్యాక్ పెద్ద సినిమాల షూటింగ్లతో ఒకవైపు రాత్రింబవళ్లు ఫుల్ బిజీగా గడుపుతూ, తన కెరీర్ను సరైన దారిలో పెడుతున్న సమయంలోనే ఆమె ఒక ఊహించని ట్విస్ట్ ఇచ్చారు.



తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో ఓ క్రిప్టిక్ పోస్ట్ను షేర్ చేసి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. 'బ్రతికి ఉన్నంత కాలం నీతిగా, నిజాయితీగా జీవించి చనిపోయినా మంచి పేరే మిగులుతుంది. కానీ, ఇతరులను నిందిస్తూ, మనసులో ఒకటి పెట్టుకుని పైన ఇంకొకటి నటిస్తూ బ్రతికితే.. ఆ జీవితం ఎప్పటికైనా నాశనమైపోతుంది' అనే అర్థం వచ్చే ఒక శక్తివంతమైన వ్యాఖ్యాన్ని ఆమె షేర్ చేశారు. నివేదా నుండి సడెన్గా ఇలాంటి పోస్ట్ రావడం చూసి అభిమానులు, నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ పోస్ట్ వెనుక ఉన్న అసలు కారణమేమై ఉంటుందనే దానిపై నెట్టింట రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. గతంలో నిశ్చితార్థం రద్దయి విడిపోయిన తన మాజీ ప్రియుడిని ఉద్దేశించి, అతడి ప్రవర్తనపై విసుగు చెంది ఆమె ఈ వ్యాఖ్యలు చేశారా? లేక ఇటీవల కాలంలో సినీ నటీమణులను లక్ష్యంగా చేసుకుని డీప్ఫేక్ ఫొటోలు, అసభ్యకరమైన వీడియోలు సృష్టిస్తూ డిజిటల్ వేధింపులకు గురిచేస్తున్న సోషల్ మీడియా కేటుగాళ్లకు హెచ్చరికగా ఈ పోస్ట్ పెట్టారా? అంటూ సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. వరుస సినిమాలతో సక్సెస్ ట్రాక్లో ఉన్న సమయంలో నివేదా పెట్టిన ఈ పోస్ట్ ప్రస్తుతం హాట్ టాపిక్గా మారింది.

## అందుకే శూర్పణఖ పాత్రను అంగీకరించా



ఈ మధ్య కాలంలో 'దే దే ప్యార్ దే 2', 'పతి పత్నీ ఔర్ వో దో' లాంటి చిత్రాలతో ప్రేమికురాలిగా తెరపై మెరిసింది నాయిక రకుల్ ప్రీత్ సింగ్. ఇప్పుడామె మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటి?' అని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. ''శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను కేవలం ఒకే ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. ఒక నటిగా ప్రేక్షకుల్లో ఇప్పటికే ఉన్న పాత ఆలోచలను, అభిప్రాయాలను మార్చేలా ఉండే వైవిధ్యమైన పాత్రలు చేయడం నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒకే చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా'' అని ఆ పోస్ట్ లో పేర్కొంది.

## ఆ గోల్డెన్ అవకాశాన్ని కోల్పోయినందుకు నేను ఇప్పటికీ బాధపడుతున్నా: శ్రీను వైట్ల

టాలీవుడ్ దర్శకుడు శ్రీనువైట్ల యాక్షన్, కామెడీ చిత్రాలు తెరకెక్కించి పలు హిట్స్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన చార్మింగ్ స్టార్ శర్వానంద్ తో కలిసి ఒక భారీ అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రాన్ని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ప్రతిష్టాత్మక సినిమాను ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర తన ఏకే ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు గ్రాండ్ గా పూర్తి కాగా, త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభించబోతున్నట్లు టాక్. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

ఇదిలా ఉంటే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీను వైట్ల, తన సినీ కెరీర్ లో ఒక గోల్డెన్ అవకాశాన్ని వదులుకుని ఇప్పటికీ ఎంతో బాధపడుతున్నట్లు తెలుపుతూ ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. 'నేను 2011 లో కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ గారిని ప్రత్యేకంగా కలిశాను. అప్పటికే ఆయన నేను తెరకెక్కించిన 'దూకుడు' సినిమా చూశారు. ఆ మూవీ ఆయనకు బాగా నచ్చడంతో, నేను స్వయంగా దర్శకత్వం వహిస్తే ఆ చిత్రాన్ని తమిళంలో రీమేక్ చేయడానికి ఆయన ఎంతో ఆసక్తి చూపించారు. కానీ అప్పటికే నేను యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో 'బాద్షా' సినిమాకు అంగీకరించి ఉండటం, పైగా నాకు తమిళ భాషపై పెద్దగా పట్టు లేకపోవడంతో ఆ సువర్ణావకాశాన్ని కోల్పోయాను. అంతటి స్టార్ హీరోతో పనిచేసే అవకాశం చేజారడంపై నాకు ఇప్పటికీ చాలా బాధగా అనిపిస్తుంది' అని శ్రీను వైట్ల వెల్లడించారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.